www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మాయమవుతున్న ఫేక్ వీడియోలు

సోషల్ మీడియా నుంచి తొలగిస్తున్న వేలాది మంది

కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో..

అలజడి సృష్టించిన నకిలీ వీడియోలు, ఫొటోలు

పలువురు బీఆర్ఎస్ నేతలపై ఫిర్యాదులు

ఫేక్ వీడియోలను సృష్టించి, ప్రచారం చేసిన

వారిని గుర్తించే పనిలో సైబర్ క్రైమ్ బృందాలు

పోస్టులు డిలీట్ చేసినా.. కేసు తప్పదని హెచ్చరిక

2

క్రిశాంక్‌కు నోటీసు ఇచ్చి విచారణ చేపట్టండి

ఫేక్ వీడియోల కేసులో హైకోర్టు

కంచ గచ్చిబౌలి భూ స్కాంను

48 గంటల్లో బయటపెడతా

కేటీఆర్ హెచ్చరిక

బుధవారం | 9-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 10 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: ద్వాదశి రా.10.56 తదుపరి త్రయోదశి, నక్షత్రం: మఖ ఉ.9.57 తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.6.46-రా.8.31, దుర్ముహూర్తం:ఉ.11.52-12.41, అమృతఘడియలు: ఉ.7.20-9.04, తె.5.20 మొదలు, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: ఉ.6.07, సూర్యాస్తమయం: 6.26 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్లు..

దోషులకు ఉరే సరి

ఖరారు చేసిన హైకోర్టు ధర్మాసనం

ఎన్ఐఏ కోర్టు తీర్పునకు సమర్థన.. దోషుల అప్పీల్ డిస్మిస్

దోషుల్లో పరివర్తన వస్తుందనే విశ్వాసం కనిపించడం లేదు

శిక్షను జీవితఖైదుగా మార్చడం వృథా.. హైకోర్టు ధర్మాసనం

45 రోజుల పాటు 157 మంది సాక్షుల విచారణ

ఆ ఘటన నేటికీ వెంటాడుతున్న పీడకల.. బాధితుల ఆవేదన

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, దిల్‌సుఖ్‌నగర్, చాదర్‌ఘాట్, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో దోషులకు మరణశిక్షే సరి అని హైకోర్టు ధ్రువీకరించింది. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు వీరికి మరణశిక్ష విధిస్తూ 2016లో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. దోషుల్లో పరివర్తన వస్తుందనే విశ్వాసం కనిపించడం లేదని, శిక్షను జీవిత ఖైదుగా మార్చడం వృథా ప్రయాసే అవుతుందని వ్యాఖ్యానించింది. ఎన్ఐఏ కోర్టు తీర్పుపై దోషులు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. మరణ శిక్ష పడ్డ ఉగ్రవాదుల్లో అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డీ, జియా-ఉర్-రహ్మాన్ అలియాస్ వఘాస్ అలియాస్ నబీల్ అహ్మద్, మహమ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్ అలియాస్ మోనూ, యాసిన్ భత్కల్ అలియాస్ షారూఖ్, ఎజాజ్ షేక్ అలియాస్ సమర్ అర్మాన్ తుండే అలియాస్ సాగర్ అలియాస్ ఐజాజ్ సయీద్ షేక్ ఉన్నారు. 2013 ఫిబ్రవరి 21న సాయంత్రం 7 గంటల సమయంలో.. సెకన్ల వ్యవధిలో దిల్‌సుఖ్‌నగర్ 107 బస్టాండ్, సమీపంలోని ఏ1-మిర్చీ సెంటర్ వద్ద రెండు భారీ పేలుళ్లు జరిగి, 18 మంది దుర్మరణంపాలయ్యారు. మరో 131 మందికి

మిగతా 12వ పేజీలో...

బిల్లుల ఆమోదానికి గవర్నర్ కాలయాపన

చట్టవిరుద్ధం

గవర్నర్లకు రాజ్యాంగం వీటో అధికారాలివ్వలేదు



వారు మంత్రివర్గ సూచనలకు కట్టుబడాల్సిందే.. ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుకారాదు

తమిళనాడు అసెంబ్లీ గవర్నర్‌కు పంపిన 10 బిల్లులూ ఆమోదం పొందినట్టే

వాటిపై రాష్ట్రపతి తదుపరి చర్యలూ చెల్లవ్.. సుప్రీం కోర్టు సంచలన తీర్పు

బిల్లులపై నిర్ణయానికి గవర్నర్లకు నెల నుంచి మూణ్నెల్ల దాకా గడువు

ఈ తీర్పుతో ఇకపై.. తమిళనాడు వర్సిటీలకు ముఖ్యమంత్రి స్టాలినే చాన్స్‌లర్

వీసీల నియామకాలకు దారి సుగమం.. సుప్రీం తీర్పు చరిత్రాత్మకం: ఎంకే స్టాలిన్

గవర్నర్ రాజ్‌భవన్‌ను వీడి వెళ్లిపోవాలంటూ డీఎంకే, మిత్రపక్షాల డిమాండ్

ఎన్నికైన ప్రజాప్రభుత్వాలు చట్టసభల్లో ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపకుండా, అలాగని వెనక్కి పంపకుండా.. ఏళ్లతరబడి కాలయాపన చేసే కొందరు గవర్నర్ల తీరుకు ఫుల్‌స్టాప్ పెడుతూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది! తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను దాదాపు మూడేళ్లుగా ఎటూ తేల్చకుండా నానుస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవిపై స్టాలిన్ సర్కారు వేసిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. తమకున్న విశేషాధికారాలను ఉపయోగించుకుని, ఆ బిల్లులు ఆమోదం పొందినట్టేనని ప్రకటించింది. అంతేనా.. ఇకపై, చట్టసభలు పంపే బిల్లులపై నిర్ణయాలు తీసుకోవడానికి గవర్నర్లకు గడువు విధిస్తూ సంచలన ఆదేశాలు జారీచేసింది!!

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమిళనాడు ప్రభుత్వం పంపిన 10 బిల్లులపై ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా మూడేళ్లపాటు తొక్కిపెట్టి, ఆ తర్వాత రాష్ట్రపతి పరిశీలనకు పంపడం చట్టవిరుద్ధం అని సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ బిల్లుల విషయంలో గవర్నర్ సదుద్దేశంతో వ్యవహరించలేదని, తాము ఓ కేసులో తీర్పు ఇచ్చిన తర్వాతే వాటిని రాష్ట్రపతి పరిశీలనకు పంపారని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం రెండోసారి పంపినప్పుడైనా గవర్నర్ వాటిని ఆమోదించి ఉండాల్సిందని అభిప్రాయపడింది. ఆర్టికల్ 142 ప్రకారం తనకున్న విశేషాధికారాలను వినియోగించుకుని.. స్టాలిన్ సర్కారు రెండోసారి గవర్నర్‌కు పంపినప్పుడే ఆ బిల్లులూ ఆమోదం పొందినట్టు పేర్కొంటూ

మిగతా 14వ పేజీలో...

గవర్నర్లు ఇవి పాటించాల్సిందే: సుప్రీం

- శాసనసభ తీర్మానించి పంపిన బిల్లును గవర్నర్లు గరిష్ఠంగా నెలరోజులకు మించి పెండింగ్‌లో ఉంచకూడదు. ఒకవేళ మంత్రివర్గ సిఫారసు మేరకు రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని భావిస్తే గనక.. నెలరోజుల్లోనే పంపాలి.
- మంత్రివర్గ సలహాలు, సూచనలకు విరుద్ధంగా.. సమ్మతిని నిలుపుదల చేయాలని గవర్నర్ భావిస్తే.. ఆ విషయాన్ని తెలుపుతూ గరిష్ఠంగా 3 నెలల్లోపు బిల్లును తిప్పి పంపాలి.
- మంత్రివర్గ సలహాలకు విరుద్ధంగా బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని భావిస్తే.. గరిష్ఠంగా మూడు నెలలలోపు ఆ పని చేయాలి.
- గవర్నర్ తిప్పి పంపిన బిల్లును... అసెంబ్లీ గనక మళ్లీ ఆమోదించి గవర్నర్‌కు పంపితే.. దాన్ని గరిష్ఠంగా నెలలోపు ఆమోదించాలి.



రిజిస్ట్రేషన్లకు.. రేపటి నుంచే

స్లాట్ బుకింగ్

22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో..

ప్రయోగాత్మకంగా అమలుకు ఏర్పాట్లు

10-15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి

కార్యాలయాల్లో పడిగాపులకు ఇకపై తెర

రోజుకు 48 స్లాట్‌లు అందుబాటులో

డిమాండ్ ఉంటే స్లాట్‌లు పెంచే వీలు

బుకింగ్ లేకుండా వచ్చేవారి కోసం..

రోజుకు 5 రిజిస్ట్రేషన్లకు అనుమతి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఇకపై దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు.. కార్యాలయానికి వెళ్లి గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన పని లేదు. మధ్యవర్తుల ద్వారా సబ్ రిజిస్ట్రార్‌ను ప్రసన్నం చేసుకోవాల్సిన అవసరం అంతకంటే లేదు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని, ఇచ్చిన సమయానికి కార్యాలయానికి వెళితే.. 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని బుధవారం నుంచే రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధమైంది. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకుగాను 22 కార్యాలయాల్లో దీనిని అమలు చేయనున్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ చర్యలు చేపడుతోంది. కాగా, ఒకేరోజు ఒకే సమయంలో

మిగతా 13వ పేజీలో...

అమెరికా..

కలలు కల్లలు!

విద్యార్థులపై ట్రంప్ సర్కారు మరో పిడుగు



కారు వేగంగా నడిపారని, లైసెన్స్ లేదని..

స్టూడెంట్ వీసాలు ఎడాపెడా రద్దు

కాలేజీలకూ సమాచారం ఇవ్వని అధికారులు

వీసా రద్దుతో పాటు స్వీయ బహిష్కరణ కూడా

హార్వర్డ్ నుంచి స్టాన్‌ఫోర్డ్ వరకూ ఇదే తీరు

వర్క్ వీసా రద్దుకు ట్రంప్ సర్కారు యోచన

ఓపీటీని ముగించాలని కాంగ్రెస్‌లో బిల్లు

వేలాది మంది భారతీయ విద్యార్థుల్లో గుబులు

హెచ్-1బీకి మారాలని నిపుణుల సూచనలు

దేశం విడిచి వెళ్తే రావడం కష్టమని హెచ్చరిక

చైనాపై ట్రంప్ బాదుడు 104 శాతానికి..

అమెరికా టారిఫ్‌లపై చర్చలే మార్గం: జైశంకర్

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఏప్రిల్ 8: అమెరికా చదువులు ఉద్యోగ భరోసాకు, ఆ దేశంలో శాశ్వత నివాసానికి బాటలు వేస్తాయన్న ధీమా సడలిపోతోంది. ఒకవైపు వర్క్ వీసా రద్దు చేయాలని భావిస్తోన్న ట్రంప్ సర్కారు... మరోవైపు విదేశీ విద్యార్థి వీసాలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే రద్దు చేస్తోంది. హెచ్-1బీ వీసా జారీకి కీలకమైన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్ రద్దు యోచన విదేశీ విద్యార్థులపై ప్రత్యేకించి స్టెమ్ కోర్సులు అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుంది. ఓపీటీని ముగించాలని కోరుతూ అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన కొత్త బిల్లు వారిలో ఆందోళన రేపుతోంది. వృత్తిపరమైన అనుభవాన్ని పొందడానికి, దీర్ఘకాలిక ఉపాధి వీసాలకు మారడానికి ఓపీటీపై ఆధారపడుతున్న అమెరికాలోని వేలాది మంది భారతీయ విద్యార్థుల కెరీర్ అవకాశాలను ఈ చర్య దెబ్బతీసే ప్రమాదం ఉంది. 2023-24 విద్యా సంవత్సరంలో భారత్‌కు చెందిన 3,31,602 మంది విద్యార్థులు అమెరికాలో విద్యనభ్యసిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 23% ఎక్కువ. వీరిలో సుమారు 97,556 మంది ఓపీటీలో పాల్గొన్నారు. ఓపీటీ రద్దుకు గతంలో చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పటికీ ప్రస్తుతం ట్రంప్ హయాంలో వలస వ్యతిరేక విధానాలు విస్తృతంగా అమలవుతున్న తరుణంలో ఈ బిల్లు తెరపైకి రావడం ఎఫ్-1, ఎం-1 వీసాదారుల్లో గుబులు రేపుతోంది. వీరిలో చాలామంది ఇప్పుడు తమ వీసాను హెచ్-1బీకి మార్చుకోవడానికి దోహదం చేసే ఉద్యోగాల కోసం భారతీయ టెక్ సంస్థల సహకారంతో



మిగతా 14వ పేజీలో...

కాంగ్రెస్ దిద్దుబాట!

క్షేత్రస్థాయి నుంచీ పార్టీ ప్రక్షాళనపై దృష్టి

ఎదురుదెబ్బల నేపథ్యంలో భారీగా సంస్థాగత మార్పులు

ఈ ఏడాది పునర్నిర్మాణంపైనే ఫోకస్: సీడబ్ల్యూసీ

'మతవాదం, హింసతో దేశం విద్వేష అగాధంలోకి కూరుకుపోతోంది'.. అని పేర్కొంటూ తీర్మానం

సర్దార్ పటేల్ అసలైన వారసత్వం కాంగ్రెస్ పార్టీదే: ఖర్గే

అహ్మదాబాద్‌లోని వల్లభ్ భాయ్ మెమోరియల్‌లో భేటీ

నేడు 1,700 మంది ప్రతినిధులతో ప్రధాన సదస్సు

పేదల విద్యపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. క్షమించలేని నేరం

'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ట్యాగ్ చేస్తూ సీఎం ట్వీట్



అహ్మదాబాద్‌లోని సబర్మతీ ఆశ్రమంలో చరఖాపై నూలు వడుకుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అహ్మదాబాద్, ఏప్రిల్ 8: నానాటికీ కొడిగట్టుకుపోతున్న వైభవాన్ని పునరుద్ధరించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ దిద్దుబాట పట్టింది. ఇటీవలి కాలంలో వరుస ఎదురుదెబ్బలతో బలహీనపడిన పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పార్టీలో భారీ స్థాయిలో సంస్థాగత మార్పులు చేపట్టనున్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. మంగళవారం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ నేషనల్ మెమోరియల్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో చర్చించిన

మిగతా 14వ పేజీలో...

వాణిజ్య పన్నుల రాబడి

రూ.75,149 కోట్లు

గతేడాది కంటే ఈసారి 7.2% వృద్ధి

మార్చిలో జీఎస్టీ వృద్ధి రేటు యథాతథం

గత ఏడాది రూ.5,399 కోట్లు..

ఈసారి రూ. 5,401 కోట్లు

13



10

బ్రహ్మ కుమారీస్ అధినేత్రి

దాది రతన్ కన్నుమూత

రాష్ట్రపతి ముర్ము, రేవంత్ దిగ్భ్రాంతి

సిద్దిపేటలో

బర్డ్‌ఫ్లూ కలకలం

తొగుట మండలం కాన్గల్ లేయర్ ఫామ్‌లో కోళ్లకు వ్యాధి నిర్ధారణ

వారంలో 1.45 లక్షల కోళ్లను చంపి పూడ్చనున్న సిబ్బంది

నిర్వాహకులకు భువనగిరిలోనూ ఫామ్.. అక్కడ 3 కోళ్లు మృతి

అక్కడి కోళ్లకూ సోకి ఉంటుందా? ఆరా తీస్తున్న అధికారులు

13



భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం భద్రాచలం రోడ్డులోని దిబ్బలపల్లి సమీపంలో రోడ్డుపై కూలిన భారీ వృక్షం

గాలి, వడగళ్ల వాన బీభత్సం

పంటలకు తీవ్ర నష్టం.. నేడు, రేపు వర్షసూచన

రైతులను ఆదుకుంటాం: మంత్రి సీతక్క

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

రాష్ట్రంలో గాలి, వడగాళ్ల వాన బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు జిల్లాల్లో మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ ఉండి, సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి భీకరమైన గాలులకు తోడు వర్షం, వడగళ్లు కురుస్తుండడంతో తీవ్రమైన పంట నష్టం జరుగుతోంది. జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి, వరంగల్,

మిగతా 2వ పేజీలో...

ఓయూ తప్పిదం..

అభ్యర్థులకు శాపం!

ఉత్తీర్ణత తేదీని తప్పుగా ఇవ్వడంతో హాస్టల్ వెల్ఫేర్ పోస్టుల్లో అన్యాయం

ఆందోళనలో 10 మంది ర్యాంకర్లు

సాంకేతిక తప్పిదం అంటూ వర్సిటీ లేఖ పంపినా పట్టించుకోని టీజీపీఎస్సీ

3



ఘటనా స్థలి నుంచి ఓ చిన్నారి తరలింపు

అగ్నిప్రమాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కుమారుడికి గాయాలు

సింగపూర్‌లోని స్కూల్‌లో ఘటన

చేతులు, కాళ్లపై బొబ్బలు, ఊపిరితిత్తుల్లోకి పొగ.. ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స

ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి

సింగపూర్‌కు పవన్ కల్యాణ్

3

20 ఏళ్లుగా గుండె ఆపరేషన్లు చేస్తున్న

దొంగ డాక్టర్

బ్రిటన్‌లోని ప్రఖ్యాత డాక్టర్ పేరుతో చలామణి

మధ్యప్రదేశ్‌లో ఓ ఆస్పత్రిలో 15 మందికి శస్త్రచికిత్సలు.. వారిలో ఏడుగురి మృతి

పరారీలో నకిలీ వైద్యుడు.. తాజాగా అరెస్టు

15 వేల ఆపరేషన్లు చేసినట్టు ప్రచారం

2006లో ఛత్తీస్‌గఢ్ స్పీకర్‌కు కూడా తనే

ఆపరేషన్ అనంతరం స్పీకర్ మృతి

దొంగ డాక్టర్ వద్ద డజన్ల సంఖ్యలో ఫేక్ డిగ్రీలు

ఆంధ్రప్రదేశ్ నుంచి మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్

దమోహ్(మధ్యప్రదేశ్), ఏప్రిల్ 8: దొంగ డిగ్రీలతో, బ్రిటన్ జాతీయుడైన ప్రఖ్యాత కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఎన్ జాన్ కామ్‌గా చలామణి అవుతున్న మోసగాడు మధ్యప్రదేశ్‌లోని ఒక మిషన్ ఆసుపత్రిలో ఏకంగా 15 గుండె ఆపరేషన్లు చేసి ఏడుగురి చావుకు కారణమయ్యాడు. అతని తీరుపై అనుమానం వచ్చిన ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరారయ్యాడు. చివరకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగలో తనను పట్టుకున్నారు. తెల్లకోటు మోజుకు డజన్ల కొద్దీ పేషంట్ల ప్రాణాలు తీసిన ఇతన్ని పోలీసులు డెత్ డాక్టర్‌గా

మిగతా 14వ పేజీలో...



పోలవరం ముంపుపై

తృతీయ పక్ష సర్వే

అంగీకరించిన పోలవరం అథారిటీ

తొలిదశలో ముంపు సమస్య లేదు: ఏపీ

అనుమతి 150 అడుగులకు ఉన్నందున సర్వే చేయాల్సిందేనన్న తెలంగాణ

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల ఎత్తుతో నీటిని నిల్వ చేయడం వల్ల తెలంగాణలో ఎంత ప్రాంతం మునిగిపోతుందన్న అంశంపై తృతీయపక్ష సర్వే చేయడానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) అంగీకరించింది. గత పదేళ్లుగా తెలంగాణ ఈ అంశాన్ని లేవనెత్తుతుండగా తొలిసారి పీపీఏ సానుకూల నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మంగళవారం హైదరాబాద్‌లోని కృష్ణా-గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్(కేజీబీవో) కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం

మిగతా 13వ పేజీలో...



భూపాలపల్లి జిల్లా చిట్యాల శివారులో నేలకొరిగిన అరటి తోట

గాలి, వడగళ్ల వాన బీభత్సం

(మొదటిపేజీ తరువాయి)

మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో వరి, మొక్కజొన్న, మిర్చి, మావిడి, మునగ, చిక్కుడు, కాకర తోటలకు భారీ నష్టం వాటిల్లింది. రైతులు ఎండబెట్టుకున్న మిర్చి కుప్పలు ఎగిరిపోయాయి. పలు చోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోగా, విద్యుత్ స్తంభాలు విరిగిపోయి లైన్లు తెగిపోయాయి. దాంతో పలు గ్రామాలు అంధకారంతో కొట్టుమిట్టాడాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పలు చోట్ల రహదారులకు అడ్డంగా భారీ వృక్షాలు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. కాగా, నాలుగైదు రోజుల్లో పంట చేతికొస్తుందన్న ఆశతో ఉన్న అన్నదాతలకు గాలిదుమారం, వడగళ్ల వాన తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఈ నేపథ్యంలో అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి సీతక్క తెలిపారు. తడిసిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని భరోసానిచ్చారు. పంటనష్టాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కలెక్టర్లకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీచేశారు. కాగా, దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో బుధ, గురువారాల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

» బఫర్ విరిగి పట్టాలపై నిలిచిన బోగీలు

పలాస, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా(12704) ఎక్స్‌ప్రెస్‌కు మంగళవారం పెను ప్రమాదం తప్పింది. శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వేస్టేషన్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో సున్నాదేవి ఎల్‌సీ గేటు వద్ద ఉదయం 7.15 గంటల సమయంలో రైలు ఎనిమిదో బోగీ ఏసీ కంపార్ట్‌మెంట్ వద్ద ఉన్న బఫర్ విరిగి తెగిపోవడంతో 15 బోగీలు విడిపోయి పట్టాలపై నిలిచిపోయాయి. ఇంజన్‌తో ఉన్న 8 బోగీలు ముందుకెళ్లిపోయాయి. ఎవరో చైన్ లాగడంతో రైలు ఆగినట్టు గార్డ్ మధుకుమార్ భావించారు. దిగి పరిశీలించగా బోగీలు విడిపోయి ఉండటంతో పాటు, మిగిలిన బోగీలతో రైలు వెళ్లిపోవడాన్ని గుర్తించి డ్రైవర్‌కు సమాచారం ఇచ్చి మందస వద్ద రైలును నిలుపుదల చేశారు. అనంతరం పలాస రైల్వే అధికారులకు ఈ విషయాన్ని తెలియజేయడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బఫర్ విరిగిపోయినట్టు గుర్తించారు. అనంతరం ఇంజన్‌ను బోగీలు నిలిచిపోయిన ప్రాంతానికి తీసుకువచ్చి రైలును మందసకు తరలించారు. ప్రమాదానికి కారణమైన 8వ బోగీని అక్కడ వదిలేసి, అందులో ఉన్న 42 మంది ప్రయాణికులను వేరే బోగీల్లోకి సర్దుబాటు చేసి గమ్యస్థానాలకు తరలించారు. ఈ ఘటన కారణంగా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మందసలో 3 గంటల పాటు నిలిచిపోగా, దురంతో ఎక్స్‌ప్రెస్‌ను మూడు గంటల పాటు పలాసలో నిలిపివేశారు. దీంతోపాటు భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లన్నీ మూడు గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.

గంజాయి వ్యాపారంటూ ప్రచారం చేశాడని..!

» స్నేహితుల దాడి.. యువకుడి మృతి.. ముగ్గురు జైలుపాలు



ప్రణీత్ (ఫైల్)

బిట్స్‌పిలానీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశం ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొనగా.. ముగ్గురు యువకుల జీవితాన్ని జైలుపాలు చేసింది. గంజాయి వ్యాపారి అంటూ తనపై స్నేహితుడు దుష్ప్రచారం చేస్తున్నాడని నమ్మిన ఓ యువకుడు.. మరో ఇద్దరితో కలిసి ఆ స్నేహితుడిపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన యువకుడు రెండ్రోజుల చికిత్స అనంతరం ప్రాణం వదలగా.. ఆ మరణానికి కారణమైన ముగ్గురూ జైలుపాలయ్యారు. సికింద్రాబాద్‌లోని జవహర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో పుల్లూరి ప్రణీత్(21) అనే యువకుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. యాప్రాల్‌లోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన పుల్లూరి వెంకట నర్సయ్య రెండో కుమారుడు ప్రణీత్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ప్రణీత్, అదే కాలనీకి చెందిన గోవర్ధన్ (27) స్నేహితులు. అయితే, గోవర్ధన్ గంజాయి విక్రయిస్తుంటాడని తెలిసిన వారి దగ్గర చెబుతూ ప్రణీత్ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని గోవర్ధన్ అతనిపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో తన జోలికి రావొద్దని ప్రణీత్‌ను హెచ్చరించాలని గోవర్ధన్ నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఏప్రిల్ 5వ తేదీ రాత్రి తొమ్మిది గంటలప్పుడు.. గోవర్ధన్, జశ్వంత్(20), విస్సెంట్(19) అనే స్నేహితులతో కలిసి మాట్లాడేపని ఉందని చెప్పి ప్రణీత్‌ను తమ వద్దకు పిలిచారు. నలుగురూ కలిసి ద్విచక్రవాహనాలపై సమీపంలోని క్రీడామైదానానికి వెళ్లి అక్కడ గొడవ పడ్డారు. ఈ క్రమంలో ప్రణీత్‌ను కర్రలతో విచక్షణారహితంగా కొట్టి గాయపరిచి పరారయ్యారు. దీనిపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ప్రణీత్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. రెండ్రోజుల చికిత్స అనంతరం మంగళవారం ఉదయం ప్రణీత్ మరణించాడు. ఇక, నిందితులైన గోవర్ధన్, జశ్వంత్, విస్సెంట్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇస్రో 'యువికా'కు 12 మంది ఎంపిక

» వారిలో ముగ్గురు పెద్దపల్లి విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఏటా నిర్వహిస్తున్న యువికా (యువ విజ్ఞాని కార్యక్రమం)కు మన రాష్ట్రం నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి 350 మంది ఎంపికైనట్లు ఇస్రో అధికారులు తెలిపారు. కాగా, వారిలో పెద్దపల్లి జిల్లా నుంచే ముగ్గురు విద్యార్థులు ఉండడం విశేషం. పెద్దపల్లి నుంచి పోలవేణి సాత్విక, పడాల సిరివెన్నెల, తోడేటి సాయివర్షిత ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు మేలో దేశంలోని ఇస్రో కేంద్రాల్లో 'అంతరిక్ష సాంకేతికత, అనువర్తనాలపై రెండు వారాల పాటు శిక్షణ ఇస్తారని పెద్దపల్లి డీఈవో మాధవి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు.

భూభారతితో రెవెన్యూకు కొత్త ఊపిరి

» తెలంగాణ ఉద్యోగుల ఐకాస చైర్మన్ లచ్చిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అమల్లోకి రానున్న భూభారతి చట్టం రెవెన్యూ వ్యవస్థకు కొత్త ఊపిరి పోయనుందని తెలంగాణ ఉద్యోగుల ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి వెల్లడించారు. కొత్త చట్టం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పునర్‌నిర్మాణం జరుగుతోందన్నారు. 10,954 మంది గ్రామ పాలనాధికారులు వస్తున్నారన్నారు. పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలు అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే క్రతువుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

ఒకే సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు సాగర్ రక్షణ..!

» ములుగు బయలుదేరి వెళ్లిన 39వ బెటాలియన్

» తెలంగాణ వైపు అదనంగా ఎస్పీఎఫ్ కాపలా



సాగర్ ప్రధాన డ్యాం వద్ద బాధ్యతను ఏపీ వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ అధికారికి అప్పగిస్తున్న తెలంగాణ సీఆర్‌పీఎఫ్ అధికారి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ డ్యామ్ రక్షణ బాధ్యతను ఇక నుంచి ఒక సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కే పరిమితం చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకూ తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ ములుగు బెటాలియన్, ఏపీ వైపు విశాఖ బెటాలియన్ బలగాలు కాపలా కాస్తున్నాయి. కానీ, కేంద్రం ఖర్చును తగ్గించుకోవడానికి సీఆర్‌పీఎఫ్ ములుగు బెటాలియన్‌ను ఉపసంహరించి.. సాగర్ డ్యామ్ రక్షణ బాధ్యతను పూర్తిగా విశాఖ బెటాలియన్‌కు అప్పగించింది. 39వ (ములుగు) బెటాలియన్ సిబ్బందిని వెనక్కి వెళ్లిపోవాలని ఈ నెల 6న కేఆర్ఎంబీ ఆదేశించింది. ఎడమ వైపు డ్యాం రక్షణ బాధ్యతలు కూడా స్వీకరించాలని 234వ (విశాఖ) బెటాలియన్‌కు మంగళవారం కేఆర్ఎంబీ ఆదేశాలు జారీసింది. దీంతో డ్యామ్ రక్షణ బాధ్యతను 234వ బెటాలియన్ అధికారి శ్రీనివాసరావుకు ములుగు బెటాలియన్ అధికారి వీర రాఘవయ్య అప్పగించారు. కాగా, ములుగు బెటాలియన్ బలగాలు సాయంత్రం ములుగుకు బయలుదేరాయి. తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ విశాఖ బెటాలియన్‌తోపాటు ఎస్పీఎఫ్ బలగాలు కాపలా ఉంటాయి.

నర్సింగ్ విద్యార్థుల లబోదిబో!

నాలుగేళ్లుగా విడుదల కాని పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు.. ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు

» సుమారు రూ.200 కోట్ల బకాయిలు

» సర్టిఫికెట్లు ఇవ్వని యాజమాన్యాలు

» త్వరలో నర్సింగ్ రాత పరీక్ష ఫలితాలు

» ఎంపికైతే సర్టిఫికెట్లు తప్పనిసరి.. ఆందోళనలో విద్యార్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ కళాశాలల్లో జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. నాలుగేళ్లుగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల కాలేదు. దాంతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి. ఈ డబ్బులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయి. డబ్బులు కట్టలేక కొందరు మధ్యలోనే చదువు వదిలేస్తున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు అన్ని రకాల కోర్సుల బోధనా రుసుములు రూ.5,500 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఒక్క నర్సింగ్ విద్యకు సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులే రూ.200 కోట్లు వరకు ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. పెండింగ్ బకాయిల కారణంగా చదువు పూర్తి చేసుకున్న వారికి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. డబ్బులు కట్టిన విద్యార్థులకే ఇస్తున్నాయి. ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ వచ్చాక ఆ డబ్బును విద్యార్థులకు తిరిగి స్తామని యాజమాన్యాలు చెబుతున్నాయి. నర్సింగ్ కోర్సుల్లో చేరే వారిలో మెజారిటీ శాతం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారేనని కళాశాలలు చెబుతున్నాయి. దాంతో ఆ డబ్బులు కట్టి ధ్రువపత్రాలు తీసుకునే స్తోమత వారికి ఉండడం లేదు. ధ్రువపత్రాలు లేకుండా తమను ఉద్యోగాల్లోకి తీసుకోవడం లేదని ఖమ్మం జిల్లాకు చెందిన మాధవి అనే నర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు గతేడాది మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2,300 స్టాఫ్ నర్స్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించింది. ఈ నెల 26 వరకు హైదరాబాద్‌లో అమల్లో ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే మెడికల్ బోర్డు ఆ పరీక్షా ఫలితాలను విడుదల చేయనుంది. ఆ సమయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించ లేకపోతే సెలక్షన్ జాబితాలో పేరుండదు. పెండింగ్ బకాయిల కారణంగా తమకు ఆ పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ పరిస్థితి ఏమిటని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వైద్య శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 21 ఎంఎస్సీ నర్సింగ్ కాలేజీలు, 87 కాలేజీ ఆఫ్ నర్సింగ్, 161 స్కూల్ ఆఫ్ నర్సింగ్, 112 ఎంపీహెచ్‌డబ్ల్యు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. మొత్తం 391 కళాశాలల్లో 23 సర్కారీవి కాగా మిగతా వన్నీ ప్రైవేట్‌వే. వీటిలో ఏటా 15 వేల మంది వరకు నర్సింగ్ సంబంధిత కోర్సుల్లో చేరుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో జీఎన్ఎం విద్యార్థులకు హాస్టల్‌తో పాటు మొదటి ఏడాది రూ.5 వేలు, రెండో ఏడాది 6 వేలు, మూడో ఏడాది 7 వేలు, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు తొలి ఏడాది రూ.5 వేలు ఆ తర్వాత ఏటా వెయ్యి చొప్పున పెంచుకుంటూ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటాలో సీటు పొందిన వారే స్కాలర్‌షిప్‌కు అర్హులు. ప్రైవేట్ కళాశాలల్లోని నర్సింగ్ విద్యార్థులకు గత బీఆర్ఎస్ సర్కారు 2023లో ఈ స్కాలర్‌షిప్‌లను పెంచింది. జీఎన్ఎం విద్యార్థులకు రూ.21 వేల నుంచి 30 వేలకు, బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు 24 వేల నుంచి 40-45 వేల వరకు పెంచి, జీవో కూడా విడుదల చేసింది. కానీ ఇంతవరకు ఇది అమలు కాలేదు. పెంచడానికంటే ముందు రెండేళ్ల నుంచి స్కాలర్‌షిప్ నిధులు చెల్లించడం లేదని, నాలుగేళ్లుగా స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రం ఇచ్చే నిధులకూ రాష్ట్ర ప్రభుత్వంమ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదని, రూ.150 కోట్లు రాష్ట్ర సర్కారు ఇస్తే, అక్కడి నుంచి 250- 300 కోట్లు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వడం లేదు

మా కళాశాల వాళ్లు పరీక్షలు రాసేందుకు హాల్ టికెట్లు కూడా ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే మమ్మల్నే డబ్బులు కట్టమంటున్నారు. స్కాలర్‌షిప్ వస్తుందనే ఆశతోనే ఈ కోర్సుల్లో చేరాం. మా సీనియర్లకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదు. యాజమాన్యం వేధింపులు భరించలేక కొందరు ఇళ్లకు వెళ్లిపోతున్నారు.


- ఓ నర్సింగ్ విద్యార్థిని, ఉమ్మడి నల్లొండ జిల్లా

దశలవారీగా అని చెప్పి కూడా ఇవ్వడం లేదు



పెండింగ్ బకాయిల గురించి ఆరు నెలల క్రితం ఆర్థిక మంత్రి భట్టిని కలిశాం. దశలవారీగా కొంచెం కొంచెం విడుదల చేస్తామని హామీనిచ్చారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. తిరిగి తిరిగి విసుగు వస్తోంది. 2023 మే, జూన్‌లో విడుదలైన టోకెన్స్ కూడా ఇంతవరకు క్లియర్ కాలేదు. నాలుగేళ్లుగా జేబులోంచి పెడుతున్నాం. ఇంకా పెట్టాలంటే మావల్ల కావడం లేదు.

- డి. సాంబిరెడ్డి, తెలంగాణ ప్రైవేటు నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ



తెలంగాణ నుంచి ఇస్రోకు ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లు

యాదాద్రి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇస్రో త్వరలో ప్రయోగించనున్న జీఎస్ఎల్వీ రాకెట్‌లో వినియోగించేందుకు అవసరమైన 'ఎకోథెర్మ్ ఫినోలిక్ ఫోమ్ ప్యాడ్'లు తెలంగాణ నుంచి వెళ్లనున్నాయి. జీఎస్ఎల్వీ రాకెట్‌లో అగ్నిప్రమాదాల నియంత్రణకు, క్రయోజనిక్ సిస్టమ్స్‌లో ఉష్ణాన్ని నియంత్రించేందుకు ఈ ప్యాడ్‌లను వినియోగిస్తారు. అయితే, ఇస్రో త్వరలో చేయబోయే ప్రయోగానికి అవసరమైన ఫినోలిక్ ఫోమ్ ప్యాడ్‌లను యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జెమ్మిలాల్‌పేటలోని వీఎన్‌డీ సెల్‌ప్లాస్ట్ అనే కంపెనీ సిద్ధం చేసింది. ఇస్రోతో చేసుకున్న ఒప్పందం ప్రకారం 365 ప్యాడ్‌లను తయారు చేసి వాటి రవాణాకు సిద్ధమైంది. వీటిని కేరళ రాజధాని తిరువనంతపురంలోని విక్రంసారాభాయ్ స్పేస్ సెంటర్‌కు బుధవారం తరలించనున్నారు. ఇస్రో అధికారులు బుధవారం వర్చువల్‌గా జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. తిరువనంతపురంలో ఇస్రో అధికారులు వాటిని పరిశీలించిన తర్వాత ఏపీలోని నెల్లూరుకు తరలిస్తారు. కాగా, ఫినోలిక్ ఫోమ్ ప్యాడ్లు, ఫినోలిక్ మిశ్రమాలకు సంబంధించి ఇస్రోతోపాటు రైల్వే, రక్షణ, మైనింగ్, పెట్రో కెమికల్ పరిశ్రమలు తమతో ఒప్పందాలు చేసుకున్నాయని వీఎన్‌డీ సెల్‌ప్లాస్ట్ సంస్థ డైరెక్టర్లు డి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్.సుఖ్‌జీవన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.



రవాణాకు సిద్ధంగా ఉన్న ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లు

క్రిశాంక్‌కు నోటీసు ఇచ్చి విచారణ చేపట్టండి

» కంచ గచ్చిబౌలి ఫేక్ వీడియోల కేసులో హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి 400 ఎకరాల భూములకు సంబంధించిన ఫేక్ వీడియోల కేసులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు బీఎన్ఎస్ఎస్ 35 నోటీసు ఇచ్చి విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. ఆ భూములను చదును చేసే క్రమంలో అక్కడ నివసించే జింక చనిపోయిందని, అధికారులే దానిని చంపేశారనేలా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోలను వైరల్ చేసినట్లు క్రిశాంక్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తప్పుడు ప్రచారం చేసేందుకు క్రిశాంక్ నకిలీ వీడియోలు సృష్టించారని అటవీ శాఖ అధికారులు, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివిధ వర్గాల మధ్య శత్రుత్వం, విద్వేషం రెచ్చగొట్టేలా, ఉద్రిక్తతలను రాజేసేలా క్రిశాంక్ వ్యవహరించారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీంతో అతనిపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని కోరుతూ క్రిశాంక్ హైకోర్టులో వేర్వేరు క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న జస్టిస్ ఎన్ తుకారాంజీ.. మూడు ఎఫ్ఐఆర్‌లలో ఆరోపణలు ఒకేలా ఉన్నాయని పేర్కొన్నారు. పిటిషనర్ కం నిందితుడికి చట్టప్రకారం నోటీసు ఇచ్చి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వం, ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

కామారెడ్డి జిల్లాలో 64కు చేరిన కల్తీ కల్లు బాధితులు

» నిజామాబాద్, బాన్సువాడ ఆసుపత్రుల్లో చికిత్స

కామారెడ్డి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని నస్రూల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో కల్తీ కల్లు బాధితుల సంఖ్య పెరుగుతోంది. సోమవారం కల్తీ కల్లు బాధితులు 32 మంది ఉండగా.. ప్రస్తుతం వీరి సంఖ్య 64కి చేరింది. ఇందులో 14 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వారిని మెరుగైన వైద్యం కోసం బాన్సువాడతో పాటు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. మరోవైపు.. కల్తీ కల్లు ఘటనపై ఎక్సైజ్‌శాఖ విచారణ ముమ్మరం చేసింది. నస్రూల్లాబాద్ మండలంలోని దుర్కిలో సురేందర్‌గౌడ్‌కు చెందిన కల్లు డిపో నుంచి సరఫరా అయిన కల్లు తాగిన వారే ఆయా గ్రామాల్లో అస్వస్థతకు గురైనట్లు విచారణలో తేలింది. దీంతో కల్లు డిపో నిర్వాహకుడైన సురేందర్‌గౌడ్‌తో పాటు మరో నలుగురిపై ఎక్సైజ్‌శాఖ అధికారులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ బృందం ఆయా కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి శాంపిళ్లను సేకరించింది. నిషేధిత మత్తు పదార్థాలు కల్లులో కలపడంతోనే బాధితులు అస్వస్థతకు గురైనట్లు యాంటీ నార్కోటిక్ డ్రగ్స్, వైద్య శాఖ అధికారులు భావిస్తున్నారు. కాగా.. బాన్సువాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు.

కంచ గచ్చిబౌలి భూ కుంభకోణాన్ని 48 గంటల్లో బయటపెడతా

» ఈ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలతో పాటు బీజేపీ ఎంపీ

» బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడి సీఎం రేవంత్

» ఢిల్లీ చెప్పుచేతల్లో ఆ జాతీయ పార్టీలు

» ఏఐ అంటే ఎనుముల ఇంటెలిజెన్స్

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'కంచ గచ్చిబౌలి భూ కుంభకోణంలో చీకటి కోణాలు చాలా ఉన్నాయి. 400 ఎకరాలు, దాని వెనక వేల కోట్ల బాగోతాన్ని 48 గంటల్లో బయటపెడతా. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలే కాకుండా ఒక బీజేపీ ఎంపీ కూడా ఉన్నారు. నాకు దక్కనిది ఎవరికీ దక్కకూడదని రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారు. ఈ భూముల వ్యవహారంలో కాంగ్రెస్ అవినీతి కోణంపై ప్రజలకు అన్ని విషయాలు వెల్లడిస్తా'నని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ జరిపారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ లోపాయికారి వ్యవహారం నడుస్తోందని ఆరోపించారు. 'దేశంలో ఎక్కడా లేని విధంగా ఆ రెండు పార్టీల ఉమ్మడి సీఎంగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. అందుకే ఎప్పుడు ఆయనకు సమస్య వచ్చినా కాపాడేందుకు బీజేపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ రక్షణ కవచంలా నిలుస్తున్నార'ని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుకుంటే కంచగచ్చిబౌలి భూముల అమ్మకం ఆపలేదా? అని ప్రశ్నిస్తూ బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'బీజేపీ, కాంగ్రెస్.. ఈ రెండు జాతీయ పార్టీలూ ఢిల్లీ చెప్పుచేతల్లోనే పనిచేసే స్థాయి. ఒకరు చెప్పులు మోస్తే.. మరొకరు బ్యాగులు మోస్తున్నారు. ఏం చేయాలన్నా.. ఢిల్లీ అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి.' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలు బీఆర్ఎస్ పార్టీ మొదలుపెట్టినవి కాదని, లగచర్ల, మూసీ ప్రక్షాళన, హెచ్‌సీయూ విషయంలో బాధితులే తమ వద్దకు వచ్చారని కేటీఆర్ చెప్పారు. కంచ గచ్చిబౌలిలో విధ్వంసంపై బహిర్గతం కావడతో ఏఐ వీడియోలని ప్రతిపక్షంపై కేసులు పెడుతున్నారన్నారు. అక్కడ జింకలు, నెమళ్లు ఉన్నాయని ప్రభుత్వ సంస్థ నెహ్రూ జూ పార్క్ నివేదికే పేర్కొందని ప్రస్తావించారు. 'ఏఐ వీడియోల పేరుతో తప్పించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏఐ అంటే ఎనుముల ఇంటెలిజెన్స్ మేం అనుకోవచ్చు కదా? అని అన్నారు.

రేవంత్ అసమర్థత వల్లే మీనాక్షి సమీక్షలు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 17 నెలలైనా మంత్రి వర్గాన్ని విస్తరించుకునే పరిస్థితి లేకుండాపోయిందని కేటీఆర్ విమర్శించారు. 'రేవంత్ రెడ్డి ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా ఒక్క రూపాయి కూడా రాలేదు. సీఎంగా ఆయన విఫలమైనందుకే కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకొంటోంది. ఆయన అసమర్థత వల్లే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షలు చేస్తున్నా'రని కేటీఆర్ అన్నారు. " రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గోదావరి, కృష్ణా జలాల్లో విచ్చలవిడిగా జల దోపిడీకి పాల్పడ్డారు. మేడిగడ్డ ఎప్పుడు కొట్టుకుపోతుందా అని కాంగ్రెస్ గుంటనక్కలా ఎదురు చూస్తోంది. భూకంపం, భారీ వరద వచ్చినా మేడిగడ్డ చెక్కు చెదరలేదన్న విషయాన్ని గుర్తించాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

చరిత్రలో నిలిచేలా వరంగల్ సభ

బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను వరంగల్ సభతో ఆపకుండా ఏడాది పాటు వివిధ కార్యక్రమాలు చేపడతామని కేటీఆర్ తెలిపారు. చరిత్రలో నిలిచేలా ఈ సభను నిర్వహిస్తామన్నారు. సభకు అనుమతించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. డిజిటల్ విధానంలో పార్టీ సభ్యత్వాల నమోదు చేపడతామన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీలతో పాటు అక్టోబరులో పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల ప్రభావం దేశంపైనేకాక రాష్ట్రంలోని ఫార్మా, ఐటీ ఎగుమతులపై పడనుందని అన్నారు. ఆమెరికా దుందుడుకు చర్యలపై ప్రధాని మోదీ, కేంద్ర విదేశాంగ మంత్రులు స్పందించడం లేదని విమర్శించారు.

మాయమవుతున్న ఫేక్ వీడియోలు

» సోషల్ మీడియా నుంచి తొలగిస్తున్న వేలాది మంది

» పోస్టులు డిలీట్ చేసినా.. కేసు తప్పదు: సైబర్ క్రైమ్ బృందాలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రాణభయంతో జింకలు పరుగులు పెడుతున్నట్లు, నెమళ్లు ఏడుస్తున్నట్లు ఫొటోలు, వీడియోలను తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేసిన వేలాది మంది.. ప్రస్తుతం వాటిని డిలీట్ చేస్తున్నారు. ప్రకృతి, పర్యావరణ విధ్వంసం పేరిట ఏఐ ఆధారిత నకిలీ ఫొటోలు, వీడియోలను కొందరు సృష్టిస్తే.. వాటిని నిజమని నమ్మి పలువురు ప్రముఖులతోపాటు వేలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, చోటా మోటా నాయకులు, పర్యావరణ ప్రేమికులు ఆ ఫొటోలు, వీడియోలను వైరల్ చేశారు. దీంతో ఈ వ్యవహారం ఢిల్లీని సైతం తాకింది. అక్కడ కూడా వీటిని రీట్వీట్ చేయడంతో.. ఫేక్ ఫొటోలు రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేశాయి. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. ఉన్నతాధికారులతో సమావేశమై.. ఫేక్ ఫొటోలు, వీడియోలను సృష్టించిన వారితోపాటు వాటిని ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్లతోపాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రంగంలోకి దిగారు. మరోవైపు పలు జిల్లాల్లో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు ఫేక్ వీడియోలు పోస్టు చేసిన వారిపై పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇందుకు సంబంధించి పెద్దసంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఫేక్ వీడియోలను ఎవరు తయారు చేశారన్న విషయంలో ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసులు ఒక కచ్చితమైన అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

కేటీఆర్ సహా పలువురికి నోటీసులు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆ పార్టీ సోషల్ మీడియా బాధ్యతలు చూస్తున్న మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్ తదితరులకు పోలీసులు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. వీరిలో క్రిశాంక్ తనపై నమోదైన నాలుగు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలంటూ కోర్టుకు వెళ్లినప్పటికీ ఆయనకు ఉపశమనం కలుగలేదు. విచారణకు హాజరు కావాలని కోర్టు స్పష్టం చేసింది. మరోవైపు ఇలాంటి పోస్టులు పెట్టిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఇప్పటికే తాము పెట్టిన పోస్టులను డిలీట్ చేశారు. వీరిద్దరు పోస్టులను డిలీట్ చేసిన తర్వాత వేలాది సోషల్ మీడియా ఖాతాల నుంచి ఫేక్ పోస్టులు డిలీట్ అవుతున్నట్లు సైబర్ సెక్యూరిటీ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. అయితే పోస్టులు డిలీట్ చేసినా కొందరిపై కేసులు మాత్రం తప్పవని పోలీసు అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. వేల కేసులు నమోదు చేయడం తమ లక్ష్యం కాదని, కేసులు పెడతామనే హెచ్చరిక ప్రజల్లోకి వెళితే మరోసారి ఇలాంటి ఫేక్ వీడియోలు, ఫొటోలు పోస్టు చేసే ముందు ఆలోచిస్తారని పోలీసులు పేర్కొంటున్నారు.

వచ్చేస్తోంది 'కొత్త మద్యం'

- 604 న్యూ బ్రాండ్లకు దరఖాస్తులు
- వీటిలో 273 విదేశీ బ్రాండ్లు
- 47 కొత్త కంపెనీల నుంచి 386..

45 పాత కంపెనీల 218 దరఖాస్తులు



హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్లు రానున్నాయి! ఇందులో విదేశీ బ్రాండ్లూ ఉండనున్నాయి. ఇందుకు మద్యం తయారీదారులు, సరఫరాదార్లు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో 604 రకాలైన కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల అనుమతి కోసం 92 మద్యం తయారీ, సరఫరా కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో విదేశీ బ్రాండ్లు 273 వరకు ఉండగా స్వదేశీ బ్రాండ్లు 331 ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ రకాలైన మద్యం సరఫరా చేస్తున్న 45 పాత కంపెనీలు 218 కొత్త రకాల మద్యం బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. రాష్ట్రంలో తొలిసారిగా కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల కోసం 47 కొత్త కంపెనీలు 386 రకాల కొత్త మద్యం బ్రాండ్లను తీసుకరావడానికి దరఖాస్తులు సమర్పించారు. కొత్త బ్రాండ్ల కోసం తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తయారీ, సరఫరాదారులను ఆహ్వానించింది. ఈ మేరకు ఫిబ్రవరి 24న నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తులకు మార్చి 15 తుదిగడువు విధించినా ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించింది. కాగా రాష్ట్రంలో 2620 ఏ-4 మద్యం దుకాణాలు, 1176 బార్లున్నాయి. వీటి ద్వారా మద్యం అమ్మకాలతో 2023-24లో రూ. 34,800 కోట్లు, 2024-25లో రూ.34,600 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు, లైసెన్సు ఫీజు కలిపి దాదాపు రూ.264 కోట్లు వచ్చాయి. గతంలో 548 లక్షల కాటన్లు, ఈ సారి 531లక్షల కాటన్ల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇక 362 లక్షల కేసులు మద్యం గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించగా ఈసారి 369 లక్షల కేసుల మద్యం విక్రయించారు. గతం కంటే 2 శాతం మద్యం విక్రయాల పెరిగాయి. ఆదాయం నిరుటి కంటే 7శాతం పెరిగింది. రాష్ట్రంలో 2025-26లో రూ.27,623.36 కోట్లు రాబట్టాలని ఎక్సైజ్‌శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే బీర్ల ధర పెంచడంతో పాటు కొత్తగా 25 బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అలాగే కొత్త బ్రాండ్లకు అవకాశం కల్పించారు. ఇప్పటికే సరఫరా చేస్తున్న 32 దేశీయ కంపెనీలు 149 రకాలైన మద్యం సరఫరాకు దరఖాస్తు చేసుకోగా.. 13 విదేశీ కంపెనీలు 69 రకాల ఫారిన్‌లిక్కర్ బ్రాండ్ల సరఫరాకు దరఖాస్తు చేసుకున్నాయి. కొత్తగా 204 రకాల ఫారిన్ లిక్కర్ బ్రాండ్లకు దరఖాస్తులు రాగా.. 182 రకాల కొత్త మద్యం ఇండియన్ మేడ్ లిక్కర్ బ్రాండ్లు ఉన్నాయి.

కర్రెగుట్టల చుట్టూ బాంబులు పెట్టాం

- గుట్టలపైకి ఎవరూ రాకండి.. మావోయిస్టుల హెచ్చరిక
- ఆపరేషన్ కగార్ నుంచి స్వీయ రక్షణ కోసమేనని వెల్లడి

ములుగు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీ‌స్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలపైకి ప్రజలెవరూ రావొద్దని, ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న దాడుల నుంచి స్వీయ రక్షణ కోసం గుట్ట చుట్టూ బాంబులు పెట్టామని మావోయిస్టులు ఓ ప్రకటనలో హెచ్చరించారు. మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట లేఖను విడుదల చేశారు. ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుతూ కర్రెగుట్టలు ఛత్తీ‌స్‌గఢ్‌లోకి విస్తరించి ఉన్నాయి. దట్టమైన అడవులున్న ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు గెరిల్లా బేస్‌గా మార్చుకున్నారని పోలీసు ఉన్నతాధికారులు గతంలో వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాను కలిపే ఈ గుట్టల్లో పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో నిత్యం అలజడిగా ఉంటుంది. ఇటీవల ఛత్తీ‌స్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్లు పెరిగిన నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించడానికి ఈ అడవే మార్గం. ఈ క్రమంలోనే మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ చర్చనీయాంశంగా మారింది. కాగా, గత నెల 23న వెంకటాపురం మండలం ఇప్పగూడేనికి చెందిన కృష్ణమూర్తి ముత్యంధార జలపాతం సమీపంలో అడవిలోకి వెళ్లగా ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు బాంబు పేలి మరణించగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలపై ఏనాడూ స్పందించని మావోయిస్టులు.. కర్రెగుట్టల చుట్టూ తాము మందుపాతరలు అమర్చామని తాజాగా తొలిసారి ప్రకటించారు. స్థానిక ప్రజలెవరూ పోలీసుల మాటలను నమ్మి మోసపోవద్దని, కర్రెగుట్టలపైకి రావొద్దని హెచ్చరించారు.

కర్రెగుట్టలపై తనిఖీలు

కర్రెగుట్టల వద్ద భద్రతా చర్యలను పటిష్ఠం చేస్తున్నామని, బాంబు డిస్పోజల్ టీమ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నామని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళన చెందవద్దని, ఎవరికైనా బాంబుల ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

అకీరా పుట్టిన రోజు నాడే.. ఇలా జరగడం బాధాకరం: పవన్




హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తన పెద్ద కుమారుడు అకీరా పుట్టినరోజు నాడే.. చిన్న కుమారుడు అగ్ని ప్రమాదంలో గాయపడడం చాలా బాధాకరమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అగ్నిప్రమాదంలో తన చిన్న కుమారుడు మార్క్ శంకర్‌కు గాయాలైన ఘటనపై మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాద విషయం తెలిసినప్పుడు ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నానని, వెంటనే సింగపూర్‌లోని భారత హైకమిషన్‌తో మాట్లాడానని, వారు అక్కడ ఏం జరిగిందో తెలుసుకుని చెప్పడంతోపాటు, అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారని తెలిపారు. 'అరకు గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ కార్యక్రమంలో ఉండగా.. ఉదయం మార్క్ శంకర్‌కు అగ్నిప్రమాదంలో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని ఫోన్ వచ్చింది. బాబును ఆసుపత్రిలో చేర్పించి బ్రాంకోస్కోపి చేస్తున్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో సుమారు 30 మంది చిన్నారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఒక చిన్నారి మృతిచెందడం బాధించింది. మార్క్ శంకర్ పక్కనే కూర్చున్న చిన్నారి శరీరం కాలిపోయింది. మా బాబు చేతికి, కాలికి గాయాలయ్యాయి. ఊపిరితిత్తులోకి బాగా పొగవెళ్లింది. ఆరోగ్యానికి పెద్ద ప్రమాదమేమి లేకపోయినా.. ఊపిరితిత్తుల్లో పొగ నిండుకోవడం వల్ల దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశముందని డాక్టర్లు అంటున్నారు. మా బాబు వయసు ఏడేళ్లు. ఈ ఘటనపై ప్రధాని మోదీ ఫోన్ చేసి పరిస్థితి గురించి వాకాబు చేశారు. సింగపూర్, భారత హై కమిషనర్లతో మాట్లాడి వివరాలు తెలియజేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు. మీటింగ్‌లో ఉండగానే సీఎం చంద్రబాబు ఫోన్ చేసి వివరాలు అడిగారు. మంత్రులు నారా లోకేశ్, అనితలు కూడా ఫోన్ చేసి అడిగారు' అని చెప్పారు. మార్క్ శంకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పవన్ కల్యాణ్ తెలిపారు. తన కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ కుమారుడికి గాయాలు

మార్క్ శంకర్‌కు చేతులు, కాళ్లపై కాలిన బొబ్బలు.. ఊపిరితిత్తుల్లోకి పొగ.. సింగపూర్‌లోని స్కూల్‌లో అగ్ని ప్రమాదం

- ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స
- ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి
- మరో 20 మందికి గాయాలు
- సింగపూర్‌కు పవన్ కల్యాణ్





విద్యార్థులను భవనం నుంచి కిందకు దింపుతున్న అగ్నిమాపక సిబ్బంది.. ప్రమాదంలో గాయపడిన మార్క్ శంకర్

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డాడు. మంటల కారణంగా చేతులు, కాళ్లపై బొబ్బలు ఏర్పడ్డాయి. ఊపిరితిత్తుల్లోకి పొగ చేరుకోవడంతో శ్వాస సంబంధిత సమస్యను ఎదుర్కొన్నాడు. ఏడేళ్ల మార్క్ శంకర్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు జనసేన పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా, ఈ ఘటనలో పదేళ్ల విద్యార్థిని మృతి చెందగా.. మరో 20 మంది వరకు గాయపడ్డారు. వీరిలో 15 మంది వరకు చిన్నారులు ఉన్నారు.

అసలు ఏం జరిగింది..?

సింగపూర్‌లోని సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ) సమీపంలోని రివర్ వ్యాలీ రోడ్డులో మూడు అంతస్థుల భవనం ఉంది. దీనిలో దుకాణాలతోపాటు.. చిన్నారులకు రోబోటిక్ ఇనిస్టిట్యూట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే 30 మంది స్కూల్ పిల్లలకు సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వారిలో పవన్ కుమారుడు మార్క్ శంకర్ కూడా ఉన్నాడు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9 గంటలకు భవనంలో ఒక్కసారిగా మంటలు రాజుకుని ప్రమాదం సంభవించింది. సమాచారం అందగానే సింగపూర్ హోంశాఖ మంత్రి కె. షణ్ముగం.. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. ఫైర్ ఇంజన్లను రంగంలోకి దింపారు. అయితే.. అప్పటికే 10ఏళ్ల బాలిక మంటల్లో చిక్కుకుని మృతి చెందినట్టు మంత్రి తెలిపారు. ఈ ఘటనలో మరో 20 మంది వరకు గాయపడ్డారని, వీరిలో 15 మంది చిన్నారులే ఉన్నారని సింగపూర్ పౌర రక్షణ దళం ఫేస్‌బుక్‌లో పేర్కొంది. కాగా, ఈ ఘటనకు సంబంధించి వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. భవనం మూడో అంతస్తు నుంచి దట్టమైన పొగ బయటకు రావడంతో చిన్నారులు.. ప్రాణభయంతో అరుపులు కేకలు పెట్టారు. వీరంతా గోడలపై కూర్చుని సాయం కోసం అర్థించారు. కొందరు భవన నిర్మాణ కార్మికులు, అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపులోకి తెచ్చే యత్నం చేశారు. వాహనాలకు ఉన్న నిచ్చెనల ద్వారా మూడో అంతస్థుకు చేరుకుని బాధిత చిన్నారులను బయటకు తీసుకువచ్చారు. తర్వాత పోలీసులు.. భవనంలోని మరో 80 మందిని అక్కడ నుంచి రక్షించి, ఆస్పత్రికి తరలించారు. కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటిస్తున్న పవన్‌కల్యాణ్‌కు సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఘటన గురించి తెలియగానే దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. విశాఖ పర్యటనను రద్దు చేసుకుని సింగపూర్ బయలుదేరి వెళ్లారు.

పవన్‌కు ప్రధాని ఫోన్

ప్రధాని మోదీ.. పవన్ కల్యాణ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని పవన్‌కు సూచించారు. సింగపూర్‌లో ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధాని తెలిపారు. అలాగే, మార్క్ శంకర్ గాయపడిన విషయంపై ఏపీ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మార్క్ శంకర్‌కు గాయాలైన విషయం తనకు ఆందోళన కలిగించిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. కాగా.. 'పవన్ అన్న తనయుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

రాజీవ్‌రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- డీసీఎంను ఢీకొన్న టాటా సఫారీ
- ఇద్దరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డీసీఎం వాహనాన్ని సఫారీ కారు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో అయిదుగురు గాయాల పాలయ్యారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మురహరిపల్లి నుంచి శామీర్‌పేట్ వైపు వేగంగా వెళ్తున్న టాటా సఫారీ కారు ఫారెస్ట్ గెస్ట్ హౌజ్ సమీపంలో డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన రాజు (18), మురహరిపల్లికి చెందిన శ్రవణ్(23) అక్కడికక్కడే మృతి చెందారు. డీసీఎం డ్రైవర్ తో పాటు కారులోని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీబీ వలలో ముగ్గురు అధికారులు

- లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన వైనం

జమ్మికుంట రూరల్/ మేళ్లచెర్వు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంగళవారం వేర్వేరు చోట్ల ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ఐకేపీ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సురేష్.. పెద్దంపల్లికి చెందిన గ్రామైక్య సంఘం సహాయకురాలు స్వప్నకు ఏడాది వేతనం రూ.60 వేలు చెల్లించడానికి రూ.20 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనికరించాలని స్వప్న వేడుకున్నా ఆయన మనస్సు కరగక పోవడంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం స్వప్న ఇస్తున్న రూ.10 వేల నగదు తీసుకుంటున్న సురేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరో వైపు రేషన్ బియ్యం అక్రమ రవాణపై గతేడాది అక్టోబర్ 23న నమోదైన కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటే సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి రూ.15 వేలు లంచం డిమాండ్ చేసి.. రూ.10 వేలకు ఒప్పందానికి వచ్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులు నల్లగొండలో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు మంగళవారం రూ.10 వేల నగదు ఇస్తుండగా తీసుకుంటున్న ఎస్ఐ అంతిరెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని మంగళ్‌హట్ పరిధిలో పాత విద్యుత్ మీటర్ స్థానంలో కొత్త మీటర్ ఇవ్వడంతో పాటు విద్యుత్ బిల్లుల బకాయిలు రద్దు చేసేందుకు ఉమర్ అనే వ్యక్తి వద్ద టీజీఎస్‌పీడీసీఎల్ మంగళ్‌హట్ విద్యుత్ సెక్షన్ ఉద్యోగి అబ్దుల్ రహ్మాన్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. మంగళవారం సీతారాంపేటలోని మంగళ్‌హట్ కార్యాలయంలో ఉమర్ వద్ద రూ.20 వేలు లంచం తీసుకుంటున్న అబ్దుల్ రహ్మాన్‌ను అధికారులు అరెస్ట్ చేశారు.

బాలుడి ప్రాణం తీసిన క్రికెట్ బాల్



అశ్విత్‌రెడ్డి (ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బాల్ తగిలి ఓ బాలుడు మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన దారం శ్రీనివాస్‌రెడ్డి వేములవాడలో తన కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈ నెల 3న శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు అశ్విత్‌రెడ్డి(9) తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ క్రికెట్ బాల్ అశ్విత్ తలకు తగిలింది. మరుసటి రోజు యథావిధిగా పాఠశాలకు వెళ్లిన అశ్విత్‌రెడ్డి, తనకు తలనొప్పిగా ఉందని చెప్పడంతో బాలుణ్ణి కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. తలలో గాయమై, రక్తస్రావం అవుతున్నట్లుగా గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం అశ్విత్‌ను హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం అశ్విత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- 20న గ్రేటర్ హైదరాబాద్ పార్టీ సర్వసభ్య సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభపైనే ఆ పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాయి. ఎల్కతుర్తి సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఉమ్మడి జిల్లాల బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లోనూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు మంగళవారం బహిరంగసభకు ముందస్తు ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 27న గ్రామస్థాయి, మండల, నియోజకవర్గ, పట్టణాలు, వార్డుల స్థాయిలో పార్టీ జెండాల ఆవిష్కరించడంతోపాటు బహిరంగ సభకు తరలి వెళ్లాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై తెలంగాణ భవన్‌లో హైదరాబాద్ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 20న గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు.

ఓయూ తప్పిదం.. అభ్యర్థులకు శాపం!

ఉత్తీర్ణత తేదీని తప్పుగా ఇవ్వడంతో హాస్టల్ వెల్ఫేర్ పోస్టుల్లో అన్యాయం

- ఆందోళనలో 10 మంది ర్యాంకర్లు
- సాంకేతిక తప్పిదం అంటూ లేఖ రాసిన వర్సిటీ
- పట్టించుకోని టీజీపీఎస్సీ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారుల తప్పిదం ఆ ఉద్యోగార్థుల పాలిట శాపంగా మారింది. కష్టపడి చదివి, మంచి ర్యాంకులు తెచ్చుకున్నప్పటికీ వారికి ఉద్యోగం దక్కకుండా పోయింది. గత ప్రభుత్వంలో 2022 డిసెంబరు 23న గిరిజన, ఎస్సీ, బీసీ, సీనియర్ సిటిజన్స్ దివ్యాంగుల, స్త్రీశిశు సంక్షేమ శాఖలకు సంబంధించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూవో) పోస్టుల కోసం టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 2023లో పలు దఫాలుగా పరీక్ష కూడా నిర్వహించింది. నోటిఫికేషన్ విడుదలయ్యే సమయానికి అభ్యర్థి కచ్చితంగా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఈడీ పూర్తిచేసి ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే నోటిఫికేషన్ విడుదలయ్యే తేదీకి రెండు రోజుల ముందే ఓయూ పరిధిలోని విద్యార్థులు పాస్ అయినట్లు మెమోలు వచ్చాయి. వాటితోనే పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష రాస్తే, వారిలో కొందరికి మంచి ర్యాంకులొచ్చాయి. వీరంతా ఆయా జోన్లు, రిజర్వేషన్ కేటగిరి ఆధారంగా మెరిట్ లిస్టులో కూడా ఉన్నారు. ఆ తర్వాత టీజీపీఎస్సీ 1:1 నిష్పత్తిలో పిలిచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసింది. ఆ వివరాలతో క్రాస్ వెరిఫికేషన్ కోసం ఓయూకు పంపితే వారేమో సదరు అభ్యర్థులు, బీఈడీ పాస్ అయిన తేదీని 21 డిసెంబరు 2022కి బదులు, 30 డిసెంబరు 2022గా పేర్కొన్నారు. దీంతో నోటిఫికేషన్ విడుదలయ్యే 23 డిసెంబరు 2022 నాటికి బీఈడీ పూర్తి కాలేదనే కారణంతో టీజీపీఎస్సీ అధికారులు 17 మార్చి 2025న విడుదల చేసిన ప్రొవిజనల్ జాబితా నుంచి వారి పేర్లను తొలగించారు. ర్యాంకు వచ్చినా ప్రొవిజనల్ జాబితాలో పేర్లు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. కాగా ర్యాంకు వచ్చి, మెరిట్ లిస్టులో పేర్లు ఉండి ప్రొవిజనల్ జాబితాలో పేరు రాకపోవడానికి పాస్ అయిన తేదీని తప్పుగా ఇవ్వడమే కారణమని తెలుసుకున్న అభ్యర్థులు విశ్వవిద్యాలయ అధికారులను సంప్రదించారు. అక్కడి అధికారులు సాంకేతిక తప్పిదం వల్ల ఇలా జరిగిందని గత నెల 20వ తేదీన టీజీపీఎస్సీకి లెటర్ పంపించారు. అభ్యర్థులు వెళ్లి టీజీపీఎస్సీలో అడిగినప్పుడు కూడా అధికారులు వర్సిటీ నుంచి లెటర్ అందిందని చెప్పారు. కానీ, ఆ తప్పును సరిదిద్దేందుకు ససేమిరా అంటున్నారు. దాదాపు పది మంది అభ్యర్థులు ఈ తప్పిదం వల్ల ఉద్యోగం కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీంతో అభ్యర్థులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా విచారణ కొనసాగుతోంది. ప్రభుత్వం స్పందించి ర్యాంకులు తెచ్చుకున్న తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

న్యాయం జరిగేదాకా పోరాటం



హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల కోసం జరిగిన పరీక్షలో నాకు 135వ ర్యాంకు వచ్చింది. జోనల్, రిజర్వేషన్ కేటగిరి ప్రకారం నాకు ఉద్యోగం కచ్చితంగా రావాలి. అయితే ప్రొవిజనల్ జాబితాలో మాత్రం నా పేరు లేదు. పాస్ అయిన తేదీని యూనివర్సిటీ తప్పుగా చెప్పిందని తెలుసుకొని వారిని సంప్రదిస్తే సాంకేతిక తప్పిదం కారణంగా పొరపాటు జరిగిందని చెప్పారు. వర్సిటీ నుంచి టీజీపీఎస్సీకి మళ్లీ లేఖ రాశారు. వారి ఆఫీసుకు వెళ్లి లేఖ వచ్చిందా అని అడిగితే వచ్చింది అన్నారు. కానీ తప్పును సరిదిద్ది మాకు ఉద్యోగాలు కల్పించడం లేదు. ప్రస్తుతం కోర్టులో పిటిషన్ వేశాం.

- భాస్కర్, అభ్యర్థి, వనపర్తి జిల్లా

ఏఐతో క్షయ వ్యాధి నిర్ధారణ

- కిమ్స్ ఆస్పత్రి మరో ముందడుగు
- క్యూఎక్స్ఆర్ అనే ఏఐ టూల్‌తో

16,675 మంది ఎక్స్‌రేల విశ్లేషణ



అధ్యయనంలో పాల్గొన్న వైద్యులు మాధురి, చైతన్య, లతా శర్మ, సంబిత్ శేషు, కృష్ణ ప్రియ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): క్షయ (టీబీ) వ్యాధి నిర్ధారణకు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్ వినియోగించి సత్ఫలితాలు సాధించారు. క్యూఎక్స్ఆర్ అనే అత్యాధునిక ఏఐ టూల్ మానవ ప్రమేయం లేకుండా ఛాతీ ఎక్స్‌రేలను విశ్లేషించి, కచ్చితత్వంతో వ్యాధిని నిర్ధారించిందని కిమ్స్ పల్మోనాలజీ విభాగాధిపతి డాక్టర్ లతాశర్మ తెలిపారు. ఆ ఫలితాలను రేడియాలజిస్టులు పరిశీలించి, వాటి కచ్చితత్వాన్ని నిర్ధారించారని చెప్పారు. ఏఐ టూల్ మొత్తం 16,675మంది ఛాతీ ఎక్స్‌రేలను విశ్లేషించింది. వారిలో క్షయ సోకినవారిని గుర్తించడంలో 88.7 శాతం కచ్చితత్వం ప్రదర్శించింది. క్షయలేని వారిని గుర్తించడంలో ఇంకా మెరుగ్గా 97 శాతం ఫలితాలు సాధించింది. ముందుగా ఏఐ వినియోగించి టీబీని గుర్తించారు. ఆ తర్వాత ఆ కేసులు అన్నింటినీ నిపుణులైన రేడియాలజిస్టులు కూడా పరిశీలించారు. ఏఐ టూల్ స్పెసిఫిసిటీ 69.1 శాతంగా ఉంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశించిన ప్రమాణాలను అందుకుంటోందని డాక్టర్ లతా శర్మ వివరించారు. సంప్రదాయ రేడియోగ్రఫీతో దాన్ని నిర్ధారించడానికి ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో ఏఐ టూల్ మెరుగైన ప్రత్యామ్నాయం అవుతుందని పేర్కొన్నారు. సీనియర్ రేడియాలజిస్టు డాక్టర్ చైతన్య ఇసమళ్ల మాట్లాడుతూ మానవ నైపుణ్యానికి ఏఐ ప్రత్యామ్నాయం కాలేదు గానీ, ప్రాథమిక పరీక్షల విషయంలో ఆధారపడదగిన సాధనంగా ఉంటుందన్నారు. క్యూఎక్స్ఆర్ లాంటి ఏఐ టూల్స్ అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడంతో టీబీని త్వరగా గుర్తించి, చికిత్సలో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కడలి నుంచి కొండ దాకా

జీవితం సౌందర్యమయం కాగల సదుపాయాలను సామాన్యులు కోరుతారు. సమాజ సమష్టి సంపద సమృద్ధికి పాలకులు కృషి చేస్తారు. సమగ్ర రవాణా వసతులు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, విద్యుత్ సరఫరా వ్యవస్థలు మొదలైనవి ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు అత్యవసరమైనవి. అందుకే వాటి అభివృద్ధికి ప్రభుత్వాలు అగ్రప్రాధాన్యమిస్తున్నాయి. దేశ మౌలిక సదుపాయాలను ప్రపంచ ప్రమాణాలతో నిర్వహించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తొలినుంచీ విశేష శ్రద్ధ చూపుతూ వస్తోంది. ప్రపంచ అతి పొడవైన హైవే సొరంగ మార్గం అటల్ టన్నెల్, ముంబైలో అటల్ సేతు, బ్రహ్మపుత్రా నదిపై బొగిబీల్ వంతెన అందుకు ఉదాహరణలు. ఈ కోవలోనివే కాక వాటికంటే మరింత ప్రశస్తమైన నిర్మాణ ప్రజ్ఞా పాటవాలతో రూపుదిద్దుకున్న కట్టడాలు కొత్త పాంబన్ వారధి, కశ్మీర్ లోయను విశాల భారత దేశంతో అనుసంధానం చేసే రైలు మార్గంలో భాగమైన (ప్రపంచపు అతి ఎత్తైన) చీనాబ్ రైల్ బ్రిడ్జి. ఇంజనీరింగ్ అద్భుతాలుగా అందరూ అబ్బురపడుతున్న వీటిలో మొదటిదాన్ని ప్రధాని మోదీ శ్రీరామ నవమి రోజున ప్రారంభించారు. రెండోదాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నారు.

దక్షిణ తమిళనాడు ప్రాంతంలోని పుణ్యక్షేత్రమైన రామేశ్వరం దీవిని ప్రధాన భూభాగంతో అనుసంధానం చేసే కొత్త పాంబన్ వంతెన మన దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జి. 72.5 మీటర్ల వర్టికల్ లిఫ్ట్‌తో 2.08 కి.మీ. పొడవున ఉండే ఈ వంతెన భారతీయ ఇంజనీరింగ్ సామర్థ్యానికి ప్రతీక. నౌకాయానానికి వీలుగా 110 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలకుల హయాంలో నిర్మించిన పాత పాంబన్ వంతెన స్థానంలో ఈ కొత్త వంతెనను నిర్మించారు. దీని నిర్మాణంతో భౌగోళిక, పర్యావరణ సవాళ్లను అధిగమించి మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరచడంలో తన అద్వితీయతను భారత్ నిరూపించుకున్నది. అమెరికాలోని గోల్డెన్ గేట్ బ్రిడ్జి, లండన్‌లోని టవర్ బ్రిడ్జి, డెన్మార్క్‌లోని అరెసండ్ వంతెనలు మాత్రమే దీనికి సమమైనవి. రామాయణ గాథతో సంబంధమున్న ప్రాంతంలోని ఈ సముద్ర వంతెన ఆధునిక చరిత్రా విశిష్టమైనది. ముఖ్యంగా రామేశ్వరం బిడ్డ అయిన మాజీ రాష్ట్రపతి ఎపిజె అబుల్ కలామ్ బాల్యం పాత పాంబన్ వంతెనతో ముడివడి ఉన్నది. జీవనోపాధికి వార్తా పత్రికలు పంపిణీ చేసిన కలాం ఆ వంతెనపై నడిచే రైళ్లలోనే ప్రధాన భూభాగానికి వెళ్లి వార్తా పత్రికలను తీసుకువచ్చి రామేశ్వరంలో చందాదారులకు సరఫరా చేస్తుండేవారు. ఆ రైలు మార్గం ద్వారానే ఆయన దేశంలోని వివిధ ఉన్నత విద్యా సంస్థలకు వెళ్లి 'మిసైల్ మ్యాన్'గా ప్రసిద్ధి పొంది, అంతిమంగా రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. మరో ప్రముఖుడు, మెట్రో మ్యాన్‌గా ప్రసిద్ధి పొందిన ఇంజనీర్ ఇ. శ్రీధరన్ 1964లో పెనుతుపాన్‌లో కొట్టుకుపోయిన పాత పాంబన్ వంతెన పునర్నిర్మాణాన్ని కేవలం 46 రోజులలోనే పూర్తి చేసి తన ఇంజనీరింగ్ ప్రతిభాపాటవాలు, నిర్మాణ దక్షతను తొలిసారి నిరూపించుకున్నారు. ప్రపంచ అగ్రగామిగా ప్రభవిస్తున్న భారత్ ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ఈ కొత్త పాంబన్ వంతెన ఒక తిరుగులేని నిదర్శనమని దాన్ని నిర్మించిన రైల్వేవికాస్ నిగమ్ లిమిటెడ్ చైర్మన్ ప్రదీప్ గౌర్ అన్న మాట ఎంత మాత్రం సత్యదూరమైనది కాదు.

సరిగ్గా పది రోజులకు (ఏప్రిల్ 19), చీనాబ్ రైల్ బ్రిడ్జి భాగంగా ఉన్న ఉదాంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైలు మార్గంలో కాట్రా–శ్రీనగర్‌ల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. చీనాబ్ నదిపై ప్రపంచపు అతి ఎత్తైన రైలు వంతెన ఉన్న 272 కిలోమీటర్ల ఈ మార్గంలో 38 సొరంగాలు, 927 వంతెనలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక వ్యయ ప్రయాసలతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ రైలు మార్గం కశ్మీర్ లోయలో పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధిపరుస్తుందనే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది. స్థానిక వ్యాపారాలకు, హస్తకళలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. కశ్మీరీలు, ఇతర భారతీయులకు మధ్య ఉన్న భౌగోళిక, భావోద్వేగ దూరాలు తగ్గిపోయేందుకు ఈ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ దోహదం చేయగలదు.

దక్షిణాగ్రాన సముద్రంలో నిర్మించిన కొత్త పాంబన్ వంతెన, ఉత్తర కొసన హిమాలయ పర్వత ప్రాంతాలలో నిర్మించిన కొత్త రైలు మార్గం రెండూ ఈ దేశ సమైక్యత, సమగ్రతను పరిపుష్టం చేసేవే. అద్భుతాలు అయిన ఈ మౌలిక వసతులు దేశ ఐశ్వర్యాభివృద్ధికి విశేషంగా దోహదం చేస్తాయి. మరి ఈ సమష్టి సమృద్ధిలో సామాన్యుడికీ సముచిత వాటా లభిస్తుందా? అనేదే అసలు ప్రశ్న. అతడికి అన్యాయం జరగకుండా చూడడమనేది సదరు ఇంజనీరింగ్ అద్భుతాలను మించిన మహాద్భుతం అవుతుంది. ఈ మహాద్భుతమే సామాన్యుని కామన అని పాలకులు విస్మరించకూడదు.

ముస్లిం సంక్షేమానికే వక్ఫ్ సవరణలు

ఇస్లాంలోని మతపరమైన, దాతృత్వ కార్యక్రమాల కోసం వక్ఫ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉపయోగిస్తారు. వక్ఫ్ దానం చేసిన వారిని వాకీఫ్ (దానకర్తలు) అని, ఈ సంపదను పర్యవేక్షించడానికి నియమించబడిన వ్యక్తిని ముతావల్లీ అని అంటారు. వక్ఫ్ బ్రిటిష్ కాలం నుండి అనేక రూపాంతరాలు చెందింది. ముసల్మాన్ వక్ఫ్ వాలిడేటింగ్ యాక్ట్–1913; ముసల్మాన్ వక్ఫ్ యాక్ట్–1923; వక్ఫ్ ఆక్ట్–1954... వీటికి సవరణలు 1959, 1964, 1969, 1984 సంవత్సరాల్లో చేశారు. వక్ఫ్–1954 యాక్టును మార్చి 1995లో కొత్త యాక్ట్ చేశారు. అలానే 2013లో సవరణలు ద్వారా వక్ఫ్‌కు భారతదేశంలోని ఏ సంస్థకూ లేని అధికారం ఇచ్చి అవినీతికి రాచమార్గం వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం.

ప్రపంచంలో వక్ఫ్‌కు అత్యంత ఎక్కువ ఆస్తులు ఉన్నది భారతదేశంలోనే. 2024 నాటికి మొత్తం వక్ఫ్ ఆస్తులు 9.4 లక్షల ఎకరాలు. వాటి విలువ దాదాపు రూ.1.2 లక్షల కోట్లు. అందులో 5,32,819 ఎకరాలకు లెక్కలు లేవు, లేదా కబ్జాలో ఉన్నవి. ఇక సచార్ కమిటీ రిపోర్ట్ ప్రకారం వక్ఫ్ ఆస్తుల నుంచి ఏడాదికి కనీసం రూ.12,000కోట్ల ఆదాయం రావాలి. కానీ 2019లో రూ.163 కోట్లు వస్తే, 2024 మొత్తం దేశంలో కేవలం రూ.1.6 కోట్ల ఆదాయం వచ్చింది! భారతదేశంలో రక్షణ రంగం, రైల్వేల తర్వాత అత్యధిక ఆస్తులు ఇస్లాం మతపరమైన వక్ఫ్ సంపదే! పేద ముస్లింలకు ఒక వరం కావలిసిన వక్ఫ్ శాపంగా మారింది.



ఇప్పటి వరకు వక్ఫ్ చట్టం కేవలం నాయకులకు, ధనిక వర్గాలకు, ఆక్రమణదారులకు ఒక అడ్డాగా మారింది. పేదవర్గాలకు చేరవలసిన ఫలాలను ధనిక ముస్లిం వర్గాలు కొల్లగొట్టాయి. అల్లాహ్ ఆస్తులు ముస్లిం వర్గాలలోని పేద వర్గాలకు, మహిళలకు అందించాలన్నదే మోదీ ప్రయత్నం. ఇందువల్ల హిందూ సమాజానికి కానీ, ఇతర మతస్థులకు కానీ వచ్చే లాభం ఏమీ లేదు.

వక్ఫ్ బోర్డులో కొన్ని ముఖ్యమైన సమస్యలు ఉన్నాయి. 1. అక్కడ అధికారం కొండంత, జవాబుదారీతనం శూన్యం. 2. కబ్జాలు, కోర్ట్ కేసులు, బంధువులకు అప్పగింత వంటివి విచ్చలవిడిగా జరుగుతున్నాయి. 3. కోట్ల ఆస్తులు, పైసల్లో లీజు లేదా రెంటు! ఏకంగా 30 ఏండ్లకు లీజులు; 4. వక్ఫ్ బోర్డు సభ్యులలో అందరూ ఒక సిండికేట్. మొత్తం ఆస్తులు ముస్లింలోని లీడర్లు, నవాబులు, ఉన్నత వర్గాల హస్తగతం అయ్యింది. అత్యధిక ఆస్తులు వారి హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలు, కమర్షియల్ బిల్డింగ్స్, అపార్టుమెంట్స్... ఇలా దుర్వినియోగం అవుతున్నది; 5. 2013లో కాంగ్రెస్ పార్టీ గద్దె దిగేటప్పుడు సెక్షన్ 40 తెచ్చింది. ఇది ఒక రాజ్యాంగ ఉల్లంఘన. సెక్షన్ 40 ప్రకారం ఎలాంటి ప్రామాణికత లేకుండా ముతావల్లీ ఎక్కడైనా సరే భూమిని వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించే అవకాశం కల్పించారు. భారతదేశంలోని ఏ కోర్టుకూ వక్ఫ్ ట్రిబ్యునల్ లేదా ముతావల్లీ చర్యలను సమీక్షించే అవకాశం లేకుండా చేసారు. 6. వక్ఫ్ బోర్డులో ముస్లిం వెనుకపడిన వర్గాలకు, స్త్రీలకు రిజర్వేషన్ లేనందున కేవలం ముస్లింలోని ఉన్నత వర్గాలకే లబ్ధి చేకూరుతున్నది. 7. వక్ఫ్‌పై దేశంలో 40 వేల కేసులు ఉంటే అందులో 10 వేలు ముస్లింలు వక్ఫ్‌పై వేసిన కేసులే!

ముఖ్యంగా సెక్షన్ 40 సృష్టిస్తున్న అరాచకాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. భారతదేశం మొత్తంలో కోర్టుల పర్యవేక్షణకు అవకాశం లేని ఏకైక చట్టం అది. కొన్ని ఉదంతాలను గమనిస్తే– తమిళనాడులోని ఒక గ్రామం (తిరుచునాతీరు) మొత్తం వక్ఫ్ ఆస్తి అని ప్రకటించారు. సూరత్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ బిల్డింగ్, ఆవరణ మొత్తం మాదేనని వక్ఫ్ ప్రకటించింది. సూరత్‌లోని శివశక్తి సొసైటీలో రెండు ప్లాట్లు వక్ఫ్ అని ప్రకటించి అక్కడ మసీదు నిర్మాణం చేసారు. తిరుచెందూరు దేవాలయం 600 ఎకరాలు, బెంగళూరులో 600 ఎకరాలు, విజయపురి జిల్లా కర్ణాటకలో 1500 ఎకరాలు, కర్ణాటక దత్తపీట్ మందిర్, కర్నటక పాలీపుర టెంపుల్ 600 ఎకరాలు... ఇలా సెక్షన్ 40ను అడ్డం పెట్టుకొని వివిధ రాష్ట్రాలలో 36 లక్షల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించారు!

తెలంగాణ విషయానికి వస్తే– ఈ రాష్ట్రంలో మొత్తం వక్ఫ్ ఆస్తులు 77,538 ఎకరాలు. అందులో 75శాతం కబ్జా, 3500 కేసులు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం రూ.4లక్షల కోట్లు ఉన్న ఈ ఆస్తుల వల్ల వచ్చే ఆదాయం సున్నా. ఉదారణకు చార్మినార్ దగ్గర మదీనా కాంప్లెక్స్ అనే కమర్షియల్ కాంప్లెక్స్ వక్ఫ్ ఆస్తి. ఇక్కడ కోట్ల ఆదాయం వస్తున్నా వక్ఫ్ సంస్థకు ఇచ్చే రెంట్ ఏడాదికి రూ.10వేలు కూడా లేదు. తెలంగాణలో కబ్జా అయిన భూముల్లో అత్యధికంగా బడా నేతల, బడా వ్యాపారుల ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, ప్రైవేట్ హాస్పిటల్స్, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఫంక్షన్ హాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కంపెనీలు ఉండటం విశేషం. కొన్ని నామమాత్రం లీజు, అత్యధికంగా కబ్జా.

2005 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన ఎదుగుదల కోసం జస్టిస్ సచార్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కొన్ని సిఫారసులు చేసింది. 1. ముతావల్లీ పనితీరు పారదర్శకంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి, 2. రికార్డులు మొత్తం పారదర్శకంగా ఉండాలి, 3. వక్ఫ్ బోర్డులో ఏ మతంవారైనా టెక్నికల్ నిపుణులను నియమించాలి, 4. బోర్డులో మహిళలు, వెనకపడ్డ వర్గాలు, ముస్లింలలో ఉన్న ఇతర తెగలకు స్థానం కల్పించాలి 5. జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులకు కౌన్సిల్, బోర్డులలో స్థానం కల్పించాలి. 6. వక్ఫ్ బోర్డును ఫైనాన్సియల్ ఆడిట్ పరిధిలోకి తేవాలి.

యూనిఫైడ్ వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సమర్థత & అభివృద్ధి చట్టం (2025) ద్వారా ముస్లిం సమాజానికి పలు లాభాలు ఉన్నాయి. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుంది. డిజిటల్ రికార్డింగ్ జరుగుతుంది. వక్ఫ్ ఆస్తుల ఆదాయాన్ని సామాజిక, విద్యా అభివృద్ధికి వాడవచ్చు. ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవచ్చు. చట్టపరమైన రక్షణ లభిస్తుంది. వక్ఫ్ బోర్డుల పనితీరులో సమర్థత, సమన్వయం పెరుగుతాయి. వక్ఫ్ నిర్వహణలో మహిళా ప్రాతినిధ్యం పెరుగుతుంది.. ముస్లింలలో వెనుకబడ్డ, అల్పసంఖ్యాక వర్గాలు షియా, అఘకాని, బోరా, ఇస్మాయిలి వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తుంది. పేద ముస్లింలకు విద్యా, ఆరోగ్య పరిరక్షణకు వక్ఫ్ ఆదాయం వినియోగం అవుతుంది. వక్ఫ్ బోర్డుల నిర్ణయాలకు వ్యతిరేకంగా ఫిర్యాదుకు అవకాశం ఉంటుంది. ఆడిట్ నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

ఇప్పటి వరకు వక్ఫ్ చట్టం కేవలం నాయకులకు, ధనిక వర్గాలకు, ఆక్రమణదారులకు ఒక అడ్డాగా మారింది. పేదవర్గాలకు చేరవలసిన ఫలాలను ధనిక ముస్లిం వర్గాలు కొల్లగొట్టాయి. అల్లాహ్ ఆస్తులు ముస్లిం వర్గాలలోని పేద వర్గాలకు, మహిళలకు అందించాలన్నదే మోదీ ప్రయత్నం. ఆ దిశగానే వక్ఫ్ చట్ట సవరణలు. ఇందువల్ల హిందూ సమాజానికి కానీ, ఇతర మతస్థులకు కానీ వచ్చే లాభం ఏమీ లేదు.

● డాక్టర్ బూర నర్సయ్యగౌడ్
మాజీ ఎంపీ, భోనగిరి

కాంగ్రెస్ పునరుజ్జీవన పథమేమిటి?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'ప్రజాస్వామ్యం రెండు చక్రాలపై నడుస్తుంది. ఒక చక్రం అధికార పార్టీ అయితే మరో చక్రం ప్రతిపక్షం. ప్రజాస్వామ్యం సరిగా సాగాలంటే బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలపడాలి. అది బలహీనపడితే దాని స్థానంలో ప్రాంతీయ పార్టీలు ప్రవేశిస్తాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.' అని రెండేళ్ల క్రితం బీజేపీ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. ఒక బీజేపీ నేత నుంచి ఇలాంటి మాటలు వచ్చాయంటే ప్రతిపక్షం బలహీనంగా ఉన్నందువల్ల జరిగే పర్యవసానాల గురించి ఆయన అర్థం చేసుకునే ఉంటారు. దేశంలో కాంగ్రెస్ ఇప్పుడు కేవలం మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉన్నది. బీజేపీతో ముఖాముఖి పోటీ జరిగే రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ ఆ పార్టీని ఎదుర్కోలేక పోతున్నదనే విషయం స్పష్టంగా నిరూపితమవుతూనే ఉన్నది. గుజరాత్‌లో మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోతోంది. ఈ పరిస్థితుల్లో గుజరాత్‌లో ఏఐసీసీ సమావేశాలను ఏర్పాటు చేసినంత మాత్రాన ఫలితాలు భిన్నంగా ఉంటాయా? గత నెలలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గుజరాత్‌కు వెళ్లి దాదాపు రెండు రోజుల పాటు 500 మంది కాంగ్రెస్ నేతలతో విస్తృత సమాలోచనలు జరిపారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఎందుకు దూరమయ్యారు అన్న విషయమై వాస్తవాలు తెలుసుకోవడంపై ఆయన తన దృష్టి కేంద్రీకరించారు. ప్రజా సమస్యలపై పోరాడడంతో పాటు జిల్లా, గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేస్తే కాని ఫలితాలు సాధించలేమనే అభిప్రాయానికి వచ్చారు.

కాంగ్రెస్ శిథిలావస్థలో ఉన్నదని, బలపడేందుకు ఏమీ చేయడం లేదని, రాష్ట్రాల్లో అంతర్గత కలహాలతో సతమతమవుతోందని విమర్శించడం సులభం. బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిషా, తమిళనాడు, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ అధికారంలో లేదని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని ఎవరైనా ఎత్తిపొడవచ్చు. అయితే కొంతకాలంగా కాంగ్రెస్ ఏదో రకంగా పోరాడుతూనే ఉన్నది. ఏదో ఒక అంశంపై ఆ పార్టీ నేతలు ప్రజల్లోకి వెళుతూనే ఉన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ నేతలు, కాంగ్రెస్ నేతల మధ్య సైద్ధాంతిక అంశాలపై బలమైన వాగ్యుద్ధాలు జరిగాయి. పార్టీలో సంస్థాగత మార్పులు తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ నేతలు తీవ్ర యత్నాలు చేస్తూనే ఉన్నారు. రెండు నెలల క్రితం జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయినప్పటికీ, మొత్తం 70 స్థానాల్లో తన ఉనికిని నిలబెట్టుకోగలిగింది. దాదాపు పది స్థానాల్లో బీజేపీకి లభించిన ఆధిక్యత కంటే కాంగ్రెస్ ఎక్కువ ఓట్లు సాధించింది. మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ మూలంగా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ 4 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్ తన వ్యూహరచనను మార్చుకున్నదనడానికి ఇది నిదర్శనం. మిత్రపక్షాలు అవసరమైన చోట స్నేహంగా ఉంటూనే స్వతంత్రంగా బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ చర్యలు తీసుకుంటోంది. కొత్త ముఖాలకు అవకాశం కల్పిస్తోంది. బీజేపీని ఢీకొనాలంటే దీర్ఘకాలిక వ్యూహంతో పని చేయాలనే విషయం కూడా కాంగ్రెస్‌కు అర్థమయినట్లు కనిపిస్తోంది. అందుకే 2027లో జరిగే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అక్కడే తన ఏఐసీసీ సమావేశాలను నిర్వహిస్తోంది. ఆరు దశాబ్దాల తర్వాత మోదీ స్వంత రాష్ట్రంలోనే ఈ సమావేశాలను నిర్వహించడం ఒకరకంగా బీజేపీకి సవాలు విసిరినట్లే.

ప్రత్యర్థి ఎంత బలాఢ్యుడైనా ఆయన చేతుల్లో బలికావడం కంటే శాయశక్తులా పోరాడి కనీసం జీవించేందుకు కాంగ్రెస్ బలంగా యత్నాలు చేయడం హర్షణీయమే. ఎప్పటికైనా మోదీ రాజకీయాల్లోంచి నిష్క్రమిస్తారని, బీజేపీపై ప్రజా వ్యతిరేకత రాకమానదని కాళ్లు చాపుకుని విశ్రమించడం వల్ల కాంగ్రెస్ పూర్తిగా తెరమరుగవుతుందనే విషయం ఆ పార్టీ నేతలకు తెలుసు. కాంగ్రెస్ పునరుద్ధరణ కాంగ్రెస్‌కు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి కూడా ముఖ్యమని ఆ పార్టీ నేతలు గ్రహిస్తున్నారు. కాని మోదీ నాయకత్వంలో అత్యంత బలోపేతమైన భారతీయ జనతా పార్టీ, దానికి అండగా నిలిచిన సంఘ్ పరివార్ సంస్థలను, ప్రజల్లో విస్తరిస్తున్న హిందూత్వ భావోద్వేగ వెల్లువలను గమనించిన తర్వాత కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదా అన్న అపనమ్మకాలు మాత్రం ఇప్పట్లో దూరమయ్యే అవకాశాలు లేవు. కాంగ్రెస్ పుంజుకుంటుందా లేదా అన్న చర్చ కంటే కాంగ్రెస్ ఎక్కడ దారితప్పిందనే చర్చ చేయడం అవసరం. బలహీన వర్గాలు, మైనారిటీలు, దళితుల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడడం ద్వారా కాంగ్రెస్ బీజేపీ కంటే భిన్నమైనదని, బీజేపీ సంపన్నవర్గాల పార్టీ అని తీర్మానించడం వినడానికి బాగానే ఉంటుంది. కాని ఇవే వర్గాలు కాంగ్రెస్‌కు ఎందుకు దూరమయ్యాయి, ఇప్పుడు కాంగ్రెస్‌ను అవి ఎందుకు విశ్వసించాలి అన్న విషయంపై కూడా ఆ పార్టీ నేతలు స్పష్టంగా ఆలోచించాల్సి ఉంటుంది.

రెండవది, కాంగ్రెస్ వారసత్వానికి సంబంధించిన విషయం. కాంగ్రెస్‌లో ఒకప్పుడు మహామహులైన, దేశ భక్తులైన నాయకులు ఉండేవారు. ఇదే గుజరాత్‌లో 1938లో జరిగిన ఏఐసీసీ సదస్సుకు సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించి, బ్రిటిష్ వలస పాలకులపై రాజీలేని సంపూర్ణ పోరాటానికి పిలుపునిచ్చారు. ఇదే గుజరాత్‌లో సర్దార్ పటేల్ దాదాపు పాతికేళ్లు కాంగ్రెస్ శ్రేణులకు శక్తిమంతమైన నాయకత్వాన్ని అందించారు. సహాయ నిరాకరణ, పౌర ఉల్లంఘన, విదేశీ వస్త్ర దహనం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాలతో పాటు కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన ప్రతి పిలుపు విజయవంతమయ్యేలా చూశారు. జాతీయ పతాకాన్ని నిషేధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి వేలాది కార్యకర్తలు నిషేధాజ్ఞలు ధిక్కరించి పతాకాన్ని ఆవిష్కరించేలా చేశారు. వీరే కాదు, రాజద్రోహ నేరంపై మాండలే జైలులో ఆరు సంవత్సరాలు గడిపిన బాలగంగాధర్ తిలక్, స్వయం పాలనకోసం పోరాడిన గోపాలకృష్ణ గోఖలే, సామాజిక సంస్కరణలను అభిలషించిన గోవింద్ రనడే లాంటి వారెందరో కాంగ్రెస్‌కు చెందినవారే. నాలుగుసార్లు కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న మదన్‌మోహన్ మాలవీయ చౌరీచౌరా కేసులో ఉరిశిక్షపడిన వారిని నిర్దోషులుగా విడుదల చేయించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కాంగ్రెస్‌లో అతివాద, మితవాద శక్తులు సైద్ధాంతికంగా ఘర్షించేవి. కాని వారందరూ మెజారిటీ హిందువులను ఆకర్షించేవారు. మహాత్మాగాంధీ కూడా ప్రజాసమీకరణ చేస్తూనే హిందూ ప్రతీకల్ని ఉపయోగించుకునేవారు.



కాంగ్రెస్ పునరుద్ధరణ కాంగ్రెస్‌కు మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్యానికి చాలా ముఖ్యమని ఆ పార్టీ నేతలు గ్రహిస్తున్నారు. అయితే మోదీ నాయకత్వంలో అజేయ శక్తిగా బలోపేతమైన భారతీయ జనతా పార్టీ, దానికి అండగా నిలిచిన సంఘ్ పరివార్ సంస్థలను, ప్రజల్లో విస్తరిస్తున్న హిందూత్వ భావోద్వేగ వెల్లువలను గమనించిన తర్వాత కాంగ్రెస్ పూర్వవైభవాన్ని సంతరించుకోగలదా అన్న సందేహాలు, అపనమ్మకాలు మాత్రం ఇప్పట్లో దూరమయ్యే అవకాశాలు లేవు.

అయితే స్వాతంత్ర్యానంతరం స్వాతంత్ర్య పోరాట యోధుల విలువల్ని, వారసత్వాన్ని విస్మరించింది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు మహోన్నత చరిత్ర ఉన్నదా అని ప్రజలు అనుమానపడే పరిస్థితిని కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన కొన్ని దశాబ్దాల వరకూ స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించేవారు. పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభాత భేరీలను నిర్వహించేవారు. దేశభక్తి గీతాలతో వీధులు మారుమ్రోగిపోయేవి. కాని తర్వాతి కాలంలో ఈ వాతావరణం పూర్తిగా మారిపోయింది. బిహార్‌లో బాబూరాజేంద్ర ప్రసాద్ నివసించిన సదాకత్ ఆశ్రమ్ ఇప్పుడు ఒక పాడుబడ్డ భవనంగా మారడమే అందుకొక ఉదాహరణ. కాంగ్రెస్ ఈ వ్యవహారశైలి భారతీయ జనతా పార్టీకి ఎంతో ఉపయోగపడింది. బీజేపీని, నరేంద్రమోదీని ఇప్పుడు ఏ విషయంపై విమర్శించినా గతంలో కాంగ్రెస్ చేసిన తప్పిదాలు గుర్తుకు వచ్చేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరించారు. మదన్ మోహన్ మాలవీయ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్ భాయి పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి నుంచి మహాత్మా గాంధీ వరకూ నరేంద్రమోదీ దేశభక్తులందర్నీ తన స్వంతం చేసుకోవడం ప్రారంభించారు. హిందువుల ఓటు బ్యాంకు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ ఓటు శాతం పడిపోయే విధంగా బీజేపీ తన విధానాలను రూపొందించుకుంది.

దీనివల్ల కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడిపోయింది. ఇప్పుడు గుజరాత్‌లో సర్దార్ వల్లభ్ పటేల్ స్మారక చిహ్నం వద్ద కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని, గాంధీజీ ఆశ్రమం ఉన్న సబర్మతీ నది వద్ద ఏఐసీసీ సమావేశాలను నిర్వహిస్తున్నారంటే కాంగ్రెస్ మళ్లీ తన పూర్వవైభవాన్ని గుర్తుచేసుకుంటున్నదన్నమాట. గుర్తుచేసుకోవడం మాత్రమే సరిపోదు, తాను ఎప్పుడు, ఎక్కడ దారి తప్పిందన్న విషయమై అంతర్మథనం చేసుకోవాలి. ఒకప్పటి స్వాతంత్ర్య సమరయోధుల స్మారక స్థలాల మధ్య సమావేశాలు నిర్వహించడం, వారి చిత్రపటాలకు పూలమాలలు వేయడంతోనే సరిపోదు. వారి నాయకత్వ మహోన్నత స్ఫూర్తిని ప్రజల్లో వ్యాప్తి చేసేందుకు తామేమి చేయగలమో కాంగ్రెస్ నేతలు ఆలోచించాలి. దేశభక్తి, జాతీయవాదం, హిందూత్వ ఈ మూడింటినీ కలగలిపి బీజేపీ తన స్వంతమే అన్నట్లుగా ప్రచారం చేసుకుంటుంటే తామెందుకు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయామో ఆలోచించాలి. అంతేకాదు, సైద్ధాంతికంగా భిన్న స్వరాలకు కాంగ్రెస్ మళ్లీ వేదికగా మారాలి. అతివాద, మితవాద స్వరాలకు ఆస్కారం కల్పించాలి. 1955లో హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు జేబీ కృపలానీ కేవలం హిందూ మతం కోసమే చట్టం చేయడం సరికాదని విమర్శించారు. షాబానో కేసు, అయోధ్య నుంచి రాజీవ్ ఎన్నికల ప్రచారం ప్రారంభించడం నుంచి ఇప్పటి వరకూ మతం విషయమై కాంగ్రెస్ సైద్ధాంతికంగా డోలాయమాన పరిస్థితిలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ ఇటీవల 'మెమోయిర్స్ ఆఫ్ మావెరిక్' అనే పుస్తకంలో ఈ డైలమాల గురించి అభివర్ణించారు. విఎన్ గాడ్గిల్ లాంటి వారు కాంగ్రెస్‌లో విపరీత ఆలోచనా ధోరణిని విమర్శించారు. ఇది బీజేపీ ఎదుగుదలకు ఆస్కారం కల్పించిందనడంలో సందేహం లేదు. వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ సంస్థాగతంగా పటిష్ఠం కావడమే కాదు, సైద్ధాంతిక స్పష్టత ఏర్పర్చుకోవడంపై దృష్టి పెట్టాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఇసుక అక్రమాలను ఈ విధానం అరికడుతుందా?

'ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని... కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచొచ్చని..' హైదరాబాద్ ఐసీసీసీలో ఇటీవల జరిగిన గనుల శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇది మంచి విషయమే. కానీ, క్షేత్ర స్థాయిలో జరిగే అక్రమ, చట్ట విరుద్ధ ఇసుక దోపిడీకి అవధులు లేవు. 'కృత్రిమంగా ఇసుక కొరతను సృష్టించడం, ఆ తరువాత రేట్లు పెంచి అమ్ముకోవడం, నకిలీ వే బిల్లులు, నంబర్ ప్లేట్లు మార్చి ఇసుక రవాణా, తదితర అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని తీసుకురావాలని యోచిస్తున్నది..' అని కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు. కానీ, ఈ కొత్త పాలసీ నిజంగా అక్రమ, చట్ట విరుద్ధ ఇసుక తవ్వకాలను అడ్డుకొంటుందా?

గత ప్రభుత్వ హయాంలో ఇసుక పాలసీ అక్రమార్కులకు కాసులు కురిపించింది. స్థానిక నేతలు, క్రింది స్థాయి అధికారుల నుంచి పై స్థాయి వరకు మామూళ్ళు భారీగా చేతులు మారటంతో అంతా చూసీ చూడనట్లుగానే వ్యవహారం సాగిందనేది విదితమే. ఇసుక టెండరుదారులు కొన్ని చోట్ల లారీ యజమానుల నుంచి లోడింగ్ ఛార్జీ పేరుతో ప్రతి లారీకి రూ.2,500 వరకు వసూలు చేశారు. అలాగే 10 టైర్ల లారీలు 19.5 టన్నులు, 12 టైర్ల లారీలు 26 టన్నులు, 14 టైర్ల లారీలు 32 టన్నుల ఇసుక తరలించాల్సి వుండగా, 'అదనపు బకెట్' పేరుతో ప్రతి లారీలో ఐదారు టన్నుల ఇసుకను అదనంగా నింపారు. ఇందుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేశారు. అలాగే లారీల నెంబరు ప్లేట్లు మార్చటం, నకిలీ వే బిల్లులతో వందలాది లారీల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకొన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి హయాంలోనూ జరుగుతున్నదదే. విచ్చలవిడిగా అక్రమార్జన కోసం చేస్తున్న సహజ వనరుల విధ్వంసం భవిష్యత్ తరాలకు విధ్వంసమే మిగిలించే ప్రమాదం ఉంది.

రాష్ట్రంలో గోదావరి నదికి ఆదిలాబాద్ జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరకు 1465 కిలోమీటర్ల తీరం ఉంది. కానీ, ఇసుక అక్రమ తవ్వకాల వల్ల తీరని నష్టం జరుగుతున్నది. దీనిని అరికట్టాలి. 'సొసైటీల' పేరిట బినామీ కాంట్రాక్టర్లు గోదావరి తీరంలో ఇష్టారీతిన వ్యవహరిస్తూ అక్రమ పద్ధతుల్లో ప్రభుత్వాదాయానికి గండి కొడుతూ, అమాయక సొసైటీ సభ్యులను నష్టపరుస్తూ, కోట్లు గడిస్తున్నారు. వీరు వాస్తవానికి 3.5 మీటర్లు గల ఇసుక మేటలనే తీయాలి. కానీ, హద్దూ పద్దూ లేకుండా తోడేస్తున్నారు. ఈ విధానం, ప్రకృతి విపత్తులకు కారణమవుతున్నది. తెలంగాణ ఏర్పడ్డ తరువాత ఒక కొత్త జీవో ద్వారా ఇసుక అమ్మకాలకు టీఆర్ఎస్ ప్రభుత్వం పూనుకొన్నది. ఇందుకోసం టీజీఎండీసీతో బినామీలకు కాంట్రాక్టు దక్కే విధానం నిర్ణయించింది. వీటి ద్వారా 2014–15లో 1.83 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు అనుమతిచ్చి, రూ.19.12 కోట్లు గడించింది. 2023–24లో రూ.1000 కోట్లు ఆదాయం వచ్చింది. ఇక కాంట్రాక్టర్లు అక్రమంగా లెక్కలేనన్ని కోట్లు సంపాదించారు. ఇక్కడ అటవీ, ఆదివాసీ చట్టాలతోపాటు వాల్టా చట్టం కూడా ఉల్లంఘిస్తున్నారు. ఇసుక తవ్వకాల్లో యంత్రాలను వాడరాదు. మితిమీరిన ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటడమేగాక, గోదావరి నీటి ప్రవాహ గమనం కూడా మారుతున్నది. తీరంలో గతంలో నీటి నిల్వలున్న ప్రాంతం ఎడారిగా మారుతున్నది. ఈ సంవత్సరం మార్చిలోనే భద్రాచలం వద్ద గోదావరి పీలిక లాగా కనపడీ కనపడనట్లున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహజ వనరులకు పుట్టినిల్లు. గోదావరి, కిన్నెరసాని వంటి నదులతో పాటు పాములేరు, ముర్రేడు, బుగ్గవాగు, తాలిపేరు, పెద్దవాగు వంటి నదులున్నాయి. వీటి నుంచి పరిసర గ్రామాల పేదలు ఒకప్పుడు ఎడ్లబండ్లతో ఇసుక సరఫరా చేస్తూ జీవనోపాధి పొందేవారు. అయితే, కాలక్రమంలో ఇసుక మాఫియా పుట్టింది. ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక తరలించి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. 'లైసెన్స్ ఉందనే' పేరిట చట్టవిరుద్ధంగా వారు పొందిన హద్దులు దాటి ఒక పర్మిట్‌తో ఎన్నో రెట్లు తోడుకొంటున్నారు. దీంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. నది ప్రవాహం ఉన్నప్పుడు ఇసుక గోతుల్లో పడి ప్రజలు చనిపోతున్నారు. 2025లో ఈ ప్రాంతంలో ఇసుక లారీ ప్రమాదాలలో ఆరుగురు చనిపోయారు.

గోదావరిలో ఇసుక అక్రమ తవ్వకాలను నివారించాలన్నా, సహజ వనరులను రక్షించుకోవాలన్నా మైనింగ్, అటవీ పరిరక్షణ, పెసా వంటి చట్టాల నిబంధనలు కచ్చితంగా అమలు జరపాలి. రాష్ట్ర ప్రభుత్వమే ఇసుక తవ్వకాలు చేపట్టాలి. ప్రభుత్వాలు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కాక, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకోవాలి.



అక్రమ ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీని వల్ల రైతుల బోర్లు, చెరువులు ఎండిపోతున్నాయి. పంట నష్టం జరుగుతున్నది. అక్రమ ఇసుక రవాణా కోసం నదిలోనే రోడ్లు వేస్తున్నారు. ఇసుక క్వారీల నుంచి ఆర్ అండ్ బి రోడ్లు మీదికి అమితమైన బరువుతో (32టన్నులకు మించి 72టన్నుల వరకు) లారీలు ప్రయాణించడం వల్ల రోడ్లు గుల్లవుతున్నాయి. దుమ్ము, ధూళితో పరిసర గ్రామస్తులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంటలపై దుమ్ము పడి దిగుబడి తగ్గుతున్నది. సంబంధిత అధికార్లకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదు. ఇది ముఖ్యంగా చర్ల ప్రాంతంలోని సి–కత్తి గూడెం ఇసుక క్వారీలో జరుగుతోంది. వాస్తవానికి నదుల్లో మేటవేసిన ఇసుకనే తీయాలి. అది కూడా నిర్ణీత పరిమాణంలో తీయాలి. కానీ, ఇందుకు భిన్నంగా జరుగుతున్నది. ఈ విషయం ఎవరైనా గ్రహిస్తారేమోననే గుండాలను సైతం కాపలా పెట్టుకొంటున్నారు. ఇసుక క్వారీ ప్రాంతాలను పరిశీలించడానికి ఎవరినీ రానీయటం లేదు.

అక్రమ ఇసుక తవ్వకాల వల్ల కొన్ని ప్రాంతాలలో భూగర్భ జలాలు వేగంగా క్షీణించటంతో యాసంగి పంటలకు పెనుముప్పుగా మారుతోంది. ప్రస్తుతం వివిధ పంటలు కీలక దశలో వుండగా, భూగర్భ జలాలు ఇంకిపోవడం వీటిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ మండలాల్లో భూగర్భ జలాలు భూగర్భ మట్టానికి 5.09 మీటర్ల దిగువన నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఇవి 5.44 మీటర్లకు పడిపోయాయి. రైతులు కొత్త బోరు బావులను అధిక లోతుతో తవ్వుతున్నా ఫలితం కనిపించక ఆవేదన చెందుతున్నారు.

ఈ పరిస్థితుల్లో నదీ జలాల రక్షణ చాలా ముఖ్యమైన విషయం. జీవవైవిధ్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. పర్యావరణం, వ్యవస్థలను పోషించటంలో నీటి పాత్ర ఎనలేనిది. అడవులు, మైదానాలు, చిత్తడి నేలలు, తీర ప్రాంతాలతో పాటు సముద్రాల్లోని జీవులకు అవసరమైన పోషకాలను అందించేవి ఈ జలవనరులే. తాగునీటికి, సాగునీటికి మనం ఎక్కువగా ఆధారపడుతున్నది నదులపైనే. అందుకే నదులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉంది. 'మన రాజ్యాంగంలోని 51వ అధికరణం ప్రకారం నదులు, సరస్సులు, అడవులతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడం పౌరుల బాధ్యత. నదులను పూజించే మన దేశంలో ఏ నదీతీరాన్ని చూసినా కాలుష్యం, ఇసుక దోపిడీ కనిపిస్తాయి'. పారిశ్రామిక కార్యకలాపాలకు తోడు పట్టణీకరణ వేగంగా విస్తరిస్తుండటంతో దేశంలోని నదులకు హాని కలుగుతోంది. తీరప్రాంతాల్లో వెలసిన గ్రామాలు కాలక్రమంలో పట్టణాలు, నగరాలుగా విస్తరించాయి. ఈ పరిణామంతో నదులు ఆక్రమణకు, కాలుష్యానికి గురవుతున్నాయి. గనులు, ఖనిజాల (అభివృద్ధి నియంత్రణ) చట్టం 1957 ప్రకారం ఇసుక చిన్న ఖనిజాల జాబితాలోకి వస్తుంది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1996, పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) 2006 నిబంధనల ప్రకారం పర్యావరణ అనుమతులు పొందిన నిర్దేశిత ప్రాంతాలలో పరిమితులలోనే ఇసుక తవ్వకాలు జరపాలి. 1980 ఫారెస్టు కన్సర్వేషన్ యాక్టును కూడా పరిగణనలో ఉంచుకోవాలి.

గోదావరిలో ఇసుక అక్రమ తవ్వకాలను నివారించాలన్నా, సహజ వనరులను రక్షించుకోవాలన్నా మైనింగ్, అటవీ పరిరక్షణ, పెసా వంటి చట్టాల నిబంధనలు కచ్చితంగా అమలు జరుపాలి. రాష్ట్ర ప్రభుత్వమే ఇసుక తవ్వకాలు చేపట్టాలి. స్థానిక అవసరాలకు ఇసుక ఉచితంగా సరఫరా చేయాలి. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల జరిగే రహదారుల నష్టాలను, రైతులకు జరిగే పంటల నష్టాలను అరికట్టాలి. ప్రస్తుత అక్రమాలపై సీబీసీఐడి చేత విచారణ చేపట్టి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కాక, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకోవాలి. అలా ప్రభుత్వాలు చేయని ఎడల రాజ్యాంగంలోని 51వ అధికరణ పౌరులకు కల్పించిన బాధ్యతలకు అనుగుణంగా ప్రజలే వనరుల రక్షణకు ఉద్యమించాలి.

■ కెచ్చెల రంగారెడ్డి
సీపీఐ(ఎం.ఎల్) నాయకులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
బుధవారం 9 ఏప్రిల్ 2025



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల

అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే

- ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
- ముఖ్యఅతిథిగా హాజరైన కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి
- వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచన



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లి

7



యాదవ నగర్‌లోని ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ భూముల సమీపంలో ఇళ్ల నిర్మాణాలు

ఆక్రమణలో కెనాల్ భూములు

కాకతీయ ప్రధాన కాలువ భూముల్లో నిర్మాణాలు

- నిషేధిత భూములను చెర బడుతున్న కబ్జాకోరులు
- అక్రమంగా అనుమతులిస్తున్న అధికారులు
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- కలెక్టర్ దృష్టి సారించాలంటున్న జిల్లా ప్రజలు



హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కెనాల్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. నీటి పారుదల శాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో 14 ఏళ్లుగా ఈ ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్న కాకతీయ మెయిన్ కెనాల్ భూముల సమీపంలో ఉన్న కొంత మంది అక్రమంగా భూమిని కబ్జా చేసి వందల సంఖ్యలో ఇళ్లు నిర్మించుకొని విక్రయాలు చేస్తున్నారు. కొంతమంది దళారులు, కబ్జాదారులు అమాయక ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ కెనాల్ భూముల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా హనుమకొండలోని యాదవనగర్, రెడ్డిపురం, కుమార్‌పల్లి, పెద్దమ్మగడ్డ, పలివేల్పుల సమీపంలోని కెనాల్ భూములు ఎక్కువ శాతం కబ్జాలకు గురైనట్లు నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

45 ఏళ్ల కిందట..

1980లో సాగునీరు, తాగునీటి కోసం భూసేకరణ చేసి ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ నిర్మించారు. ఇందుకోసం భారీగా భూ సేకరణ చేపట్టారు. మెయిన్ కెనాల్ 200 మీటర్ల నుంచి 300 మీటర్ల వరకు విస్తీర్ణం కలిగి ఉంటుంది. అయితే ఈ భూములను పలువురు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. కాగా, కెనాల్ భూములు అన్యాక్రాంతంపై అధికారులకు స్థానిక ప్రజలు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఫిర్యాదు చేసినా చూసీ చూడనట్లు ఉండడంతో రెండు నెలల నుంచి నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పైగా కొంత మంది అధికారుల అండదండలతోనే లక్షల్లో డబ్బులు వసూళ్లు చేసి కెనాల్ భూములను బ్రోకర్ల ద్వారా విక్రయాలు చేస్తున్నారని స్థానికులు చెబుతుండడం గమనార్హం.

అధికారుల వత్తాసు

హనుమకొండలోని కాకతీయ మెయిన్ కెనాల్ భూములు అన్యాక్రాంతంపై అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా అక్రమంగా నిర్మించుకున్న ఈ ఇళ్లకు గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సైతం గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. మామూళ్లు తీసుకొని అక్రమంగా అనుమతులు ఇచ్చి ఇంటి నంబర్, విద్యుత్ కేటాయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని శాఖల అధికారులు అనుమతి ఇస్తుండడంతో ఆక్రమణలను అడ్డుకోవడం కష్టతరంగా మారిందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

నోటీసులతో సరి

ఎస్ఆర్ఎస్‌పీ కాకతీయ మెయిన్ కెనాల్ చింతగట్టు సమీపం నుంచి హనుమకొండ, పలివేల్పుల, భీమారం, కుమార్‌పల్లి, యాదవనగర్ శివారు ప్రాంతాలలో ఇప్పటికే సుమారుగా 600లకు పైగా అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వారికి ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..

ఎస్ఆర్ఎస్‌పీ భూముల కబ్జాపై అధికారుల అండదండలతో వందలాది ఇళ్లు నిర్మించారని చెబుతున్నారు. కొంత మంది రాజకీయ నాయకుల హస్తం ఉండడంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు కాకతీయ కెనాల్ భూముల అన్యాక్రాంతంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద బస్సు బోల్తా

- డ్రైవర్‌తో సహా పలువురు ప్రయాణికులకు గాయాలు
- హనుమకొండ జిల్లా చింతగట్టు వద్ద ఘటన



6



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

యువతకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలో వేసవి వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణపై మంగళవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో మే1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పలు క్రీడాంశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నగరంలోని ఔత్సాహిక క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలలో పాల్గొనే క్రీడాకారుల సంఖ్య ఏటా పెరుగుతోందని, అందుకు తగిన విధంగా అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రత్యేకించి విద్యాశాఖ, మున్సిపల్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు జిల్లా క్రీడా శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ క్యాంపులో పాల్గొనే క్రీడాకారులకు దాతల సహకారంతో పాలు, గుడ్లు లాంటి అల్పాహారం అందించాలని కలెక్టర్ సూచించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో ప్రతిభకు మెరుగులు దిద్దుకుని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించే విధంగా కృషి చేయాలన్నారు. 22 క్రీడాంశాలలో శిక్షణ కార్యక్రమాలను నిర్వస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వై.వి.గణేష్, డీఈఓ వాసంతి, జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి అశోక్‌కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అజీజ్‌ఖాన్ వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించలేదు..

- నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..
- నాపై ఆరోపణలు చేసినవారు క్షమాపణలు చెప్పాలి..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టల స్థలాన్ని ఆక్రమించి 2వేల ఎకరాలు కబ్జా చేసినట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తాను గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వారి ఇంటిలో గులాంగిరి చేస్తానని, నిరూపించకపోతే వారు నా ఇంటిలో గులాంగిరి చేయాలని సవాల్ చేశారు. మంగళవారం హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేవునూరు గుట్టల చుట్టూ ఆరు గ్రామాల పరిధిలో ఫారెస్టు భూమి, అసైన్డ్, పట్టా భూములు ఉన్నాయని తెలిపారు. గతంలో హనుమకొండ కలెక్టర్‌గా పనిచేసిన రాజీవ్ హనుమంతు ఆధ్వర్యంలో రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సంయుక్తంగా సర్వే చేసినట్లు తెలిపారు. మొత్తం 3,950ఎకరాల భూమిలో చేసిన సర్వేలో 3,750 ఎకరాలు మాత్రమే భూమి అటవీశాఖ ఆధీనంలో ఉందని, మిగతా 200 ఎకరాలల్లో అసైన్డ్, పట్టా భూములు ఉన్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు అప్పటి అధికారులు హద్దులు కూడా నిర్ధారించినట్లు తెలిపారు. అయితే 1967 నుంచి అటవీశాఖ ఆధీనంలో ఉన్న 43.3ఎకరాల భూములలో తమ పట్టా, అసైన్డ్ భూములు ఉన్నాయని సుమారు 23 మంది 50 ఏళ్లుగా పంటలు వేసుకుంటే అటవీశాఖ అధికారులు తొలగిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా రైతులకు చెందిన భూమిని రైతులకు అందించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టా పాస్‌బుక్కులు ఉన్న రైతులకు 2017 నుంచి రైతుబంధు డబ్బులు వస్తున్నాయని అన్నారు. వారి భూమిని వారికి ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మిగతా ఫారెస్టు భూముల్లో ఇటీవల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో జరిగిన సమీక్ష సమావేశంలో ఏకో టూరిజం డెవలప్‌మెంట్ చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, 14 ఏళ్ల మంత్రిగా, ఎమ్మెల్యేగా మొత్తం 30 ఏళ్ల తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని ఎమ్మెల్యే కడియం పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అందరికంటే తాను పెద్ద లీడర్‌ను తానేనని తెలిపారు. అందుకే తనను టార్గెట్ చేస్తున్నారని వాపోయారు. తనపై అసత్యపు ఆరోపణలు చేసినందుకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే తాను తీసుకోబోయే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని కడియం హెచ్చరించారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు పార్కు స్థలాన్ని కబ్జా చేసి పర్యావరణం గురించి మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల కోసం పనిచేస్తున్న తమపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు చేసిన కబ్జాలన్నీ బయటకు తీస్తామని ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. 30 ఏళ్లుగా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్న కడియం శ్రీహరిలాంటి వారిపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ఆర్‌టీఏ మెంబర్ పల్లకొండ సతీష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆగని ఐపీఎల్ బెట్టింగ్ దందా

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పందాలు కాస్తున్న వైనం
- నిఘా పెట్టి కట్టడి చేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ వేళ క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. బెట్టింగ్ రాయుళ్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో యథేచ్ఛగా పందాలు కాస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టినప్పటికీ వారి కళ్లుగప్పి బెట్టింగ్ దందా చేస్తున్నారు. గత నెల 22 నుంచి ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కాగా, ఈ 15 రోజుల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతూ పలువురు పోలీసులకు పట్టుబడ్డారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఐపీఎల్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నిఘావర్గాలతో పాటు వేగుల ద్వారా సమాచారం రాబడుతున్నారు. అయితే లాఅండ్‌ఆర్డర్ పోలీసులు మాత్రం బెట్టింగ్‌లపై ఉదాసీతనగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఘటనలు

- మార్చి 25న పద్మాక్షీకాలనీలో రాధా ఎక్స్చేంజ్ యాప్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రూ.1,58,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిలో కాకినాడకు చెందిన వీరమణికుమార్‌ను అదివారం హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి 1,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 3న గీసుగొండలో ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.10,000 స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 5న కాజీపేట పీఎస్ పరిధిలో కరీంనగర్ జిల్లా వీణవంక మండలానికి చెందిన నలుగురిని అరెస్టు చేసి రూ.20,000 నగదును సీజ్ చేశారు.
- ఏప్రిల్ 5న ఆత్మకూరు పీఎస్ పరిధిలోని పెద్దపూర్ గ్రామానికి చెందిన ముక్కల రాజు ఢఫబెట్, గోల్డెన్ 365 (తీన్ పత్తా) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి రూ42,000 నగదును సీజ్ చేశారు. ఈ ఘటనలో నల్గొండకు చెందిన మర్రి సుధీర్, సురేశ్ అనే వ్యక్తులు పరారీలో ఉన్నారు.



బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : సీపీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లతో పాటు ఇతరత్రా బెట్టింగ్‌లకు పాల్పడే వ్యక్తులతో పాటు ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలుంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో యువత అధికంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి బంగారు భవిష్యత్ అంధకారం చేసుకుంటున్నారన్నారు. యువత ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనందున పిల్లలపై తల్లితండ్రులు నిఘా ఉంచాలన్నారు. కమిషనరేట్ పరిధిలో బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకు అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించి చర్యలు చేపడుతున్నామన్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 4 కేసుల్లో 9 మందిని అరెస్టు చేసి రూ.42 లక్షల 68వేల లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

గీసుగొండ మండలంలో జోరుగా..

గీసుగొండ(ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలంలో క్రికెట్ బెట్టింగ్ కలకలం సృష్టిస్తోంది. బెట్టింగ్ నిర్వహిస్తున్న మండలకేంద్రానికి చెందిన గిరిధర్ అనే యువకుడిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, మరో ఇద్దరు వ్యక్తులు తప్పించుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. కాగా, ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌కు పాల్పడుతున్నవారికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇటీవల దొరికిన వ్యక్తుల ఫోన్‌లలోని ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి? అని ఆరా తీస్తున్నారు. అలా సేకరించిన సమాచారంతో అనుమానిత వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. అందులో బడా వ్యక్తులు కూడా ఉండటం కలకలం రేపుతోంది. అయితే కొన్నేళ్ల కిందట గీసుగొండకు చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి క్రికెట్ బెట్టింగ్ మోజులో పడి డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో కలకలం రేపింది.



కర్రెగుట్టలపైకి రాకండి

- కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం..
- తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు
- వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల

6

ఎండల వేళ.. పశువులు జాగ్రత్త

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
- పశుపోషణలో యజమానులు మెలకువలు పాటించాల్సిందే..

7

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- హనుమకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో ఇండోర్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ రూపొందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం హనుమకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రతీ పనిలో సాంకేతికతను అవలంభించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పోల్ టూ పోల్ సర్వే చేయించాలని సూచించారు. భవిష్యత్‌లో లైన్ వేసే పరిస్థితి ఎక్కడ ఉండదో అక్కడ అండర్ గ్రౌండ్‌లో కేబుల్ వేస్తామన్నారు. దేవునూరు, క్యాంతనపల్లి ప్రాంతాల్లో వేసే లైన్ల పనులను వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవరసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్యూర్ కాకుండా విధిగా టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు పెంచాలని, 60 శాతం కంటే లోడ్‌పెరిగే ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలన్నారు. వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో విద్యుత్ సిబ్బంది చేసే పనులను చేయకూడదని, 1912కు ఫోన్ చేసి సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, తిరుమల్‌రావు, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాలో సిబ్బంది పాత్ర కీలకం

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంలో విద్యుత్ సిబ్బంది పాత్ర కీలకమని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్, మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం), ఆర్టిజన్స్ సిబ్బందితో మంగళవారం సీఎండీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. వినియోగారులతో సత్సంబంధాలు ఉండే ది కింది స్థాయి సిబ్బందికేనని, అలాంటి సమయంలో వారికి మెరుగైన సేవలందించే అవకాశం వారికే ఉంటుందని గుర్తు చేశారు. విద్యుత్‌శా ఖలో కొత్త మార్పులు తీసుకొస్తున్నామని, ప్రతీ ఒక్క సిబ్బంది విద్యుత్ భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. రబీ సీజన్‌లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించారని, ఖరీఫ్‌లో కూడా బాగా పనిచేయాలని సూచిం చారు. విద్యుత్ భద్రతకు పెద్దపీట వేస్తున్నామని, డీఈ టెక్నికల్ అధికారు లను నోడల్ సెఫ్టీ ఆఫీసర్లుగా నియమించామన్నారు. టోల్‌ఫ్రీ సేవలు విస్తృతం చేశామని, ప్రతీ ఒక్క వినియోగదారుడు 1912 గుర్తుంచుకునేలా ప్రచారం చేయాలన్నారు. రూరల్ ప్రాంతాల్లో బ్రేక్ డౌన్ టీమ్‌లను ఏర్పా టు చేశామని, ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నియామకాలు చేపడుతామన్నారు. ఆన్‌మ్యాన్డ్ వేతనాలు పెంచామని, భద్రతలో భరోసా నిచ్చేలా కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ అశోక్‌కుమార్, సదర్‌లాల్, ఎస్ఈ మధుసూదన్, డీఈ సాంబరెడ్డి, విజేందర్‌రెడ్డి, ఏడీఈలు, హనుమకొండ సర్కిల్ ఓ అండ్ ఎం, ఆర్టిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి


బస్సును తొలగిస్తున్న పోలీసులు

ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద బస్సు బోల్తా

- డ్రైవర్‌తో సహా పలువురు ప్రయాణికులకు గాయాలు
- హనుమకొండ జిల్లా చింతగట్టు వద్ద ఘటన

హసన్‌పర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు క్యాంపు ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు ఓ ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ సహా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. కేయూ ఎస్ఐ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ లహరి ఏసీ బస్సు మంగళవారం తెల్లవారు జామున హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని కరీం నగర్ మీదుగా అదిలాబాద్ వెళ్తోంది. ఈ క్రమంలో కరీంనగర్ - హనుమకొండ జాతీయ రహదారిపై చింతగట్టు క్యాంపు ఓఆర్ఆర్ బ్రిడ్జి వద్ద లారీ యూటర్న్ తీసుకుని ఓఆర్ఆర్‌పైకి ఎక్కే క్రమంలో లహరి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా బస్సు బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న బత్తుల వెంకటేష్, గంపల శ్రీకాంత్, ఎం.డి.జాకీర్‌హుస్సేన్, వొజ్జ కోటేశ్వర్‌రావు, ఎస్‌కే. మోజీ, కళ్లెం రత్నారాజుతో పాటు ఆర్టీసీ బస్సు డ్రైవర్ మారంపల్లి సుభాష్‌చంద్ర కూడా గాయపడ్డాడు. గాయపడిన వీరిని 108 ద్వారా ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. లారీ డ్రైవర్ వినోద్ సింగ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవి కుమార్ తెలిపారు. కాగా, కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారిపై బస్సు బోల్తాపడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు నాలుగు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కేయూ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బస్సును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గార్డియన్ హాస్పిటల్ వార్షికోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని గార్డియన్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం హాస్పిటల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలత కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. 15 ఏళ్ల నుంచి దిగువ మధ్య తరగతి ప్రజలకు మల్టీస్పెషాలిటీ సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నట్లు తెలిపారు. తెలంగాణలోనే ఎక్కువ ఆర్థోపెడిక్ సర్జరీలు చేసిన ఘనత గార్డియన్ హాస్పిటల్‌కు దక్కిందన్నారు. ఇక ముందు కూడా కార్పొరేట్ వైద్య సేవలు ఇలాగే అందిస్తామని, ప్రజల సహాయ సహకారాలు కూడా అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కాళీప్రసాద్‌రావు

రాజాజీనగర్ బ్రిడ్జి నిర్మాణాలు నిలిపివేయండి

- కాంట్రాక్టర్‌ను ఆదేశించిన బల్దియా అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 52, 53 డివిజన్‌ల మధ్యలో నిర్మించిన రాజాజీనగర్ బ్రిడ్జి సమీపంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను బల్దియా అధికారులు ఆదేశించారు. నాలా నుంచి సక్రమంగా ప్రవహించాల్సిన మురుగు నీటిని అడ్డుకునే విధంగా నాలా మధ్యలో 15 పిల్లర్లు నిర్మించడం ఏమిటని ప్రశ్నిస్తూ పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. కాగా, ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి'లో 'పేదోళ్లకు ఒక లెక్క పెద్దోళ్లకు మరో లెక్క' అనే కథనం ప్రచురితం కావడంతో అధికారుల్లో చలనం వచ్చింది. స్థానిక డివిజన్ వాసులు సైతం సమస్యను పశ్చిమ ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి స్పందించి బల్దియా అధికారులను ఫోన్‌చేసి పురమాయించినట్లు అక్కడి ప్రజలు తెలిపారు. దీంతో మంగళవారం ఇంజనీరింగ్ అధికారులు హుటాహుటిన రాజాజీనగర్‌కు చేరుకున్నారు. అక్కడ నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని, ఒక్క ప్రొటెక్షన్ వాల్ పనులు మాత్రమే చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రాజాజీనగర్ బ్రిడ్జి పనులను సందర్శించిన వారిలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ రవికుమార్, డీఈ సారంగం, ఏఈ మేనకలు ఉన్నారు. కాగా, బిడ్జి పనుల్లో అవకతవకలపై కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతికి రాజాజీనగర్ హెల్పింగ్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త

వికసిత్ భారత్ పోటీల్లో ప్రతిభ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగిన వికసిత్ భారత్ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి శ్రీజా జాదవ్ సత్తాచాటారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై ఢిల్లీ పార్లమెంట్‌లో జరిగిన వ్యక్తృత్వ పోటీల్లో అనర్గళంగా మాట్లాడి దేశ స్థాయిలో గెలుపొందారు. న్యాయ నిర్ణేతలు శ్రీజా జాదవ్ ప్రతిభను గుర్తించి నెం-1గా ఎంపిక చేశారు. మంగళవారం డిల్లీలో జరిగిన పోటీల్లో పాల్గొని వచ్చిన శ్రీజా జాదవ్‌ను కేయూ మొదటి గేటు వద్ద కేయూ జాతీయ సేవ పథకం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ నేతృత్వంలో అధ్యాపకులు, విద్యార్థులు స్వాగతం పలికారు. వర్సిటీలో ర్యాలీ, ప్రదర్శనలు చేపట్టారు. శ్రీజా జాదవ్‌ను గజమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీజా జాదవ్ వర్సిటీకి రాగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందచేసి అభినందనలు తెలిపారు.


శ్రీజ జాదవ్‌కు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

ప్రహర్షకు అవార్డు

మడికొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాగపూర్‌లోని దాదాసాహెబ్ కల్మేఘ్ మెమోరియల్ డెంటల్ కళాశాల, ఆస్పత్రి ఆరో పరిశోధన అవార్డుల ప్రదానోత్సవంలో హనుమకొండకు చెందిన కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయుడు అన్నాబత్తుల వెంకన్న కుమార్తె డాక్టర్ ప్రహర్షకు పరిశోధన అవార్డు లభించింది. కళాశాల ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో పద్మశ్రీ ప్రొఫెసర్ యాదవ్ చేతుల మీదుగా ప్రహర్ష అవార్డుతో పాటు నగదు బహుమతిని అందుకున్నారు. అవార్డు రావడంపై ప్రహర్ష సంతోషంగా వ్యక్తం చేసింది.


అవార్డు స్వీకరిస్తున్న ప్రహర్ష

వేధింపులతో వివాహిత ఆత్మహత్య


హిమబిందు (ఫైల్)

ఎల్కతుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అత్త, భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కమలాపూర్ మండలం దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీరామోజు రమేష్‌చారికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణానికి చెందిన హిమబిందు (36)తో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వివాహ అనంతరం ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో బంగారం పనులు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అత్త లక్ష్మీ, భర్త రమేష్‌లు ఆమెను మానసికంగా వేధింపులకు గురి చేసే వారు. ఈ క్రమంలో వారి వేధింపులు భరించలేక మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పంచకోటి సదానందచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అక్కినపెల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం హుజురాబాద్ సివిల్

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి క్రయ విక్రయాలు చేస్తున్న యువకులను హనుమకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ, కోటగిరి రోహిత్‌లు సులభంగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్రవాహనంపై ఒడిషాలో కల్మిల గ్రామానికి వెళ్లి నాగరాజు అనే వ్యక్తి వద్ద అరకిలో గంజాయి కొనుగోలు చేశారు. తమ దగ్గర ఉన్న గంజాయిని విక్రయించేందుకు ఇద్దరు నిందితుల్లో మణికంఠ అనే వ్యక్తి సోమవారం హనుమకొండకు రాగా, పోలీసులు పక్కా సమాచారంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తన దగ్గర గంజాయి కొనుగోలు చేసిన బాలుడితో పాటు మేకల అవినాశ్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి, ఓదెల అరుణ్‌లతో పాటు వ్యాపార భాగస్వామి రోహిత్ పేర్లు వెల్లడించగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనలో ఒడిషాకు చెందిన నాగరాజుతో పాటు మణికంఠ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వడ్డెపల్లికి చెందిన తాళ్లపల్లి చిన్ను ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు.

సందడిగా జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకలను బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెన్, ఉమెన్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 20 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఇక్కడ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన బాక్సర్లు ఈ నెల 11, 12 తేదీల్లో సికింద్రాబాద్ లాలాపేటలోని నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కొమ్మాల జాతర హుండీల ఆదాయం లెక్కింపు

మిశ్రమ బంగారం 12 గ్రాములు, వెండి 4 కిలోలు

గీసుగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర హుండీల ఆదాయాన్ని మంగళవారం రెండోసారి లెక్కించారు. హుండీల ద్వారా రూ.9,16,892, వివిధ రకాల ఆర్జిత సేవలు, అర్చనల ద్వారా రూ.6,52,266 మొత్తం రూ.15,69,158 వచ్చినట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. అదేవిధంగా 4 కిలోల వెండి, 12 గ్రాము ల మిశ్రమ బంగారం హుండీలలో లభించినట్లు చెప్పారు. 13 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ పరిశీలకుడు అనిల్‌కుమార్, ఆలయ ధర్మకర్తల ట్రస్టీ చైర్మన్ శ్రీనివాసాచార్యులు అర్చకులు కాండూరి రామాచార్యులు, ఫణీం ద్ర, విష్ణు, వెంకటేశ్వర సేవాసమితి సభ్యులు పోలీసులు పాల్గొన్నారు.


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవాసమితి సభ్యులు

కర్రెగుట్టలపైకి రాకండి

- కగార్ నుంచి రక్షణ కోసం బాంబులు అమర్చాం
- తొలిసారి ప్రకటించిన మావోయిస్టులు
- వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ విడుదల

ములుగు/వాజేడు/ వెంకటాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులకు సేఫ్ జోన్‌గా భావిస్తున్న కర్రెగుట్టలపైకి సాధారణ పౌరులెవరూ రావొద్దంటూ మావోయిస్టులు హెచ్చరించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసం గుట్ట చుట్టూ బాంబులు అమర్చామని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట ఓ లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలను కలుపుకుంటూ కర్రెగుట్టలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి విస్తరించి ఉన్నాయి. దట్టమైన అడవులు ఉన్న ఈ ప్రాంతాన్ని మావోయిస్టు గెరిల్లా బేస్‌గా మార్చుకున్నారని, భద్రతా బలగాలు లక్ష్యంగా మందు పాతరలు అమర్చారని గతంలో పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. అటు భద్రాద్రి కొత్తగూడెం, ఇటు ములుగు జిల్లాను కలిపే ఈ గుట్టలు పోలీసులు, మావోయిస్టుల చర్యలు, ప్రతిచర్యలతో నిత్యం అలజడిగా మారుతుంటాయి.

పోలీసుల మాటలు నమ్మొద్దు

ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరుతో చేస్తున్న దాడుల్లో అనేక మంది పార్టీ నాయకులు, పీఎల్‌జీఏ సభ్యులతో పాటు సాధారణ ప్రజలు బూటకపు అమరులు అవుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. కగార్ దాడుల నుంచి రక్షణ పొందడానికి కర్రెగుట్టలపై బాంబులు అమర్చినట్లు తెలిపారు. బాంబులు అమర్చిన విషయం ప్రజలకు వివిధ రూపాల్లో తెలిపినట్లు, అయినప్పటికీ కొద్దిమంది ఆదివాసీలు, ఆదివాసీయేతరులకు పోలీసులు మాయమాటలు చెప్పి నవిృస్తూ, డబ్బు లు ఇస్తూ ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకొని షికారు పేరుతో కర్రెగుట్టలపైకి పంపిస్తున్నారని తెలిపారు. మావోయిస్టుల రక్షణ కోసం అమర్చిన బాంబుల బారినపడి చనిపోతున్నారని, కొంత మంది గాయపడుతున్నారని అన్నారు. పోలీసుల మాటలు నమ్మి ఇన్‌ఫార్మర్‌లుగా మారొద్దని పేర్కొన్నారు.



చర్చనీయాంశంగా మవోయిస్టుల లేఖ

ఛత్తీస్‌గఢ్‌లో నిర్బంధం ఎక్కువైన క్రమంలో తెలంగాణలోకి ప్రవేశించడానికి ఈ అడవే మావోయిస్టులకు దిక్సూచి. వారికి అడ్డుకట్ట వేసేందుకు నిఘా వేసిన పోలీసులు ప్రతిక్షణం అలర్ట్‌గా ఉంటున్నారు. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా భారీ ఎన్‌కౌంటర్లు జరుగుతుండగా పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు వదలుతున్నారు. చాలామంది లొంగుబాటను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న మావోయిస్టు లీడర్లు తెలంగాణ దండకారణ్యంలోకి వచ్చే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ చర్చనీయాంశంగా మారింది. గతనెల 23న వెంకటాపురం మండలం ఇప్పగూడానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి అనే వ్యక్తి ముత్యం ధార జలపాతం సమీపంలో అడవిలోకి వెళ్లగా ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి మరణించగా, వెంకటాపురం మండలం అంకన్నగూడానికి చెందిన నవీన్, చొక్కాల గ్రామానికి చెందిన డర్రా సునీత తీవ్రంగా గాయపడ్డారు. అయితే.. ఈ సంఘటనలను ఏనాడూ స్పందించని మావోయిస్టులు కర్రెగుట్టల చుట్టూ తాము మందుపాతరలు అమర్చామని తొలిసారి ప్రకటించారు. కగార్ పేరిట జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కోసమే బాంబులు పెట్టామని, ఈవిషయాన్ని పలు రూపాల్లో ప్రజలకు తెలియపర్చినట్లు లేఖలో పేర్కొన్నారు. పోలీసులు అమాయక గిరిజన, గిరిజనేతరులకు డబ్బు ఆశగా చూపించి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకుంటున్నారని, అటవీ జంతువుల వేట పేరుతో అడవుల్లోకి పంపించి తమ కదలికలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఈక్రమంలో తాము అమర్చిన బాంబులు పేలి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వెల్లడించారు. ప్రజలెవరూ పోలీసుల మాటలను నమ్మి మోసపోవద్దని, కర్రెగుట్టలపైకి రావొద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదని ఏడాది పాలనలోనే తేలిపోయిందని మావోయిస్టు నేత శాంత ఆ లేఖలో ప్రస్తావించారు. ఆరు గ్యారెంటీలతోపాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునఃసద్ధరణ చేస్తామని ప్రకటించి, ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, భూస్వాములు, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రజల ఆస్తులను బలవంతంగా గుంజుకుంటున్నారని విమర్శించారు.

బాంబు డిస్పోజల్‌తో కర్రెగుట్టలపై తనిఖీ

- ప్రజలను ఇన్‌ఫార్మర్లనడం సరికాదు
- ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు బాంబులు అమర్చిన కర్రెగుట్టల వద్ద భద్రతా చర్యలను పటిష్ఠం చేస్తున్నామని, బాంబు డిస్పోజల్ టీమ్‌లతో నిత్యం తనిఖీలు జరుపుతూ తొలగిస్తామని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, ఎవరికైనా బాంబుల ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈమేరకు మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోందని, ఉనికిని కాపాడుకునేందు కోసం కర్రెగుట్టల వద్ద ప్రెషర్ బాంబులు అమర్చారని తెలిపారు. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు అటవీ ఉత్పత్తుల సేకరణే జీవనాధారంగా బతుకుతున్నారని, ఈక్రమంలో బాంబులు పేలి ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. వారిని ఇన్‌ఫార్మర్లంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావో యిస్టుల చర్యలను పౌరహక్కుల సంఘాలు ఖండించాలని కోరారు.



ఎండలవేళ పశువులు జాగ్రత్త

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు ప్రమాదమే..
- పశుపోషణలో యజమానులు మెళకువలు పాటించాల్సిందే

ఖానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి, ఎండ వేడిమికి దాణ సరిగా తినక పోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుండి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరుచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విదంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.

మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభాదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువ శాతం పచ్చిగడ్డి అందించాలి. మాగుడు గడ్డి ఉంటే సంవృద్ధిగా అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్ల తాగేలా చూడాలి.

టీకాలు తప్పనిసరి

ఎండాకాలంలో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో పశువులు సులువుగా జబ్బుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గొంతు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు రాకుండా టీకాలను ఇప్పించాలి. అంతర పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల మందులను తాగించాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు..

నివారణోపాయాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. ముట్టెపై చెమట లేకపోవడం, కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. పశు వైద్యుడి సహాయంతో చికిత్స అందించాలి.

పశువులకు వెంటనే చికిత్స చేయించాలి

శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి, ఖానాపురం



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వచ్చే ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పలుమార్లు నీటితో కడగాలి. చల్లని గోనె సంచిని కప్పడం లాంటివి చేయాలి. పశువైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందించాలి. వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

కాళేశ్వరం.. మునులు, రుషుల తపోక్షేత్రం

- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ముక్తీశ్వరుడి సన్నిధి
- ఈ ఏడాది సరస్వతీ పుష్కరాల వైభవం

మహదేవపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారంగా.. బ్రహ్మ విద్యల తపోక్షేత్రంగా.. ఎందరో రుషులు, మునులు తపస్సులు చేసిన పుణ్యస్థలంగా.. ఎన్నో పాతకాలను పారదోలిన శైవ క్షేత్రంగా.. వేదకాలం నుంచి స్వచ్ఛ గోదావరి తరగలతో జన్మ తరింపజేసుకున్న పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది కాళేశ్వరం. బ్రాహ్మణ అగ్రహారాలుగా విశ్వ విఖ్యాతి గాంచిన మంత్రకూటం, చెన్నూరు, కాళేశ్వరం పుణ్యతీర్థ క్షేత్రాలు.. సంప్రదాయ షట్శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలను పఠించి భావితరాలకు అందజేసిన జాబాలి, అగస్త్యుడు, గౌతముడు నడయాడిన కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితల మధ్యలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదికి ఈ ఏడాది పుష్కరాల వైభవం సంతరించుకుంది. వేదవ్యాస మహర్షి స్కంద పురాణంలో కాశీ ఖండంలో పేర్కొన్న సమాచారం కాళేశ్వర క్షేత్రం ప్రసిద్ధిగా నిలుస్తోంది. భారతదేశ యాత్ర ప్రారంభించిన అగస్త్య మహర్షి గోదావరి జన్మస్థానమైన నాసిక్ త్రయంబకం క్షేత్రంలో స్నానమాచరించి వ్యాస ప్రతిష్ఠ సరస్వతిని దర్శించి కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో స్నానమాచారించారు. తన యాత్రకు గుర్తుగా చెన్నూరులో అగస్త్యేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ చేయించారు. నేటికీ చెన్నూరు ఆలయంలో అగస్త్యేశ్వరుడి పురాతన ఆలయంలో పూజలు కొనసాగుతున్నాయి. 400 ఏళ్లుగా అఖండ జ్యోతి దీపం వెలుగుతుండడం విశేషం. అలాంటి ఎంతో విశిష్టతలు కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని సరస్వతీ పుష్కరాల వేళ దర్శించుకుంటే ఎంతో మంచిదని పండితులు చెబుతున్నారు. వచ్చేనెలలో సరస్వతీ పుష్కరాల వేళ కాళేశ్వరం చరిత్ర గురించి ప్రత్యేక కథనం.

- సహజ కవి బమ్మెర పోతన తెలుగులో మహా భాగవతం రాయాలనే తపనతో ఏమి తోచని పరిస్థితిలో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం చేసి శ్రీకారం చుట్టినట్టు అభినవ పోతన వానమమలై వరదాచార్యులు రాసిన పోతన చరిత్రము తెలుపుతోంది. గౌతమ మహర్షి శిష్యులకు వేద పఠనం చేస్తున్న సమయంలో మంత్ర కూటం ప్రాంతంలో కరువు కాటకాలు వచ్చాయి. తపోబలంలో ఏ రోజుకారోజు పంట పండించి శిష్యులకందిస్తే అసూయపరులు కుట్రలతో మాయా ధేనువు సృష్టించిన వేళ దర్భ కర్రతో అదిలించగా గోవు మృతిచెంది గౌతమ మహర్షికి గోహత్యా పాతకం కలిగింది. నివారణ కోసం కాళేశ్వరంలో సరస్వతీ మాతను దర్శించి శివుడి కోసం తపస్సు చేసుకుని గోదావరితో కూడిన మహాసరస్వతిని దర్శించడంతో గోహత్యా దోషం నివృత్తి కలిగిందని, అందుకు సాక్ష్యమే మంత్రకూటంలో గౌతమేశ్వరాలయమని కాళేశ్వర ఖండంలోని కథనం చెబుతోంది.
- కాళేశ్వరం క్షేత్రంలో అష్టతీర్థాలు శివుని ఎనిమిది రకాల రూపాలకు సాక్ష్యాన్ని కథలున్నాయి. కొందరు దొంగలు ప్రతి రోజు కాళేశ్వరం ప్రాంతంలో దొంగతనాలు చేసి తెల్లవారుజామున పరుగెత్తి వెళ్లేవారు. రాజులు వేసిన శిక్షలు అనుభవించి బాధపడేవారు. జాబాలితో సహా పస్తర్షులు ఎదురుపడి పాప పరిహారం కోరారు. వారు గోదావరి నీరు చల్లగానే ప్రాణాలు కోల్పోయారు. రుషులకు బ్రహ్మత్యా పాతకం కలగ్గా నివారణకు కాళేశ్వరం చేరి సరస్వతి సంగమంలో స్నానం చేసి పునీతులయ్యారట. తర్వాత కొన్నాళ్లకు రుషులు కాశీకి వెళ్లగా నాటి దొంగలే మహారాజులుగా కనిపించి రుషులను గౌరవించి ఆదరించారు. కాశీలో విద్యాలయాల్లో కాళేశ్వరం అంతర్వాహిని సరస్వతి త్రివేణి సంగమం ప్రాచుర్యాన్ని ప్రచారం చేయించారు.



కాళేశ్వర ఆలయం

- త్రేతాయుగంలో శ్రీరాముడు పంచవటిలో సీతాపహరణం జరిగిన తర్వాత భరించరాని తాపంతో ప్రయాణిస్తూ కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానమాచరించి ముక్తీశ్వరుడిని పూజించారట. సుగ్రీవుని చొరవతో దేశంలోని రుషులందరిని పిలిపించి యజ్ఞయాగాలు చేయించనట్టు పురాణాలు చెబుతున్నాయి. కాళేశ్వరం నదీతీరంలో హనుమత్ తీర్థం, వీరాంజనేయస్వామి దేవాలయం, శ్రీ సీతారామ చంద్రమూర్తి ఆలయాలు అందుకు సాక్ష్యాలుగా ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు.
- ఇక శివతత్వాన్ని గ్రామీణులకు వివరించేందుకు పదకొండో శతాబ్దంలో నీలకంఠేశ్వరాద్యుడు ఎంతో కృషి చేశాడు. నారదబ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానం రాసి.. గోదావరి పరివాహక ప్రాంతం మధ్యాచార్యుల తీరంలో సోన్‌సమీపంలో నిర్మల్‌కు చెందిన నిర్మల శంకరశాస్త్రీ నీలకంఠేశ్వర వ్యాఖ్యానానికి వివరణ, విశ్లేషణ రాశారు. ఆ గ్రంథంపై ప్రముఖ తత్వవేత్త, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముందుమాట ఉపోద్ఘాతం రాయడం విశేషం. కాళేశ్వరం, చంద్రుపెల్లి ప్రాంతాల్లో వేద పాఠశాలలు నెలకొల్పి వీరభద్ర పండిత శివారాధ్యులు కాళేశ్వరం సరస్వతీ క్షేత్ర మహిమలు ఎల్లవేళలా ప్రాచుర్యం పొందేలా చేశారు. కాకతీయుల సామ్రాజ్యంలో విద్యారణ్యుల శిష్య పరమాణువు కాళేశ్వరం రాజయ్యారాధ్యులు కాళేశ్వర ఖండం గ్రంథం ముద్రణలో చొరవ చూపారు. కాకతీయులు కాళేశ్వరం త్రివేణి సంగమంలో రాజు శిరం బరువుకు సమానమైన ధనం తులా పురుషదానం చేసి తరించినట్టు గయా క్షేత్రంలో లభించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ విధంగా సరస్వతీ అంతర్వాహినిగా ఉన్న గోదావరిలో సరస్వతీ పుష్కరాల సమయంలో స్నానం చేయడం ద్వారా పిల్లలకు విద్యా విజ్ఞానం పెరుగుతుందని, అది తమ అదృష్టమని భక్తులు భావిస్తారు.

పట్టాలు పొందిన వేళ.. ఆనంద హేల



కూతురు పట్టా అందుకున్న ఆనందంలో తల్లిదండ్రులు



విద్యార్థికి ఎంబీబీఎస్ పట్టా అందజేస్తున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

- అట్టహాసంగా కేఎంసీ 61వ గ్రాడ్యుయేషన్ డే
- ఆనందంతో పులకరించిన తల్లిదండ్రుల మనసులు
- వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి : కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాలలో 61వ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. 2019 బ్యాచ్‌కు చెందిన 230మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పట్టాలు అందుకోగా.. వారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పులకించిపోయారు. ఆనందంతో వారిని ముద్దాడారు. తమ కలలు సాకారం చేశారంటూ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నందకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పట్టాలు అందజేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజ ఆరోగ్య వికాసానికి వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, యువ వైద్యులు నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని పాటించాలని సూచించారు. వైద్యుడిని దేవునితో సమానంగా కొలిచే సమాజంలో ఉన్నామన్న విషయాన్ని మరువొద్దని, ప్రజల్లో ఉన్న ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువ వైద్యులు కృషి చేయాలని కోరారు. అంకితభావమున్న వైద్యులను సమాజం ఆదర్శవంతంగా చూస్తుందని అన్నారు. ఇదే కళాశాలలో పట్టాలు పొందిన అనేక మంది వైద్యులు విశిష్టమైన సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఇలాంటి స్ఫూర్తి దాయకమైన కేఎంసీ నుంచి పట్టాలు పొందిన యువ వైద్యులు అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అలాగే ఎంత ఎత్తు ఎదిగినా తాము చదువుకున్న కళాశాల, అధ్యాపకులు మరవకూడదని హిత వు పలికారు. ఈ కార్యక్రమంలో కాళోజీ నారాయణ రావు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సంధ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డేలో మాట్లాడుతున్న కాళోజీ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి

న్యూరో సర్జన్ అవుతా..

పెన్నింటి భార్గవి



ఎంబీబీఎస్ పట్టా పొందటం ఆనందంగా ఉంది. న్యూరో సర్జన్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మా అమ్మ పద్మశ్రీ, నాన్న వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి వారు అందించిన ప్రోత్సాహంతోనే నేను వైద్య విద్య వైపు వచ్చా. వైద్య విద్య పూర్తి చేసిన మా పెదనాన్న కొడుకు కూడా నాకు స్ఫూర్తి. భవిష్యత్‌లో ఆరోగ్య వికాసానికి సేవలందిస్తా.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

పచ్చదనానికి ప్రణాళిక సిద్ధం

- హరితహారానికి మొక్కలు సన్నద్ధం
- ముమ్మరంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
- మండలంలో 3.90 లక్షల మొక్కల లక్ష్యం

నెక్కొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతరించిన అడవులకు ఊపిరి పోయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు హరితహారం తోడ్పడనుంది. త్వరలో నిర్వహించనున్న పదకొండో విడత హరితహారం విజయవంతం చేయడానికి అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడంతో అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడమే కాకుండా, వర్షాలు సమృద్ధిగా కురవడానికి, వాతావరణంలో కాలుష్య నివారణకు పచ్చదనం ఎంతో ముఖ్యమని ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం కోసం అవసరమైన మొక్కలు పెంచడానికి మట్టి, విత్తనాల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా హరితహారం కోసం నెక్కొండ మండలంలోని 39 గ్రామపంచాయతీలలో నర్సరీలను ఏర్పాటుచేసి వాటిలో మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో 3.90లక్షల మొక్కలు పెంపకం లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికలను సిద్ధంచేశామని సంబంధిత అధికారులు తెలిపారు.

6 నుంచి 8 వేల మొక్కల పెంపకం లక్ష్యం

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో 6 నుంచి 8 వేల మొక్కలను పెంచడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం నర్సరీల్లో బెడ్‌ల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీలకు విత్తనాలను ఆరు నెలల కిందటే సరఫరా చేశారు. పూల మొక్కలు, పండ్ల మొక్కలైన బొప్పాయి, జామ, నిమ్మ, సీతాఫలం, రామాఫలం, నారింజ, నేరేడుతో పాటు వృక్ష సంబంధిత మొక్కలైన గుల్‌మోహర్, వేప, కానుగ, టెంటోఫోరం, మునగ, టికోమా పెంచుతున్నారు.



మొక్కల కలుపు తీస్తున్న కూలీలు



ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపి మొక్కలు నాటుతున్న కూలీలు

పక్షుల నుంచి రక్షణకు..

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండ తీవ్రతనుంచి తట్టుకోవడానికి రోజుకు కనీసం మూడుసార్లు నీరు అందిస్తున్నారు. అలాగే మొక్కలకు ఎండ తీవ్రత నుంచి రక్షణకు గ్రీన్ పట్టాను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఎండ తీవ్రత నుంచి తట్టు కోవడంతోపాటు, పక్షుల నుంచి కూడా రక్షణ ఉంటుంది.

మల్టీలేయర్ పద్ధతిలో..

నర్సరీలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, దేవాలయాల అవరణలో, కాలువ, చెరువుల గట్లపై, రోడ్డు వెంట మల్టీలేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నర్సరీలో పెంచిన మొక్కలను పల్లె ప్రకృతి వనాలకు సరఫరా చేస్తామన్నారు.

ఉపాధి పథకం ద్వారా..

గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకం ద్వారా కూలీలకు పనులు దొరుకుతున్నాయి. నర్సరీలో పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.250 వరకూ కూలి పొందుతున్నారు.

మూడు నెలల్లో మొక్కలు సిద్ధం

వి.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, నెక్కొండ



గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను హరితహారానికి సిద్ధం చేస్తున్నారు. మూడు నెలల్లో వచ్చే జూన్ నాటికి 3.90లక్షల మొక్కలు అందిస్తాం. నర్సరీల నిర్వహణ విషయంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ

యాదగిరి, గుండ్రపల్లి నర్సరీ వాచర్



వర్షాకాలం ఆరంభంలో మండలంలోని గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నాం. ప్రతీ మొక్క ఎదిగేందుకు కవర్లలో మొక్కతో పాటు పెరుగుతున్న కలుపు తీస్తున్నాము. ప్రతీ ఇంటికి పండ్లు, పూల మొక్కలు ఆరు చొప్పున పంపిణీ చేస్తాం. మొక్కలు ఎండకు ఎండకుండా నిత్యం నీరు పడుతున్నాం.

ఆ ఉపాధ్యాయుడు.. ఆదర్శప్రాయుడు

- వృత్తిపై అంకితభావం.. సేవే ఆయన మార్గం
- తొమ్మిది 'ఉత్తమ' అవార్డులు అందుకున్న శ్రీనివాస్

పర్వతగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయన ఉపాధ్యాయుడిగా వృత్తిలోనే కాదు సమాజ సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పడమే కాదు వారి తల్లిదండ్రులతో మమేకమై ఆ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేశారు. అంతే కాదు పర్యావరణ పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం, సామాజిక సేవాభావం కలిగిన ఆయన తొమ్మిది సార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొన్నారు. ఆయనే వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన మడత కొంరయ్య, మడత ఎల్లమ్మ దంపతుల కుమారుడు మడత శ్రీనివాస్. పేదకుటుంబంలో పుట్టిన శ్రీనివాస్ పాఠశాల స్థాయి విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారు. బీకాం సీకేఎం కళాశాలలో 1983-86వరకు పూర్తి చేసి అనంతరం కాకతీయ యూనివర్సిటీలో 1986-88లో ఎంకాం పూర్తిచేసి 1988-89లో వరంగల్‌లోని బీఈడీ కళాశాలలో చదివారు. 1989లో డీఎస్సీకి ఎంపికై డిసెంబరు 1990లో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్‌లో స్పెషల్ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ 1992 వరకు పనిచేసి అనంతరం అదే ఏడాది ఆగస్టులో పెద్దకొర్పోల్ జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యారు. అక్కడ 2002 వరకు పనిచేసి అనంతరం 2006లో ఎంపీపీఎస్‌లో హెచ్ఎంగా పదోన్నతి పొందారు. అదే సంవత్సరంలో డోర్నకల్ మండలం పెరుమండ్ల సంకేసి జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయి.. 2009 జూలై వరకు పనిచేసి పర్వతగిరి మండలంలోని ఎంపీయూపీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ 2018వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటునందించారు. జూలై 2018లో అదే మండలంలోని బూర్గుమల్ల ఎంపీయూపీఎస్‌కు బదిలీ అయి హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా 15 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా, 20 ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయునిగా వివిధ పాఠశాలల్లో పనిచేసి తనదైన ముద్రను వేసుకున్న ఆయన ఈ నెలాఖరులో పదవీవిరమణ పొందబోతున్నారు.

వృత్తిలోనే కాదు.. సేవల్లోనూ అంకితభావం..

ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్న సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి అవగాహన కల్పించి మరీ పాఠశాలలను కాపాడడంలో శ్రీనివాస్ కీలక భూమిక పోషించారు. ప్రధానంగా బస్సు మార్గంలేని తండాలలో కొంత వరకు సొంత ఖర్చులు వెచ్చించి ప్రైవేటు వాహనాల ద్వారా పిల్లలను స్కూల్‌కు రప్పించారు. 35 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఏ రోజు కూడా గైర్హాజరైన దాఖలాలులేవని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అత్యవసరమైతే చట్టపరమైన సెలవుతీసుకుంటారు. అంతేకాదు.. ఏదైనా రోజు ఒక్క నిమిషం ఆలస్యమైనా.. సగం పూట సెలవు పెట్టి మరీపాఠాలు బోధించి వెళ్తారట. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అతను అందించే ఆర్థిక సహకారాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం అందరినీ ఆకట్టుకుంటుంది. ఒక్కో సందర్భంలో పాఠశాల అభివృద్ధి కోసం తన సొంత డబ్బును ఖర్చుచేయడమే కాకుండా గ్రామస్థులు, నాయకులతో మాట్లాడి నిధులు సేకరించారు. ఇక పర్యావరణ హితం కోసం కృషి చేయడంతో పాటు.. తోటి ఉపాధ్యాయులను కూడా ఆ దిశగా నడిపిస్తున్నారు. తాను పనిచేసిన పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు.

అందుకున్న అవార్డులు..

మడత శ్రీనివాస్ అందించిన సేవలకు గాను విద్యాశాఖ గుర్తించి అనేక అవార్డులు అందించింది. ఇందులో ప్రధానంగా 2001 సంవత్సరంలో నర్సంపేట డివిజన్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడును అవార్డును ప్రతిభా సేవా సంస్థ ఆధ్వర్యంలో అందుకున్నారు. 2011 సెప్టెంబరు 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ అవార్డు అందజేశారు. 2012లో పర్వతగిరి మండలంలో బెస్ట్ హెచ్ఎంగా మారీ స్వచ్ఛంద సంస్థ అవార్డు ప్రదానం చేసింది. అలాగే 2019 సెప్టెంబరులో మరోసారి జిల్లా స్థాయి అవార్డు అందుకున్న శ్రీనివాస్ 2022లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఎంఈవో నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2023 సెప్టెంబరులో కలెక్టర్ నుంచి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.



శ్రీనివాస్ (ఫైల్)



2023లో కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న శ్రీనివాస్ (ఫైల్)



ప్రస్తుతం శ్రీనివాస్ విధులు నిర్వర్తిస్తున్న బూర్గుమల్ల పాఠశాల

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ పి. కరుణాకర్‌రావులు డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలకు వినతి పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు శ్రీధర్‌కుమార్ లోథ్, పి. కరుణాకర్‌రావులు మాట్లాడారు. కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసిన తర్వాతే వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో 21ని రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ కనుకయ్య, సాధు రాజేశ్, అంజన్‌రావు, భిక్షపతి, గడ్డం కృష్ణ, ప్రసాద్, మధుకర్‌రావు, సునిత, సుజాత, సంగీత్‌కుమార్, బెన్నీ ప్రియాంక, శ్రీలత, సుచరిత పాల్, సత్యజాల, సదాశివ, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న మోదీ

▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



7వ డివిజన్ రాగన్నదర్వాజలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని మోదీ సర్కారు దెబ్బతీస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా 'జైబాపు, జైభీమ్, జైసంవిధాన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మంగళవారం హనుమకొండ 7, 8, 10 డివిజన్లలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 7వ డివిజన్ రాగన్నదర్వాజలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి యాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వారసత్వం, విలువలు కాపాడటానికి దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలను ఐక్యం చేయడంతోపాటు సామాజిక న్యాయం సందేశంతో ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, చీకటి శారద ఆనంద్, నెక్కొండ కల్పనకిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లయ్య, కుమార్, అంబేద్కర్ రాజు, అలువాల కార్తీక్, ఎం.డి.జాఫర్, బి.రామకృష్ణ, వివిధ డివిజన్ల ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్పు చేసి ఇళ్లను నిర్మించుకోవద్దు

▸ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కోరిన కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అప్పు చేసి ఇళ్లను నిర్మించుకోవద్దని కలెక్టర్ ప్రావీణ్య ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కోరారు. మంగళవారం పెంబర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు సన్న బియ్యం పంపిణీని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో మంజూరైన 83 ఇళ్లకు 10 మంది ముగ్గులు పోసుకోగా నలుగురు లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకునిర్మాణం పూర్తి చేసుకున్నట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల అకౌంట్లలో త్వరలోనే డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ప్రతీ ఇందిరమ్మ లబ్ధిదారుడు 400 ఎస్ఎఫ్‌టీ నుంచి 500 ఎస్ఎఫ్‌టీ వరకు నిర్మాణం చేసుకోవాలని, అంతకంటే ఎక్కువ నిర్మాణం చేసుకొని అప్పులపాలు కావద్దని హితవు పలికారు. ఇళ్లు మంజూరైన వారు త్వరలోనే నిర్మాణం చేసుకోవాలని, నిర్మాణం చేసుకోని వారు ఉంటే వారు లిఖిత పూర్వకంగా రాసిస్తే వారి స్థానంలో వేరేవారికి మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

అలాగే రేషన్ డీలర్లు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని కలెక్టర్ హెచ్చరించారు. కొత్త రేషన్ కార్డుదారులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ధారావత్ రవీందర్‌నాయక్, డీఈ సిద్ధార్థనాయక్, తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ నరేందర్ రాజ్, ఆర్ఐ ఫాజిల్, గ్రామ పంచాయతీ స్పెషలాఫీసర్ నాగవల్లి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోరుక పూల, తాళ్లపల్లి రమాదేవి, గోపాల్, సునీల్, సుధాకర్, కారోబార్ చాతళ్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.



పెంబర్తిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య



విద్యార్థులకు పలకలు, పరీక్ష ప్యాడ్స్ అందజేస్తున్న ఫ్రెండ్స్ బీయింగ్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ప్రతినిధులు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

మడికొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫ్రెండ్స్ బీయింగ్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ, మడికొండ ప్రతినిధులు మంగళవారం పలకలు, పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సాహాన్నందిస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న సొసైటీ ప్రతినిధులు శిరీష, భాగ్యలక్ష్మి, మహేందర్, పవన్‌లకు ప్రధానోపాధ్యాయులు రామచంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లీలారాణి, లక్ష్మి, శంశుద్దీన్, బ్రహ్మచారి, అరుణ, స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల పరిరక్షణే లక్ష్యం

ముఖాముఖి



చందుపట్ల ప్రవీణ్‌కుమార్
పశువైద్యాధికారి, వడ్డేపల్లి
హనుమకొండ

ఆంధ్రజ్యోతి: ప్రతీ రోజు ఎన్ని జంతువులు, పక్షులకు వైద్యం అందిస్తున్నారు?

పశువైద్యాధికారి: ప్రతీ రోజు 30 నుంచి 50 వరకు జంతువులు, పక్షులకు వైద్యం అందుతోంది.

ఆంధ్రజ్యోతి: ఎన్ని రకాల జంతువులు, పక్షులకు వైద్యం అందుతుంది?

పశువైద్యాధికారి: ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు, కుందేళ్లతోపాటు కోళ్లు, బాతులు, పావురాలు, రామచిలుకలు, పెద రామచిలుకలు, తాబేళ్లకు వైద్యం అందుతుంది.

ఆంధ్రజ్యోతి: వడ్డేపల్లి డిస్పెన్సరీ పరిధి ఎంత వరకు ఉంది?

పశువైద్యాధికారి: వడ్డేపల్లి డిస్పెన్సరీ పరిధి పలివేల్పుల, గోపాల్‌పూర్, సమ్మయ్యనగర్, వడ్డేపల్లి, జులైవాడ, ఫాతిమానగర్ వరకు ఉంది.

ఆంధ్రజ్యోతి: రాయితీపై రైతులకు ఏమి అందిస్తున్నారు?

పశువైద్యాధికారి: తమ డిస్పెన్సరీ పరిధిలోని రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు, పశువులకు కృత్రిమ గర్భధారణ టీకాలు, కొత్తగా ఆడ దూడను పుట్టించే పశు వీర్యకణాలు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: రైతులకు మీరు ఇచ్చే సూచనలు ఏవి?

పశువైద్యాధికారి: సీజనల్‌గా పశువులకు వివిధ రకాల వ్యాధులు సంక్రమిస్తాయి. సరైన సమయంలో పశువైద్యాధికారి సూచనలను పాటిస్తే పశువులకు రక్షణ లభిస్తుంది.

- వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి)

కామన్ మెస్ వద్ద బోరుబావి తవ్వకం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌లో నీటి అవసరాల కోసం ప్రత్యేకంగా మంగళవారం నూతన బోరుబావి తవ్వకాలను ప్రారంభించారు. పనులను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, డెవలప్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ ఎన్.వాసుదేవరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.నరేందర్, కామన్‌మెస్ జేడీ డాక్టర్ ఎల్.సూర్యనారాయణ, సూపరింటెండెంట్ డీసీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

▸ మేయర్ గుండు సుధారాణి

▸ బల్దియా కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బల్దియా సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని మేయర్ గుండు సుధారాణి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇన్‌వార్డు, కంట్రోల్ రూమ్, ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్, పెన్షన్ సెక్షన్, డెత్, బర్త్ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్‌లతో కలియతిరిగారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బల్దియా కార్యాలయంలో పార్కింగ్ చేసే ప్రైవేటు వ్యక్తుల వాహనాలను గుర్తించి సెల్లార్‌లో పార్కింగ్ చేయకుండా చూడాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా బల్దియా కార్యాలయం ఆవరణలో ఉన్న చెత్తను అక్కడి నుంచి తొలగించాలని, చాలా కాలంగా పాడైపోయిన మరుగుదొడ్లను మరమ్మతు చేయాలని తెలిపారు. ఇంకా సిబ్బంది జాబ్‌చాట్‌ను తెలుసుకుని రిజిస్టర్‌లను పరిశీలించారు. పరిపాలనా విభాగానికి రంగులు వేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డి, జేఏవో జగదీశ్వరి, సూపరింటెండెంట్ ఆనంద్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన ఎలక్ట్రికల్ సిబ్బంది

బల్దియా ఔట్‌సోర్సింగ్ ఎలక్ట్రికల్ సిబ్బంది మంగళవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో గుండు సుధారాణిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మేయర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ సిబ్బంది మాట్లాడుతూ.. బల్దియా పరిధిలో చాలా కాలంగా తక్కువ జీతంలో పని చేస్తున్నామని, జీతాలు పెంచాలని మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. తమ న్యాయమైన కోరికను నెరవేరుస్తూ వేతనాలు పెంచడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు. మేయర్‌ను కలిసిన వారిలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.



బల్దియా డెత్, బర్త్ సెక్షన్ సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్

రైల్వే సంఘ్ లోకో రన్నింగ్ కాజీపేట శాఖ నూతన కార్యవర్గం

కాజీపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కాజీపేట లోకో రన్నింగ్ శాఖ నూతన చైర్మన్‌గా పాక రాజ్‌కుమార్, కార్యదర్శిగా కె.రవి, కోశాధికారిగా జి.లక్ష్మీనారాయణ ఎన్నికైనట్టు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య మంగళవారం తెలిపారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు బాధ్యతగా పనిచేస్తామని నూతన చైర్మన్ రాజ్ కుమార్ తెలిపారు.



రాజుకుమార్, రవి, లక్ష్మీనారాయణ

సురక్షిత ప్రయాణం కోసం కృషి చేయాలి



ఆర్టీసీ కార్మికులకు ప్రగతిచక్ర అవార్డులు అందజేస్తున్న ఆర్ఎం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికులు సురక్షిత ప్రయాణం కోసం కృషి చేయాలని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను అన్నారు. మంగళవారం వరంగల్ -1 డిపోలో విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులను ఆర్ఎం డి.విజయభాను అందజేసి ప్రశంసా పత్రాలను అందించి ఘనంగా సత్కరించారు. డిప్యూటీ ఆర్ఎం భాను కిరణ్, మహేష్, డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాల నిర్మాణ పనులను అడ్డుకున్న అధికారులు



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ బాధ్యులు

కాజీపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ వెంకటలక్ష్మీ కూరగాయల మార్కెట్ ఆవరణలో గోశాల నిర్మాణ పనులను మునిసిపల్ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల మార్కెట్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గోశాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గోశాలను నిర్మించడం సరికాదంటూ స్థానిక కార్పొరేటర్ల ఫిర్యాదు మేరకు ఏసీపీ రజిత, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణలు తమ సిబ్బందితో వచ్చి పనులు వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. పనులు ఆపకుంటే నిర్మాణాలు కూల్చివేస్తామని సిబ్బంది చెప్పారు. మార్కెట్ స్థలంలో గోశాల నిర్మించడం తగదని అధికారులు, ఎట్టి పరిస్థితుల్లో పనులు ఆపేది లేదని మార్కెట్ కమిటీ సభ్యులు చెప్పడంతో మాటల యుద్ధం జరిగింది. కమిటీ సభ్యులు సైతం వెనక్కి తగ్గకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. చేసేది ఏమీలేకపోవడంతో అధికారులు వెనక్కితిరిగి వెళ్లిపోయారు. ఆందోళనలో బీజేపీ సీనియర్ నాయకుడు నార్లగిరి రామలింగం, భిక్షపతి, ఏసు, కొమురయ్య, కలమ్మ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో శ్మశానవాటిక

- మడికొండలో కనీస సౌకర్యాలు మృగ్యం
- లైటింగ్ లేక సెల్‌ఫోన్ వెలుతురులో అంతిమ సంస్కారాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మడికొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మడికొండ జాతీయ రహదారి చౌరస్తా సమీపంలో మెట్టుగుట్ట దిగువన హిందూ శ్మశాన వాటికలో సమస్యలు తాండవిస్తున్నాయి. స్నానగదులు, మరుగుదొడ్లు, లైటింగ్ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తా చెదారంతో విషపురుగులకు స్థావరంగా మారడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సుమారు 30 వేల మంది జనాభా కలిగిన గ్రామంలో మూడు, నాలుగు సామాజిక వర్గాల వారికి ప్రత్యేకంగా శ్మశానవాటికలు ఉండగా అరవై శాతం మంది ప్రజలందరికీ ఒకటే శ్మశాన వాటిక ఉంది. అందులో రెండే బర్నింగ్ ప్లాట్‌ఫామ్స్ ఉన్నాయి. అందులోని గ్రిల్స్ కూడా దొంగలపాలయ్యాయి. ఒకే రోజు ముగ్గురు నలుగురు వ్యక్తులు చనిపోతే ఇద్దరిని మినహా మిగతా వారిని నేలపైనే దహనం చేయాల్సి వస్తోందని, చనిపోయిన వారి నోట్లో బంగారం పెడతారని మృతదేహాలు కాలిన తర్వాత అస్థికలతో సహా బూడిదను సైతం కొందరు వ్యక్తులు ఎత్తుకు పోతున్నారని ప్రజలు వాపోతున్నరు.

లైటింగ్, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

శ్మశానవాటికలో లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో చీకటి పడిందంటే దహన సంస్కారాలు చేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుతురులో అంత్యక్రియలు చేస్తూ ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు, స్నాన గదులు లేకపోవడంతో గంటల తరబడి మూత్ర విసర్జన ఆపుకుంటూ మహిళల బాధ వర్ణనాతీతం.



మెట్టుగుట్ట వద్ద గల హిందూ శ్మశానవాటికకు గేటు లేక లోపల బండరాళ్లను వేసిన దృశ్యం



శ్మశానవాటికలో చెత్తాచెదారం

విష పురుగులకు స్థావరంగా..

చెత్త, చెదారంతో నిండిపోయి మినీ డంపింగ్ యార్డును తలపిస్తోంది. గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులకు స్థావరంగా మారడంతో రాత్రి అంత్యక్రియల వేళ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అసలే చిన్న స్థలం శ్మశాన వాటిక ఉండగా అదే స్థలంలో ఓవైపు ప్రహరీ కూలగొట్టి మరీ లోపలికి వచ్చి కొందరు వ్యక్తులు బండ రాళ్ల కుప్పలు పోస్తున్నారు. మరణించిన వారి అస్థికలను, చిల్లర నాణాలను కుండలో వేసి గుడ్డతో చెట్టు కొమ్మకు కడితే చిల్లర నాణాల కోసం ఆకతాయిలు కుండలను పగులగొట్టి అస్థికలను పడేయడంతో తమవారి అస్థికలను గంగా నదిలో కలపలేకపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులు శ్మశానవాటికలో మద్యం సీసాలు పగులగొడుతుండడంతో ఉదయం సీస పెంకులు కాళ్లకు గుచ్చుకొని ప్రజలు గాయాలపాలవుతున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలి

ప్రజాప్రతినిదులు చొరవ చూపి ప్రత్యేక నిదులు మంజూరు చేసి అధునాతన సౌకర్యాలు కల్పించి స్వర్గధామంలా తీర్చి దిద్దాలని స్థానికులు కోరుతున్నారు. నగర పాలకసంస్థ అధికారులు కనీసం 10 రోజులకోసారైనా శ్మశానవాటికలో గ్యాంగ్ వర్క్ పెట్టించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అలాగే శ్మశానవాటికను మెయింటెన్ చేయడానికి నగరపాలక సంస్థ ఒక మనిషి(కాటికాపరి)ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి

తొట్ట రాజుయాదవ్, మాజీ కార్పొరేటర్, మడికొండ



హిందూ శ్మశానవాటికలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2021-22లో పట్టణ ప్రగతిలో భాగంగా హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ.42లక్షలు నిదులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. బిల్లులు రావడంలేదని కాంట్రాక్టర్ ఎవరూ ముందుకు రాకపోవడం వల్ల పనులు జరగలేదు. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి ప్రత్యేక నిధులు మంజూరు చేసి శ్మశాన వాటికను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలి. మునిసిపల్ అధికారులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.

తెలుగులో పుల్లా కుమారస్వామికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు పుల్లా కుమారస్వామి డాక్టరేట్ ప్రకటించినట్లు పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'తెలంగాణ దళిత నవలలు అధ్యయనం 2006-2016' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ లభించింది. కమలాపూర్ అంబేద్కర్ నగర్‌కు చెందినపుల్లా కుమారస్వామి కేయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. అలాగే 2016లో ఎంఫిల్ సాధించారు. జాతీయ సదస్సుల్లో పాల్గొని 10 పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన పుల్లా కుమారస్వామిని పలువురు అభినందించారు.

శిలాఫలకం వేశారు.. సీసీ రోడ్డు మరిచారు..

హసన్‌పర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతంపేటలో అధిక శాతం రైతులు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. గతేడాది ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సీసీ రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కానీ, సీసీరోడ్డు నిర్మాణ పనులు ఇప్పటి వరకు ప్రారంభించలేదు. అన్నదాతలను ఆదుకుంటామని చెబుతున్న పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. గ్రామంలో ఇతర ప్రాంతాల్లో సీసీ రోడ్లు పూర్తి చేస్తున్నారని, అనవసరమైన చోట్ల సీసీరోడ్లకు ప్రాధాన్యతనిస్తూ అవసరమున్న చోట విస్మరించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీరోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.



గతేడాది ప్రారంభించి వదిలేసిన శిలాఫలకం

వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

▸ కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ అభివృద్ధిలో ఉద్యోగులందరూ భాగస్వాములు కావాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ముస్లిం, మైనారిటీ ఉద్యోగుల సంఘం నేతృత్వంలో ఈద్ మిలాప్‌ను పురస్కరించుకుని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆసీం ఇక్బాల్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఖనీజ్ పాతిమా, హబీబుద్దీన్, ఎన్టీవోస్ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

17న మహిళా కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఈనెల 17న సుబేదారిలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మశ్రీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరిపాలన భవనంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్‌ను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, డాక్టర్ కె.కవిత, డాక్టర్ ఎ.రవీందర్, టి.అన్నపూర్ణ, నస్రీన్, సౌమిత, సాహితీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

వేసవిలో కమ్మని పెరుగు

ఎండాకాలంలో పెరుగు తొందరగా పులుపు ఎక్కుతూ ఉంటుంది. ఈ పుల్లటి పెరుగు ఎవరికీ తినాలనిపించదు. ఇలా కాకుండా కొన్ని చిట్కాలతో వేసవిలో కూడా పెరుగు కమ్మగా ఉండేటట్లు చేయవచ్చు...

- చాలామంది బజారు నుంచి పాలు తెచ్చి వెంటనే ఫ్రిజ్‌లో పెట్టేస్తూ ఉంటారు. తరవాత ఎప్పటికో వాటిని కాచి తోడు పెడతారు. అలా కాకుండా తాజా పాలను తెచ్చిన వెంటనే బాగా మరిగించి తరవాత చల్లార్చి తోడు పెట్టాలి. ఇలా తయారైన పెరుగు ఎక్కువసేపు తాజాగా ఉంటుంది. పాలను తోడు పెట్టడానికి పుల్లటి పెరుగు కాకుండా కమ్మటి పెరుగునే వాడాలి.
- పాలు బాగా వేడిగా ఉన్నప్పుడు తోడు పెట్టకూడదు. అలాగే పాలు పూర్తిగా చల్లారినా కూడా పెరుగు సరిగా తోడు కోదు. గోరువెచ్చని పాలలో కొద్దిగా పెరుగు వేసి నెమ్మదిగా కలపాలి.
- మట్టి పాత్ర లేదా సిరామిక్ పాత్రలో పాలు పోసి తోడుపెడితే పెరుగు గట్టిగా కమ్మగా తయారవుతుంది.
- పాలను తోడు పెట్టే ముందు అందులో ఒక చెంచా పంచదార కలిపితే పెరుగు త్వరగా పులుపు ఎక్కకుండా ఉంటుంది.
- ఒక చిన్న గిన్నెలో రెండు చెంచాల పాలు తీసుకొని అందులో అర చెంచా కమ్మని పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తోడు పెట్టాలనుకుంటున్న పాలలో వేసి కలిపి మూతపెట్టాలి. ఇలా చేయడం వల్ల కమ్మని గడ్డ పెరుగు తయారవుతుంది. ఇది త్వరగా పులుపు ఎక్కదు.
- ఒక వెడల్పాటి గిన్నెలో సగం వరకు నీళ్లు పోయాలి. ఇందులో పాలు తోడు పెట్టిన గిన్నెను ఉంచితే ఆరు గంటల్లో కమ్మని పెరుగు తయారవుతుంది. ఎండాకాలంలో ఈ పద్ధతిని పాటిస్తే పెరుగు ఎక్కువసేపు తాజాగా ఉంటుంది.
- పాలను రాత్రిపూట తోడుపెడితే తెల్లారేసరికి తోడుకుని పెరుగు తయారవుతుంది. దీన్ని వెంటనే ఫ్రిజ్‌లో పెడితే రోజంతా తాజాగా ఉంటుంది.



విభిన్నం

ఈ భార్గవి స్మార్ట్ టీచర్



హెల్మెట్ పెట్టుకోకపోతే బండి ముందుకు కదలనంటుంది. మద్యం సేవిస్తే వాహనంలోని సెన్సర్ పసిగట్టేస్తుంది. పొడి చెత్త డబ్బాలో తడి చెత్త వేస్తే అప్రమత్తం చేస్తుంది. ఇవి ఏ శాస్త్రవేత్తలో కనుగొన్నవి కావు... బడా సంస్థల ఆర్ అండ్ డీ విభాగం సృష్టి అంతకన్నా కాదు... ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలి అద్భుత ఆవిష్కరణలు. ఆ టీచరమ్మ పేరు.. విజయభార్గవి. శ్రీసత్యసాయి జిల్లా రేకులకుంట ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్న ఆమె తన ఆవిష్కరణల గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

"సరిగ్గా ఐదేళ్ల కిందట... మావారు జయప్రకాశ్ బైక్ మీద ప్రయాణిస్తుండగా కింద పడ్డారు. బాగా గాయాలయ్యాయి. ఆ సమయంలో ఆయన హెల్మెట్ ధరించలేదు. ఇది నన్ను ఎంతో ఆందోళనకు గురి చేసింది. ఆలోచనల్లోకి నెట్టింది. రోజూ ఎక్కడో ఒకచోట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా హెల్మెట్ పెట్టుకోకపోవడంవల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. మావారి ఘటన తరువాత ఇలాంటివెన్నో ఉదంతాలు ఒక్కసారి నా కళ్ల ముందు తిరిగాయి. అలాగే మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి గురైతే జరిగే నష్టం అంతాఇంతా కాదు. వీటివల్ల వాహనం నడిపేవారికే కాదు... ఎదుటివారికి కూడా ప్రమాదమే. మరి దీనికి పరిష్కారం ఏంటి? ఆలోచిస్తుంటే తట్టిందే స్మార్ట్ హెల్మెట్. కొద్ది రోజుల్లోనే నా ఆలోచనకు రూపం ఇచ్చాను. అది నాలో ఎనలేని స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపింది. ఆ తరువాత వీధుల్లో చెత్త పేరుకుపోకుండా చూసేలా స్మార్ట్ డస్ట్‌బిన్ ఒకటి తయారు చేశాను. దీనికి కూడా మంచి స్పందన వచ్చింది.

పాఠాలు చెబుతూనే...

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో మా నివాసం. మావారు కూడా ఉపాధ్యాయుడే. ప్రస్తుతం నేను మడకశిర మండలం రేకులకుంట ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్నాను. ఒక పక్క పిల్లలకు పాఠాలు చెబుతూనే మరోవైపు వినూత్న ప్రయోగాలు చేస్తుంటాను. నిత్యవిద్యార్థినిలా ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. సాంకేతిక పరిజ్ఞానంతో మన రోజువారీ జీవితానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలనేది నా తపన. దాని కోసం వివిధ రకాల పరికరాలను రూపొందించి, పలు సైన్స్ ఫెయిర్స్‌లో ప్రదర్శిస్తుంటాను. అలా నా ఆవిష్కరణలకు బహుమతులు కూడా అందుకున్నాను. బోధనతో పాటు ప్రయోగాలు కూడా నా దైనందిన జీవితంలో ఒక భాగం అయ్యాయి.

హెల్మెట్ ధరిస్తే...

సాధారణ హెల్మెట్‌కు కొన్ని పరికరాలు అమర్చి స్మార్ట్ హెల్మెట్ తయారు చేశాను. తొలుత ప్రత్యేక సెన్సర్లతో ఓ డివైజ్‌ను రూపొందించాను. దాన్ని హెల్మెట్‌కు అమర్చాను. దీనిని మోటార్ సైకిల్ స్టార్టర్‌కు అనుసంధానం చేశాను. దీనివల్ల హెల్మెట్ ధరిస్తేనే వాహనం స్టార్ట్ అవుతుంది. ఇక హెల్మెట్‌లో ఉండే సెన్సర్... మద్యం వాసనను కూడా పసిగడుతుంది. మద్యం సేవించి వాహనం నడపాలని ప్రయత్నిస్తే అది ఆగిపోతుంది. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తీసినా వాహనం ఆగిపోతుంది. స్మార్ట్ హెల్మెట్ ధరించి వాహనం నడిపే సమయంలో ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులతో సహా ఎంపిక చేసుకున్న మొబైల్ నంబర్లకు వెంటనే మెసేజ్ వెళుతుంది. ఏ ప్రాంతంలో, ఏ సమయంలో ప్రమాదం జరిగిందో కూడా సమాచారం చేరవేస్తుంది. జీపీఆర్ఎస్ ద్వారా 108 అంబులెన్స్‌కూ సమాచారం పంపుతుంది. కేవలం రెండు వేల రూపాయల ఖర్చుతో ఈ హెల్మెట్‌ను తయారు చేశాను.

చెత్తకు ఆధార్ స్కాన్...

రోడ్ల పక్కన ఉండే డస్ట్‌బిన్‌లను కూడా 'స్మార్ట్'గా మార్చే ప్రయత్నం చేశాను. వీధుల్లో కుటుంబ యజమానుల ఆధార్ స్కాన్ అయ్యేలా డస్ట్‌బిన్‌లను రూపొందించాను. ఎవరైనా చెత్తను తీసుకెళ్లి డస్ట్‌బిన్‌లో వేస్తే, వెంటనే ఆ మెసేజ్ మునిసిపాలిటీ లేదా పంచాయతీకి చేరుతుంది. పొడి చెత్త స్థానంలో తడిచెత్త వేస్తే వెంటనే అలర్ట్ మెసేజ్ కూడా వస్తుంది. డస్ట్‌బిన్ నిండినా, చెత్త కుళ్లిపోయినా సంబంధిత మునిసిపాలిటీ లేదా పంచాయతీకి సమాచారం చేరుతుంది. దీంతో పాటు ఎవరెవరు ఎన్నిసార్లు కుండీలో చెత్త వేశారనేది కూడా తెలుస్తుంది. ఈ పరికరం ద్వారా చెత్తను డస్ట్‌బిన్‌లో వేయనివారిని కూడా గుర్తించవచ్చు. తద్వారా వీధుల్లో చెత్త పడేయకుండా కట్టడి చేయవచ్చు.

పురస్కారాలు... ప్రశంసలు...

నా ఆవిష్కరణలకు మంచి గుర్తింపు లభించినందుకు సంతోషంగా ఉంది. మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ నుంచి అవార్డు అందుకున్నాను. గతంలో హైదరాబాద్‌కు చెందిన 'విజ్ఞానదర్శిని' సంస్థ ఉమెన్స్ ఫెస్టివల్ పురస్కారం ఇచ్చింది. 2023లో స్మార్ట్ హెల్మెట్ ఆలోచనకు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థాయి బహుమతి పొందాను. పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, కాలుష్య నియంత్రణ, అనారోగ్య సమస్యలకు పరిష్కారం, పారిశ్రామిక వ్యర్థాలు తగ్గించడం, రోడ్డు ప్రమాదాల నివారణ, ఆహార భద్రత, విద్యుత్ తదితర వాటిలో నూతన ఆవిష్కరణలు చేసినందుకు పలు అవార్డులు, ప్రశంసలు అందుకున్నాను. నిత్య జీవితంలో జన జీవితానికి ఉపయోగపడే మరిన్ని పరికరాలు రూపొందించాలనేది నా ఆకాంక్ష. దాని కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటాను."

• **బాలకృష్ణ**, హిందూపురం

సహకారం అందించాలి...



హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. దీనివల్ల కుటుంబాలు దిక్కులేనివైపోతాయి. ఎక్కడబడితే అక్కడ చెత్తవేస్తే పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతాయి. ప్రజారోగ్యం దెబ్బతింటుంది. ఇలాంటి సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొనే నేను ఆవిష్కరణల దిశగా అడుగులు వేశాను. దీనికి ప్రభుత్వాల సహకారం తప్పనిసరి. ముఖ్యంగా స్మార్ట్ హెల్మెట్, ఆధార్ ఆధారిత డస్ట్‌బిన్‌కు పేటెంట్ రైట్స్ ఇచ్చి, సమాజానికి ఉపయోగపడేలా వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

ఇంట్లో దుమ్ము చేరితే...

ఇంట్లో ఉపకరణాల మీద, గది మూలల్లో దుమ్ము చేరుతూ ఉంటుంది. ఇలా ఇంట్లో దుమ్ము పేరుకోకుండా ఉండేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాల గురించి తెలుసుకుందాం.



- సాధారణంగా ఇంట్లో చీపురుతో ఊడుస్తూ ఉంటాం. దీనివల్ల కొన్ని దుమ్ము కణాలు పైకి లేచి పక్కనే ఉన్న వస్తువులపై పడుతుంటాయి. నేలమీద కూడా కొన్ని కణాలు అలాగే మిగిలి ఉంటాయి. చీపురుతో కాకుండా వ్యాక్యూమ్ క్లీనర్‌తో ఇంటిని శుభ్రం చేస్తే దుమ్ము పూర్తిగా తొలగిపోతుంది. అలాగే వారానికి ఒకసారి ఇంటిని తడిగుడ్డతో తుడవాలి.
- చెప్పులు, షూస్ లాంటివి ఎక్కువగా దుమ్మును ఇంట్లోకి తీసుకొస్తాయి. వీటిని ఇంటి బయటే వదలడం వల్ల సగం సమస్య తీరుతుంది. మూడు రోజులకు ఒకసారి డోర్‌మ్యాట్, కార్పెట్ లాంటివాటిని వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి.
- కొంతమంది ఇంట్లో కూడా చెప్పులు వేసుకుని నడుస్తూ ఉంటారు. ఈ చెప్పులను బయటికి వేసుకెళ్లకుండా ఇంట్లోనే వాడుకుంటూ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి.
- ఇంట్లో దుప్పట్లు, సోఫా కవర్లు, కర్టెన్ల మీద ఎక్కువగా దుమ్ము పడుతూ ఉంటుంది. వీటిని తీసి గట్టిగా దులిపి మళ్లీ వేస్తూ ఉంటారు. ఇలా దులిపినప్పుడు దుమ్ము కణాలు లేచి ఇల్లంతా వ్యాపిస్తాయి. కాబట్టి వీటిని దులపకుండా వారానికి ఒకసారి సబ్బు నీళ్లలో నానబెట్టి ఉతకడం మంచిది.
- ఇంటి తలుపులు, వెంటిలేటర్లు, కిటికీల మూలలు, వాటి ఊచల మీద కూడా విపరీతంగా దుమ్ము నిలుస్తూ ఉంటుంది. డెటాల్ లేదా సబ్బు నీళ్లలో ముంచిన గుడ్డతో వీటిని తరచూ తుడుస్తుంటే ఆ ప్రదేశాల్లో దుమ్ము పేరుకోదు.
- ఇంట్లో ఉండే అరల్లో ఎక్కువగా దుమ్ము, ధూళి చేరుతూ ఉంటాయి. పదిహేను రోజులకు ఓసారి క్లీనింగ్ డస్టర్ సహాయంతో వీటిని శుభ్రం చేస్తే సరిపోతుంది.

ఫ్యాషన్

గులాబీ మెరుపుల్లో...

గులాబీ రంగులో మెరిసే 'రోజ్ గోల్డ్' ఆభరణాలు సర్వత్రా ఆదరణ పొందుతున్నాయి. నేటి యువతులను విపరీతంగా ఆకట్టుకుంటూ తాజా ఫ్యాషన్‌లో భాగంగా మారిన రోజ్ గోల్డ్ ఆభరణాలను పరిశీలిద్దామా?



రోజ్ గోల్డ్ అంటే?

కలిపే మిశ్రమ లోహాల పరిమాణాన్ని బట్టి బంగారం రంగు మారుతూ ఉంటుంది. రోజ్ గోల్డ్ కోసం బంగారంలో ఎక్కువ శాతం రాగి లోహాన్నీ, కొద్ది పరిమాణంలో వెండినీ కలుపుతారు. ఎంత ఎక్కువ రాగి కలిపితే బంగారం అంత ఎరుపు రంగు సంతరించుకుంటుంది. కాబట్టి బంగారం గులాబీ వర్ణం సంతరించుకునేంత మేరకు రాగిని కలిపి, రోజ్ గోల్డ్ తయారు చేస్తారు. 18 క్యారెట్ల బంగారంలో 75% బంగారం, 21% రాగి, 4% వెండి ఉంటుంది.



ఆభరణాలు ఇలా...

ఆభరణాల్లో రోజ్ గోల్డ్‌కు చోటు కల్పించాలంటే ప్రస్తుతం మన దగ్గరున్న వెండి, బంగారు ఆభరణాలతో మ్యాచ్ అయ్యే రోజ్ గోల్డ్ ఆభరణాలు కొనాలి. మిగతా లోహాలతో తయారైన ఆభరణాలతో కలిసిపోవటం రోజ్ గోల్డ్‌కి ఉన్న ప్రత్యేకత. అయితే ఎలాంటి ఆభరణాలతో మ్యాచ్ చేయాలో అవగాహన లేదా? అయితే...ఈ చిట్కాలు పాటించండి.





- రోజ్ గోల్డ్ స్టడ్ ఇయర్ రింగ్స్‌ను భారీ సైజు బంగారు జూకాలతో కలిపి ధరించవచ్చు.
- రెండు బంగారు గాజులు లేదా వెండి గాజుల మధ్య రోజ్ గోల్డ్‌తో తయారైన గాజు ఇట్టే ఇమిడిపోతుంది. స్టైల్‌తోపాటు, కొత్త పోకడకు నాంది అవుతుంది
- వైట్ గోల్డ్ అయిన ప్లాటినంకు కూడా ఆదరణ ఎక్కువే! కాబట్టి రోజ్ గోల్డ్, ప్లాటినం కలిపి లేయర్డ్ జ్యువెలరీగా వాడొచ్చు.
- బంగారంతో పోలిస్తే రోజ్ గోల్డ్ ఖరీదు తక్కువ కాబట్టి భారీ ఆభరణాలు ధరించాల్సిన సందర్భంలో రోజ్ జ్యువెలరీని ఎంచుకోవచ్చు.
- చెవికి పెద్ద పెద్ద రింగులు లేటెస్ట్ ఫ్యాషన్. రోజ్ గోల్డ్‌తో తయారైన సాదా రింగులు కాకుండా, జడలా అల్లినట్టుండే బ్రెయిడెడ్ రింగ్స్ ఎంచుకుంటే వినూత్నంగా కనిపిస్తారు.
- నగలే కాదు రోజ్ గోల్డ్‌తో తయారైన చేతి గడియారాలూ దొరుకుతాయి. వాచీ ధరించే అలవాటున్న వాళ్లు రోజ్ గోల్డ్ గడియారం కొనుక్కుంటే వేడుకల్లో దాన్నొక ఆభరణంగా ధరించవచ్చు.



మామిడి- బెల్లం షర్బత్

వేసవి వచ్చిందంటే మామిడి కాయలు విరివిగా దొరుకుతాయి. వీటితో షర్బత్ చేసుకుంటే దాహం తీరటంతో పాటుగా తాగటానికి రుచిగా కూడా ఉంటుంది. అయితే చాలా మంది ఈ షర్బత్‌లో పంచదార వేస్తారు. దీని వల్ల బ్లడ్ షుగర్ విలువలు పెరుగుతాయి. అలా పెరగకుండా పంచదార వేయని షర్బత్ ఎలా చేయాలో తెలుసుకుందాం.

తయారీ విధానం

- ప్రెషర్ కుక్కర్‌లో మూడు పుల్లటి మామిడి కాయలను వేసి ఉడకపెట్టండి.
- మామిడికాయలు ఉడికిన తర్వాత తొక్క తీసి గుజ్జును ఒక గిన్నెలోకి తీసుకోండి.
- ఈ గుజ్జులో అర గ్లాసు బెల్లం పొడి, రుచికి తగినట్లుగా నల్ల ఉప్పు, కొద్దిగా జీలకర్ర పొడి వేయండి.
- ఈ మిశ్రమంలో తగినన్ని ఐసు ముక్కలు, మూడు చిన్న గ్లాసుల నీళ్లు పోసి మిక్సీలో బాగా తిప్పండి. షర్బత్ రెడీ.



అభిరుచి

హలో అమ్మా!

పెళ్లయ్యాక అమ్మ చేతి రుచులకు దూరమైన ఓ అమ్మాయి... తల్లి సూచనలతో సంప్రదాయ వంటకాల తయారీలో నిష్ణాతురాలయ్యారు. ఫుడ్ కంటెంట్ క్రియేటర్‌గా సోషల్ మీడియాలో దూసుకెళ్తున్నారు. ఏడాదిన్నర కాలంలో మూడున్నర లక్షలకు పైగా ఫాలోవర్స్‌ను సంపాదించుకున్న అర్పిత దాస్ ప్రయాణం గురించి, ప్రయోగాల గురించి ఆమె మాటల్లోనే...



"కొత్త కాపురం మొదలుపెట్టాక... ప్రతి అమ్మాయి మిస్ అయ్యే వాటిలో ప్రధానమైనది... అమ్మ చేతి వంట. ఇల్లాలుగా వంటిల్లు పూర్తిగా తన చేతుల్లోకి వచ్చేస్తుంది. వంటలో ఎంతో కొంత అనుభవం ఉన్నా... 'ఏది చెయ్యాలి? ఎలా చెయ్యాలి?' అనేది ఎప్పుడూ ప్రశ్నే. అందుకే 'హలో అమ్మా!' అంటూ తల్లికి కాల్ చేసి, ఇంటి వంటకాల తయారీ గురించి సందేహాలను అడగడం దాదాపు రోజూ జరుగుతూనే ఉంటుంది. అందుకు నేను మినహాయింపు కాదు.

అందుకే ధైర్యం చేశాను...

మాది పశ్చిమబెంగాల్‌లోని హౌరాకు చెందిన జమీందారీ కుటుంబం. సంస్కృతి, సంప్రదాయాల మధ్య పెరిగాను. సృజనాత్మకంగా ఏదో చెయ్యాలనే తాపత్రయం నాకు చిన్నప్పటి నుంచీ ఉండేది. 'బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్' (బీఎఫ్ఎ) పూర్తి చేశాను. పెయింటింగ్స్ వేసేదాన్ని, డిజైనింగ్ చేసేదాన్ని, కథలు రాసేదాన్ని. గొప్ప జీవిత లక్ష్యాలేవీ లేకుండా... కుటుంబ సభ్యులతో, స్నేహితులతో రోజుల్ని సరదాగా గడిపేసేదాన్ని. అలాంటి నేను.... సింగపూర్‌లో డాక్టర్‌గా పని చేస్తున్న సౌమిక్‌తో పెళ్ళయ్యాక... పూర్తిగా భిన్నమైన ప్రపంచంలోకి అడుగు పెట్టాను. మిగిలినవన్నీ బాగానే ఉన్నా... నా పుట్టింటి రుచులకు దూరమయ్యాననే అసంతృప్తి ఉండేది. హౌరాలోని మా ఇంట్లో ఎంతోమంది పనివారు ఉండేవారు. కానీ వంట మాత్రం అమ్మే చేసేది. అమ్మ ఏది చేసినా బ్రహ్మాండంగా ఉండేది. ఏది అడిగినా విసుక్కోకుండా చేసి పెట్టేది. సింగపూర్‌లో అది ఎలా సాధ్యమవుతుంది? రోజూ అమ్మకు వీడియో కాల్ చేసి, ఆమె చెప్పిన వంట పద్ధతులు అనుసరించేదాన్ని. ఆ వంటకాలు నా భర్తకు కూడా బాగా నచ్చాయి. తీరిక సమయాల్లో కొన్ని యూట్యూబ్ వీడియోలు చూస్తున్నప్పుడు... సంప్రదాయికమైన బెంగాలీ వంటకాల గురించి సాధికారికంగా వివరించేవి పెద్దగా కనిపించలేదు. అమ్మ చెప్పే రెసిపీలతో వీడియోలు చేయాలనిపించింది. అంతకుముందు నా పర్యాటక అనుభవాలను, పెయింటింగ్స్ ను సోషల్ మీడియాలో పంచుకున్నాను. వీడియో ఎడిటింగ్ తెలుసు. కాబట్టి ధైర్యం చేశాను. అందరూ చేసుకోగలిగే పద్ధతిలో ఫిష్ ఫ్రై చేసి... ఫేస్‌బుక్‌లో ఉంచాను. నా కుటుంబం, పరిచయస్తులు మాత్రమే దాన్ని చూస్తారనుకున్నాను. కానీ రాత్రికి రాత్రి అది వైరల్ అయింది. కొన్ని గంటల్లోనే లక్షల్లో వ్యూస్ వచ్చాయి. ఇది నేను ఊహించలేదు. అప్పుడే ఫుడ్ కంటెంట్ క్రియేటర్‌గా మారాలనే ఆలోచన వచ్చింది. 'ఇక తగ్గేదిలే' అనుకున్నా.

మొక్కుబడిగా కాకుండా...

అప్పటి నుంచి సంప్రదాయికమైన బెంగాలీ వంటకాలు, ఇంట్లో సులువుగా వండుకోగలిగే పదార్థాలు... ఇంకా చాలా వాటిని తయారు చేసి 'వీకెండ్ ఫ్లేవర్స్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం ప్రారంభించాను. ఒక్కొక్క పోస్ట్ పెడుతూ ఉంటే... వాటికి వీక్షకుల నుంచి వచ్చిన స్పందన నాలో సంతోషంతో పాటు ఉద్వేగాన్ని కూడా కలిగించింది. 'ఎప్పుడో చిన్నప్పుడు తిన్నాం. అవి ఎలా చెయ్యాలో మీరు చూపిస్తూ ఉంటే... వెంటనే ట్రై చేసేద్దామనిపిస్తోంది' అని కొందరు... 'ఆ వంటకం ఎలా చెయ్యాలో చెప్తారా' అని మరి కొందరు, 'పేరు గుర్తు లేదు కానీ... ఈ దినుసులతో చేస్తారని మాత్రం తెలుసు. అదేమిటో చెప్తారా, ప్లీజ్?' అని ఇంకొందరు చెబుతూ ఉంటే... రెట్టించిన ఉత్సాహంతో, అమ్మ మార్గదర్శకత్వంతో వరుసగా వీడియోలు చేశాను. కనీసం వారానికి ఒక వీడియో పోస్ట్ చెయ్యాలనేది నియమంగా పెట్టుకున్నాను. సంప్రదాయ వంటకాలకు ఆధునికమైన మెరుగులు దిద్దడం, ఇతర ప్రాంతాలకు చెందిన వంటకాలను బెంగాలీ పద్ధతిలో చేయడం, పిజ్జాలు, బర్గర్స్ లాంటి వాటిలో పాత రుచుల్ని మేళవించడం... ఇలా పలు ప్రయోగాలు చేస్తున్నాను. అమ్మ చేసిన వంటల తయారీ గురించి ఆమెను అడుగుతున్నట్టు... నా వీడియోలన్నీ 'హలో అమ్మా!' అని ప్రారంభమవుతాయి. ఇది వీక్షకులందరికీ నచ్చింది. ఏదో మొక్కుబడిగా చెబుతున్నట్టు కాకుండా... చూస్తున్నవారికి ఆకట్టుకొనేలా మాట్లాడడానికి ప్రయత్నిస్తాను. రచయిత్రిగా నాకున్న కాస్త అనుభవం దీనికి పనికొస్తోంది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో నాకు మూడున్నర లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఎక్కడికైనా వెళ్ళినప్పుడు నన్ను జనం గుర్తుపట్టి పలకరిస్తున్నారు. నేను ఎన్నడూ ఊహించని ఈ ప్రయాణం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ఆహారం కేవలం కడుపు నింపుకోవడానికి మాత్రమే కాదు. దాని వెనుక ఎన్నో జ్ఞాపకాలు ఉంటాయి. భావోద్వేగాలుంటాయి. అది మనుషుల్ని దగ్గర చేస్తుంది. నా కంటెంట్‌ను చూసేవారు తమ ఇంట్లో తిన్న పాత రుచుల్ని గుర్తు తెచ్చుకుంటే... నా ప్రయత్నం సఫలమైనట్టే."



బ్రహ్మా కుమారీస్ అధినేత్రి దాది రతన్ మోహిని కన్నుమూత

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి



జైపూర్, ఏప్రిల్ 8: బ్రహ్మాకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ అధినేత్రి దాది రతన్ మోహిని కన్నుమూశారు. వందేళ్లు దాటిన దాది రతన్ మోహిని.. ఇటీవల ఆరోగ్యం సరిగా లేక అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. 1925 మార్చి 25న జన్మించిన దాది రతన్ మోహిని అతి పిన్న వయసులో బ్రహ్మా కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో చేరారు. ప్రపంచమంతా సంచరించి ఆధ్యాత్మిక ప్రగతికి కృషి చేశారు. జాతి, మత భేదాలకు అతీతంగా ఆధ్యాత్మిక చైతన్యం కలిగించి ఎందరికో మార్గ దర్శకులయ్యారు. తన విశేష సేవలకు గాను డాక్టరేట్‌తో పాటు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. దాది రతన్ మోహిని మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం రేవంత్ రెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక బలానికి, నిర్మలత్వానికి, విశ్వ సోదర భావానికి నిలువెత్తు నిదర్శనంగా ఆమె నిలిచారని రేవంత్ కొనియాడారు. ఆమె మరణం రాష్ట్రానికి, దేశానికి, విశ్వ ఆధ్యాత్మికతకు తీరని లోటన్నారు.

అయోధ్యరాముడికి వచ్చే నెలలో పట్టాభిషేకం!

- ఈ నెలాఖరుకల్లా రామదర్బార్ సిద్ధం
- జైపూర్‌లో రూపుదిద్దుకుంటున్న రాజసభ



అయోధ్య, ఏప్రిల్ 8: అయోధ్య రామాలయంలో గత ఏడాది జనవరి 22న ప్రాణప్రతిష్ఠ జరిగింది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, రాజకీయ నేతలు, సాధువులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు సహా 8 వేల మంది ప్రముఖులు తరలిరాగా.. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఇప్పుడు మరో కీలక ఘట్టం అక్కడ ఆవిష్కృతం కానుంది. అయోధ్యాధీశుడిగా శ్రీరాముడి పట్టాభిషేకాన్ని వచ్చే నెలలో నిర్వహించేందుకు సకల సన్నాహాలూ జరుగుతున్నాయి. దానికి ముందుగా ఈ నెలాఖరులోగా ఆలయ మొదటి అంతస్తులో రామదర్బార్ లేదా రాజసభను నెలకొల్పనున్నారు. అయితే పట్టాభిషేకాన్ని ప్రాణప్రతిష్ఠ తరహాలో పటాటోపంగా నిర్వహించడం లేదు. పరిమిత సంఖ్యలో మాత్రమే అతిథులను ఆహ్వానించనున్నారు. ప్రధాని మాజీ ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్రా సారథ్యంలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం చకచకా పూర్తవుతోంది. ఆలయ సముదాయం ఈ నెలాఖరుకల్లా సిద్ధమవుతుందని మిశ్రా ఇటీవల స్వయంగా చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి ఆలయ ప్రాకారం పూర్తవుతుందన్నారు. ప్రాకారం లోపల, వెలుపల నిర్మించిన ఆలయాల్లో ప్రతిష్ఠించాల్సిన విగ్రహాలు ఈనెల 30నాటికి వచ్చేస్తాయన్నారు.

శిల్పి ప్రశాంత్ పాండే నేతృత్వాన..

బాలరాముడి విగ్రహాన్ని కర్ణాటక శిల్పి అరుణ్ యోగిరాజ్ రూపొందించిన సంగతి తెలిసిందే. రామదర్బార్‌ను ప్రముఖ శిల్పి ప్రశాంత్ పాండే నేతృత్వంలోని 20 మంది హస్త కళాకారులు జైపూర్‌లో తీర్చిదిద్దుతున్నారు. ఈయన తండ్రి సత్యనారాయణ పాండే పర్యవేక్షిస్తున్నారు. ఆ కుటుంబంలో నాలుగు తరాలుగా అందరూ శిల్పప్రావీణ్యం కలిగినవారే కావడం విశేషం. రామదర్బార్‌లో సీత, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, ఆంజనేయుడి విగ్రహాలు (తెల్ల మార్బుల్) కూడా ఉంటాయి. ఆలయ ప్రాంగణంలో నెలకొల్పే సూర్యదేవుడు, విఘ్నేశ్వరుడు, హనుమంతుడు, దుర్గాదేవి, అన్నపూర్ణాదేవి విగ్రహాలు, సప్తర్షి ఆలయంలో ప్రతిష్ఠించే సప్తర్షుల విగ్రహాలను కూడా పాండే రూపుదిద్దుతున్నారు. 'ఇది ప్రస్తుతం తుది ప్రక్రియలో ఉంది. పూర్తికాగానే అయోధ్య రామాలయానికి తరలిస్తాం' అని పాండే చెప్పారు. కాగా.. 'రామచరిత మానస్' రాసిన సంత్ తులసీదాస్ విగ్రహాన్ని కూడా ఆలయ ప్రాంగణంలోనే నెలకొల్పుతున్నారు. మరోవైపు, రామాలయానికి 4కిలోమీటర్ల దూరాన ప్రధాన అంతర్జాతీయ రామకథ మ్యూజియంను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో శ్రీరామ జననం, రామాయణ ఇతర ఘట్టాలను కళ్లకుగట్టే హోలోగ్రాం, రామాలయ నిర్మాణానికి శతాబ్దాలుగా సాగిన ఉద్యమం తాలూకు డాక్యుమెంటరీ.. పురావస్తు శాఖ తవ్వకాల్లో వెలుగుచూసిన ప్రాచీన కళాఖండాలు, శిల్పాలను ప్రదర్శిస్తారు.

పెళ్లి కుమారుడితో కాబోయే అత్త పరార్

ఆలీగఢ్, ఏప్రిల్ 8: కాబోయే అల్లుడితో ఓ అత్త పరారు కావడం సంచలనం కలిగించింది. వారిద్దరు ప్రేమలో పడడమే ఇందుకు కారణం. పెళ్లికి ఇంకా 9రోజులుందనగా నగదు, నగలు తీసుకొని ఆమె వెళ్లిపోయింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ తన కుమార్తె కోసం స్వయంగా యువకుడిని చూసి పెళ్లి నిశ్చయం చేసింది. అత్తవారిల్లు అన్న భావనతో ఆ యువకుడు నిత్యం వస్తుండేవాడు. ఈ క్రమంలో పెళ్లి కుమారుడు, కాబోయే అత్త మధ్య ప్రేమ చిగురించింది. పెళ్లి దగ్గరపడుతుండడంతో షాపింగ్ కోసం వెళ్తున్నానని చెప్పిన అత్త మళ్లీ తిరిగి రాకపోవడంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పుట్టేది సౌరభ్ బిడ్డే అయితే దత్తత తీసుకుంటాం

మేరఠ్, ఏప్రిల్ 8: ప్రియుడి సాయంతో భర్తను హత్య చేసిన భార్య ముస్కాన్ రస్తోగి కేసులో మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఆమె గర్భం దాల్చినట్టు వైద్య పరీక్షల్లో తేలినట్టు అధికారులు తెలిపారు. మర్చంట్ నేవీ అధికారి అయిన సౌరభ్ రాజ్‌పుత్‌ను ఆమె.. ప్రియుడు సాహిల్ శుక్లాతో కలిసి నరికి ముక్కలు చేసింది. ప్రస్తుతం జైలులో ఉన్న ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించగా గర్భందాల్చినట్టు తేలింది. దీనిపై సౌరభ్ సోదరుడు స్పందించారు. జన్మించేది సౌరభ్ బిడ్డే అయితే తాము దత్తత తీసుకుంటామని తెలిపారు.

మేధా పాట్కర్ ప్రొబేషన్‌పై విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: సామాజిక ఉద్యమకారిణి మేధా పాట్కర్ (70)కు మంగళవారం న్యాయస్థానంలో ఊరట లభించింది. పరువు నష్టం దావాలో జైలు శిక్ష పడిన ఆమెను ప్రొబేషన్‌పై విడుదల చేస్తున్నట్టు అదనపు సెషన్స్ జడ్జి విశాల్ సింగ్ ప్రకటించారు. సత్ప్రవర్తనను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుత ఢిల్లీ గవర్నర్ ఎల్.కె.సక్సేనా నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమ సమయంలో ఆమెపై ఈ పరువు నష్టం దావా వేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

సెంటిమెంట్ తేదీన విశ్వంభర?



చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతోన్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంక్రాంతికి రావాల్సిన ఈ సినిమా వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు కొత్త తేదీని చిత్రబృందం ప్రకటించలేదు. కానీ, చిరంజీవి బ్లాక్ బస్టర్ సినిమాల్లో ఒకటైన 'జగదేక వీరుడు - అతిలోక సుందరి' విడుదలైన మే9న 'విశ్వంభర'ను రిలీజ్ చేయనున్నారనే వార్తలు ఆ మధ్య వెలువడ్డాయి. తాజాగా జూలై 24న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాలీవుడ్‌లో మరోసారి వార్తలు వినిపిస్తున్నాయి. 'ఇంద్ర' కూడా అదే రోజున విడుదలై ఇండస్ట్రీ హిట్ కొట్టింది. ఆ సెంటిమెంట్ 'విశ్వంభర'కు కూడా పనిచేస్తుందని చిత్రబృందం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. కాగా, 'విశ్వంభర' నుంచి ఈనెల 12న తొలి పాటను విడుదల చేయనున్నట్లు సమాచారం. అలాగే 'చిరంజీవి - అనిల్ రావిపూడి' చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

అఖిల్... లెనిన్



పుట్టేటప్పుడు ఊపిరి ఉంటుందిరా, పేరు ఉండదు... పోయేటప్పుడు ఊపిరి ఉండదు పేరు మాత్రమే ఉంటుందిరా' అంటూ పవర్‌ఫుల్ డైలాగ్, లుక్‌తో ఎంట్రీ ఇచ్చారు అఖిల్ అక్కినేని. ఆయన కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్ ఖరారైంది. మంగళవారం అఖిల్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. అందులో గుబురు మీసం, పొడవాటి జుట్టుతో మాస్‌లుక్‌లో అఖిల్ ఆకట్టుకున్నారు. రాయలసీమ నేపథ్యంలో పోరాట ఘట్టాలు, పతాకస్థాయి భావోద్వేగాలతో ఈ చిత్రం రూపొందుతోందని గ్లింప్స్‌ను బట్టి తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకుడు. సంగీతం: తమన్, సినిమాటోగ్రఫీ: నవీన్‌కుమార్, ఎడిటర్: నవీన్ నూలి.

'టిల్లూ'కు మించిన వినోదంతో వస్తున్నాం



\- సిద్ధు జొన్నలగడ్డ

"బొమ్మరిల్లు, పరుగు' లాంటి హిట్ చిత్రాల కోవలోనే భాస్కర్ గారు దర్శకత్వం వహించిన 'జాక్' చిత్రం కూడా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఆయన 24 గంటలూ ఈ సినిమా గురించే ఆలోచించారు. 'టిల్లూతో నువ్వు క్రియేట్ చేసిన ఇమేజ్ ఈ చిత్రంలోనూ ఏమాత్రం తగ్గకూడదు' అని అనేవారు. ఆయన చెప్పినట్లు నా గత చిత్రాలకు మించిన ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఈ చిత్రంతో ఇవ్వబోతున్నాం" అని హీరో సిద్ధు జొన్నలగడ్డ చెప్పారు. ఆయన కథానాయకుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "టిల్లూ స్క్వేర్ తర్వాత చాలా జాగ్రత్తలు తీసుకొని చేసిన సినిమా ఇది. భాస్కర్ గారి విజన్‌లో హీరోగా నన్ను చూసుకోవడం ఆనందాన్నిచ్చింది" అని అన్నారు. బొమ్మరిల్లు భాస్కర్ మాట్లాడుతూ 'ఇది మనందరి కథ. ఒక శిలలో ఉండే శక్తి ఏంటో మీరు ఈ సినిమాలో చూస్తారు. నటిగా వైష్ణవి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుంది. సిద్ధు ప్రతిభావంతుడైన నటుడు. సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. ప్రసాద్ గారితో కలసి పనిచేయడం కొత్త ఉత్సాహాన్నిచ్చింది' అని చెప్పారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ 'సినిమా బాగా వచ్చింది. ప్రేక్షకాదరణ దక్కుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. "టిల్లూ స్క్వేర్‌తో పోల్చితే జాక్‌లో పదిరెట్ల వినోదం ఉంటుంది. హ్యాపీగా నవ్వుకోవడానికి ఈ సినిమాకు వెళ్లండి" అని నిర్మాత నాగవంశీ చెప్పారు.

మంచు విష్ణుపై మనోజ్ ఫిర్యాదు



మంచు కుటుంబం మరోసారి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో మంచు మనోజ్ తన అన్న మంచు విష్ణుపై ఫిర్యాదు చేశారు. తాను ఇంట్లోలేని సమయంలో కారుతోపాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లాడని, జల్‌పల్లి ఇంట్లో సైతం 150 మంది చొరబడి విధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతూ 'ఏప్రిల్ 1న పాప పుట్టిన రోజు వేడుకల కోసం జైపూర్ వెళ్లాను. విష్ణుతో పాటు 150 మంది ఇంట్లోకి వచ్చారు. నా గదులను ధ్వంసం చేశారు. నగల పెట్టెలను సైతం ధ్వంసం చేశారు' అని తెలిపారు. కాగా, నార్సింగిలో మంచు మనోజ్ నివాసం ఉంటున్న ముప్పా విల్లాస్‌లో జరిగిన దొంగతనం సంఘటనపై ఆయన డ్రైవర్ సాంబశివరావు ఫిర్యాదు చేశారని నార్సింగి పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ సిటీ/నార్సింగి (ఆంధ్రజ్యోతి)

ఒక వైపు అధికారం.. మరో వైపు నిజం!



చట్టానికి తప్ప ఎవరికీ తలవంచని అధికారి, వృత్తిని దైవంలా భావించే ఐఆర్ఎస్ ఆఫీసర్ అమీ పట్నాయక్ మళ్లీ వచ్చేశాడు. 2018లో వచ్చిన హిట్ మూవీ రైడ్‌కు సీక్వెల్ రెడీ అయింది. 'రైడ్ 2' పేరుతో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో ఐఆర్ఎస్ ఆఫీసర్ అమీ పట్నాయక్‌గా అజయ్ దేవగణ్ మళ్లీ నటిస్తున్నారు. రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో పనోరమ స్టూడియోస్, టీ సిరీస్ సంస్థలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించాయి.. రైడ్‌లో ఇలియానా కథానాయికగా నటిస్తే, సీక్వెల్‌లో ఆ పాత్రను వాణీ కపూర్ చేజిక్కించుకున్నారు. 'ఒకవైపు అధికారం.. మరో వైపు నిజం. ఈ ప్రయాణం ఇప్పుడు మరింత పెద్దదిగా మారింది' అని పేర్కొంటూ ట్రైలర్‌ను సోషల్ మీడియా ద్వారా మంగళవారం విడుదల చేశారు.



అట్లీ దర్శకత్వంలో 'పుష్పరాజ్'

తమిళ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించనున్న సినిమా ఖరారు అయింది. సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మంగళవారం అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా 'ల్యాండ్‌మార్క్ సినిమాటిక్ ఈవెంట్ "ఏఏ22-ఏ6" కోసం సిద్ధమవ్వండి. సన్ పిక్చర్స్ నుంచి ఒక గొప్ప ప్రయత్నం' అని ట్వీట్ చేస్తూ ఓ వీడియోను నిర్మాణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లుగా వీడియోలో చూపించారు. అలాగే, అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన విజువల్స్‌నూ ఇందులో చూపించారు. అంతర్జాతీయ స్థాయిలో భారీ బడ్జెట్‌తో ఈ మూవీని తీర్చిదిద్దుతున్నట్లు వీడియో చూస్తే అర్థమవుతోంది. ఈ కథకు భారీగా వీఎఫ్ఎక్స్ సన్నివేశాల అవసరం ఉండడంతో అల్లు అర్జున్, అట్లీ ఇద్దరూ అమెరికా వెళ్లారు. వివిధ వీఎఫ్ఎక్స్ స్టూడియోలను సందర్శించి నిపుణులతో చర్చించారు. రూ. 250 కోట్లు వీఎఫ్ఎక్స్ కోసమే సన్ పిక్చర్స్ ఖర్చు చేయనున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ప్రోస్థటిక్ మేకప్‌లో అల్లు అర్జున్ కనిపించే అవకాశం ఉందని తెలిసింది.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

దుష్టశక్తిపై సమరం



గ్లామర్ తార తమన్నా భాటియా నాగ సాధువుగా నటించిన 'ఓదెల 2' చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్' కు ఇది సీక్వెల్. దర్శకుడు సంపత్‌నంది కథ, స్ర్కీన్‌ప్లే, మాటలు అందించడమే కాకుండా దర్శకత్వ పర్యవేక్షణ చేశారు. అశోక్ తేజ దర్శకుడు. డి. మధు నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం ముంబైలో విడుదల చేశారు. ఓదెల గ్రామానికి ఓ దుష్ట శక్తి కారణంగా ప్రమాదం పొంచి ఉందని చెప్పే ఓ పవర్‌ఫుల్ వాయిస్‌తో ట్రైలర్ మొదలవుతుంది. మంచికీ, చెడుకీ మధ్య జరిగే సమరంలో ఓ నాగసాధువు ఆ గ్రామాన్ని ఎలా రక్షించిందన్న కథాంశంతో ఆసక్తికరంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. తమన్నా తన అద్భుత నటనతో నాగసాధువు పాత్రకు సహజత్వం తెచ్చారు. అలాగే వశిష్ట ఎన్ సింహ పోషించిన మాంత్రికుడి పాత్ర భయానకంగా ఉంది.

వినోదాత్మక చిత్రం



రామ్ ప్రకాశ్ గున్నం హీరోగా నటించి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'చెరసాల'. శ్రీజిత్, నిష్కల, రమ్య కీలక పాత్రలు పోషించారు. కథి అంజమ్మ, షికార నిర్మించారు. ఈ నెల 11న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు రామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ "మంచి భావోద్వేగాలతో పాటు చక్కని వినోదం ఉన్న చిత్రమిది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది" అని అన్నారు.

సందేశాత్మక ప్రేమకథ



పృథ్వీ అంబర్ ప్రధానపాత్రలో సాయిరాజేశ్ మహదేవ్ తెరకెక్కించిన చిత్రం 'డియర్ ఉమ'. సుమయ రెడ్డి హీరోయిన్‌గా నటించి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు శివ నిర్వాణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మంచి ప్రేమకథతో పాటు సందేశం ఉన్న ఫీల్ గుడ్ చిత్రమిది" అని తెలిపారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతోంది.



జాతీయ జట్టులోకి శ్రీచరణి

ముక్కోణపు సిరీస్‌కు ఎంపికైన తెలుగమ్మాయి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ యువ క్రికెటర్ నల్లపురెడ్డి శ్రీచరణి జాతీయ మహిళా జట్టుకు ఎంపికైంది. ఈనెలాఖరులో శ్రీలంక ఆతిథ్యమిస్తున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల భారత మహిళల జట్టును మంగళవారం ప్రకటించారు. ఇందులో ఎడమచేతి వాటం స్పిన్నరైన 20 ఏళ్ల శ్రీచరణి చోటు దక్కించుకుంది. కడప జిల్లాకు చెందిన శ్రీచరణి.. ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడింది. శ్రీచరణితో పాటు మరో ఇద్దరు యువ బౌలర్లు కశ్వీ గౌతమ్, శుచి ఉపాధ్యాయ్ కూడా ఈ సిరీస్‌తో అరంగేట్రం చేయనున్నారు. తెలంగాణకు చెందిన అరుంధతి రెడ్డి జట్టులో చోటు నిలబెట్టుకుంది. ఇక, ఐర్లాండ్‌తో సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ ముక్కోణపు సిరీస్‌తో తిరిగి జట్టులోకొచ్చింది. ఈనెల 27 నుంచి కొలంబోలో జరిగే ఈ సిరీస్‌లో శ్రీలంక, భారత్, దక్షిణాఫ్రికా పోటీపడుతున్నాయి.

జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తిక భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్‌జోత్ కౌర్, కశ్వీ గౌతమ్, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి, తేజల్ హసబ్నిస్, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్.



భర్తతో మేరీ

విడాకుల బాటలో మేరీ కోమ్!

వ్యాపార భాగస్వామితో డేటింగ్?

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ తమ 20 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలుకనున్నట్టు సమాచారం. భర్త కరుంగ్ ఓంకోలెర్‌తో తను విడిపోయేందుకు సిద్ధమైనట్టు ఆమె సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతానికి ఇంకా విడాకుల కోసం దరఖాస్తు చేసుకోకపోయినా, ఇద్దరూ విడిగానే జీవిస్తున్నారు. కరుంగ్ 2022 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. ప్రచారం కోసం రూ. 2-3 కోట్ల వరకు ఖర్చు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో కాపురంలో కలతలు ఏర్పడడంతో తమ నలుగురు పిల్లలతో మేరీ ఫరీదాబాద్‌కు మకాం మార్చింది. కరుంగ్ మాత్రం ఢిల్లీలోనే ఉంటున్నాడు.

ఓ బాక్సర్ భర్తతో..: ఓ మహిళా బాక్సర్ భర్తను వ్యాపార భాగస్వామిగా పేర్కొంటూ మేరీ కోమ్ ఇన్‌స్టా ఖాతాలో పలు ఫొటోలు, వీడియోలు పోస్టుచేసింది. ఆ వ్యక్తి.. మేరీకోమ్ బాక్సింగ్ ఫౌండేషన్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. మేరీ అతనితో కలిసి మహాకుంభ్‌కు కూడా వెళ్లి ఉత్సవాల్లో పాల్గొంది.

ఐపీఎల్‌లో నేడు	వేదిక అహ్మదాబాద్
గుజరాత్ x రాజస్థాన్	రా.7.30

నాకౌట్‌కు అర్జున్

పారిస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్ టూర్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి నాకౌట్‌కు చేరుకొన్నాడు. మంగళవారం జరిగిన ఐదు రౌండ్లలో రెండు గేమ్‌లు గెలిచిన అర్జున్.. మరో రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. 9వ రౌండ్‌లో ఇయాన్ నెపోమ్నియాచి చేతిలో మాత్రమే అర్జున్ ఓడాడు. దీంతో మొత్తం 6.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచిన అర్జున్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. టాప్-8లో నిలిచిన వారికే క్వార్టర్స్ ఆడే అవకాశం ఉంది. 9వ స్థానంలో నిలిచిన ప్రజ్ఞానంద (4 పాయింట్లు), 11వ స్థానంలో నిలిచిన వరల్డ్ చాంపియన్ గుకేష్ (3.5 పాయింట్లు) ఎలిమినేట్ అయ్యారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	4	3	1	0	6	1.015
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
కోల్‌కతా	5	2	3	0	4	-0.056
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	5	1	4	0	2	-0.889
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

సురుచికి స్వర్ణం

షూటింగ్ వరల్డ్ కప్



బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో టీనేజ్ షూటర్ సురుచి ఇందర్ సింగ్ స్వర్ణ పతకం సాధించింది. 18 ఏళ్ల సురుచి ఫైనల్లో 244.6 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. చైనాకు చెందిన కియాన్ వీ, జియాంగ్ రాన్‌గ్జిన్ వరుసగా రజత కాంస్యాలకు పరిమితమయ్యారు.

ధ్రువ్ జోడీ బోణీ

ఆసియా బ్యాడ్మింటన్

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జంటలు ధ్రువ్ కపిల/తనీషా క్యాస్ట్రో, అసిత్ సూర్య/అమృత మిక్స్‌డ్ డబుల్స్‌లో శుభారంభం చేశా రు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో కపిల జోడీ 15-21, 21-12, 21-11తో మలేసియా జంట హో పాంగ్/సూయిన్‌పై, సూర్య/అమృత 21-9, 21-11తో శ్రీలంక జోడీ తులిత్/పంచలిపై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరారు.

కంకషన్‌తో కెరీర్ ముగింపు



విల్ పకోవ్‌స్కీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా క్రికెటర్ 27 ఏళ్ల విల్ పకోవ్‌స్కీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన కెరీర్‌లో ఒకే టెస్టు ఆడిన ఈ ఆటగాడి నిర్ణయం వెనుక కంకషన్ తదనంతర పరిణామాలే కారణం కావడం గమనార్హం. గతేడాది మార్చిలో జరిగిన షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో పేసర్ మెరిడిత్ షార్ట్ పిచ్ బాల్ హెల్మెట్‌కు బలంగా తాకింది. ఆ వెంటనే తను మైదానం వీడాడు. అతని కెరీర్‌లో మొత్తంగా 12 సార్లు కంకషన్ గాయాలయ్యాయి. స్వతంత్ర మెడికల్ ప్యానెల్ సూచన ప్రకారం పకోవ్‌స్కీ ఆట నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పటికే దెబ్బతిన్న తన మెదడును మరింత గాయాలపాలు చేయదల్చుకోలేదని పకోవ్‌స్కీ అన్నాడు.

ప్రియాన్ష్ ఫటాఫట్

39 బంతుల్లోనే మెరుపు శతకం

పంజాబ్‌దే విజయం
చెన్నైకి వరుసగా నాలుగో ఓటమి



ప్రియాన్ష్ ఆర్య (103)

చండీగఢ్: యువ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (42 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 103) మెరుపు శతకంతో విరుచుకుపడిన వేళ.. పంజాబ్ కింగ్స్ అదరగొట్టింది. ఇక సీజన్‌లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్‌లో ఆకట్టుకున్నా.. ఫినిషింగ్‌లో దూకుడు కనబర్చలేకపోయింది. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 18 రన్స్ తేడాతో పంజాబ్ నెగ్గింది. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. టాప్-6లో ఐదుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే నిరాశపర్చినా.. ప్రియాన్ష్ ఒంటిచేత్తో జట్టు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అతడికి శశాంక్ (52 నాటౌట్) తోడ్పడగా, ఆఖర్లో జాన్సెన్ (34 నాటౌట్) రాణించాడు. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసి ఓడింది. ఓపెనర్లు కాన్వే (69 రిటైర్డ్ అవుట్), రచిన్ (36) మెరుపు ఆరంభంతో తొలి వికెట్‌కు 61 రన్స్ అందించారు. అయితే మధ్య ఓవర్లలో తడబాటుతో చేయాల్సిన రన్‌రేట్ పెరిగింది. శివమ్ దూబే (42) భారీ షాట్లతో ఆకట్టుకున్నా అతను కీలక సమయంలో వెనుదిరగడం దెబ్బతీసింది. డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లు సులువుగా పరుగులివ్వలేదు. దీంతో చివరి ఓవర్‌లో 28 రన్స్ కావాల్సిన వేళ ధోనీ (27) వెనుదిరగగా, జట్టు 9 పరుగులే చేయగలిగింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ప్రియాన్ష్ నిలిచాడు.

ఆర్య అదిరేలా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓవైపు వికెట్లు పతనమవుతున్నా.. మరో వైపు ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య విధ్వంసం కొనసాగింది. తొలి ఎనిమిది ఓవర్లలోనే ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (0), శ్రేయాస్ (9), స్టొయినిస్ (4), నేహల్ (9), మ్యాక్స్‌వెల్ (1) ఇలా అంతా సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగినా.. ఏమాత్రం ఒత్తిడికి లోనుకాని ఆర్య బాదుడు మాత్రం ఆపలేదు. బౌలర్ ఎవరైనా చితక్కొడుతూ మైదానం నలువైపులా బౌండరీల వరద పారించాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్సర్ బాదిన తను రెండో బంతికే ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను ఖలీల్ వదిలేశాడు. దీనికి సీఎస్‌కే భారీ మూల్యమే చెల్లించుకుంది. ఆ తర్వాత తన జోరుకు పవర్ ప్లేలో స్కోరు 75/3కి చేరగా, అటు 19 బంతుల్లోనే ఆర్య ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు. ఈ దశలో శశాంక్ నుంచి అతడికి సహకారం అందింది. 13వ ఓవర్‌లో ఆర్య 6,6,6,4తో 23 రన్స్ రాబట్టగా.. 39 బంతుల్లోనే తొలి సెంచరీని పూర్తి చేశాడు. లీగ్‌లో ఇది నాలుగో ఫాస్టెస్ట్ సెంచరీ కావడం విశేషం. అయితే తర్వాతి ఓవర్‌లోనే అతడిని స్పిన్నర్ నూర్ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక చివరి ఐదు ఓవర్లలో శశాంక్, జాన్సెన్ చెలరేగి 55 పరుగులు అందించడంతో పంజాబ్ 200+ స్కోరును అవలీలగా సాధించింది.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (సి) శంకర్ (బి) నూర్ 103, ప్రభ్‌సిమ్రన్ (బి) ముకేశ్ 0, శ్రేయాస్ (బి) ఖలీల్ 9, స్టొయినిస్ (సి) కాన్వే (బి) ఖలీల్ 4, నేహల్ (సి) ధోనీ (బి) అశ్విన్ 9, మ్యాక్స్‌వెల్ (సి అండ్ బి) అశ్విన్ 1, శశాంక్ (నాటౌట్) 52, జాన్సెన్ (నాటౌట్) 34, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 219/6; వికెట్ల పతనం:** 1-17, 2-32, 3-54, 4-81, 5-83, 6-154; **బౌలింగ్:** ఖలీల్ 4-0-45-2, ముకేశ్ 2-0-21-1, అశ్విన్ 4-0-48-2, జడేజా 3-0-18-0, నూర్ అహ్మద్ 3-0-32-1, పథిరణ 4-0-52-0.

చెన్నై: రచిన్ (స్టంప్డ్) ప్రభ్‌సిమ్రన్ (బి) మ్యాక్స్‌వెల్ 36, కాన్వే (రిటైర్డ్ అవుట్) 69, రుతురాజ్ (సి) శశాంక్ (బి) ఫెర్గూసన్ 1, దూబే (బి) ఫెర్గూసన్ 42, ధోనీ (సి) చాహల్ (బి) యశ్ 27, జడేజా (నాటౌట్) 9, విజయ్ శంకర్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 201/5; వికెట్ల పతనం:** 1-61, 2-62, 3-151, 4-171, 5-192; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-39-0, యశ్ ఠాకూర్ 4-0-39-1, మ్యాక్స్‌వెల్ 2-0-11-1, జాన్సెన్ 4-0-48-0, ఫెర్గూసన్ 4-0-40-2, స్టొయినిస్ 1-0-10-0, చాహల్ 1-0-9-0.

లఖ్‌నవూ థ్రిల్లింగ్ విన్

- చెలరేగిన పూరన్, మార్ష్
- 4 పరుగులతో ఓడిన కోల్‌కతా



మార్ష్ (81)
పూరన్ (87 నాటౌట్)

కోల్‌కతా: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) థ్రిల్లింగ్ విక్టరీని నమోదు చేసింది. రహానె (35 బంతుల్లో 61) అర్ధ శతకంతో ప్రత్యర్థిని వణికించినా.. శార్దూల్, దిగ్వేష్ రాఠీ కీలక సమయంలో వికెట్లు పడగొట్టి కోల్‌కతా జోరుకు బ్రేకులేశారు. దీంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 పరుగులతో కోల్‌కతాపై నెగ్గింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' పూరన్ (36 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 87 నాటౌట్), మార్ష్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 81) అర్ధ శతకాలతో దుమ్మురేపడంతో.. తొలుత లఖ్‌నవూ 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఛేదనలో కోల్‌కతా ఓవర్లన్నీ ఆడి 234/7 స్కోరుకు పరిమితమైంది. వెంకటేష్ అయ్యర్ (45), రింకూ (15 బంతుల్లో 38 నాటౌట్) శ్రమ వృథా అయింది.

ఆఖర్లో తడబాటు: విజయానికి 43 బంతుల్లో 77 పరుగులే కావాల్సి రావడంతో నైట్‌రైడర్స్ సులువుగానే గెలుస్తుందని భావించారు. కానీ, రహానెను శార్దూల్ అవుట్ చేయడంతో.. కోల్‌కతా ఇన్నింగ్స్ గాడితప్పింది. కేవలం 15 పరుగుల తేడాతో నాలుగు వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడింది. చివరి ఓవర్‌లో విజయానికి 24 పరుగులు కావాల్సి ఉండగా.. రింకూ మ్యాజిక్ చేయలేకపోయాడు. అంతకుముందు డికాక్ (15) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మరో ఓపెనర్ నరైన్ (30)తో కలిసి రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించిన రహానె.. అయ్యర్‌తో కలిసి మూడో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

అదరగొట్టిన టాపార్డర్: టాపార్డర్ బ్యాటర్లు చెలరేగడంతో లఖ్‌నవూ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జట్టుకు ఓపెనర్లు మార్‌క్రమ్, మార్ష్ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యంతో బలమైన పునాది వేశారు. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన పూరన్.. మార్ష్‌తో రెండో వికెట్‌కు 71 రన్స్ జోడించాడు.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (బి) హర్షిత్ 47, మార్ష్ (సి) రింకూ (బి) రస్సెల్ 81, పూరన్ (నాటౌట్) 87, సమద్ (బి) హర్షిత్ 6, మిల్లర్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 238/3; వికెట్ల పతనం:** 1-99, 2-170, 3-221; **బౌలింగ్:** వైభవ్ 4-0-35-0, జాన్సన్ 3-0-46-0, వరుణ్ 4-0-31-0, హర్షిత్ 4-0-51-2, నరైన్ 3-0-38-0, రస్సెల్ 2-0-32-1.

కోల్‌కతా: డికాక్ (ఎల్బీ) ఆకాశ్ దీప్ 15, నరైన్ (సి) మార్‌క్రమ్ (బి) రాఠీ 30, రహానె (సి) పూరన్ (బి) శార్దూల్ 61, వెంకటేష్ (సి) మార్‌క్రమ్ (బి) ఆకాశ్ దీప్ 45, రమణ్‌దీప్ (సి) మార్‌క్రమ్ (బి) బిష్ణోయ్ 1, రఘువంశీ (సి) పంత్ (బి) అవేశ్ 5, రస్సెల్ (సి) మిల్లర్ (బి) శార్దూల్ 7, రింకూ (నాటౌట్) 38, హర్షిత్ (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 20 ఓవర్లలో 234/7; వికెట్ల పతనం:** 1-37, 2-91, 3-162, 4-166, 5-173, 6-177, 7-185; **బౌలింగ్:** ఆకాశ్ దీప్ 4-0-55-2, శార్దూల్ 4-0-52-2, అవేశ్ 4-0-45-1, దిగ్వేష్ 4-0-33-1, బిష్ణోయ్ 4-0-47-1.



ట్రంప్-మస్క్ మధ్య చెడిందా..?

- ఇరువురి నడుమ సుంకాల మంట!!
- టారిఫ్‌లు వద్దన్న టెస్లా అధిపతి
- అధ్యక్షులవారు మాత్రం ససేమిరా..

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహితుడు ఎలాన్ మస్క్ మధ్య చెడిందని సమాచారం. ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలే ఇరువురి మధ్య అభిప్రాయ విబేధానికి కారణమని ఓ అమెరికన్ మీడియా సంస్థ కథనం పేర్కొంది. సుంకాలు విధించవద్దని మస్క్ ఎంత చెప్పినా ట్రంప్ వినలేదట. ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని టెస్లా అధిపతికి అధ్యక్షులవారు ఖరాఖండిగా తేల్చి చెప్పేశారట. సుంకాల దెబ్బకు తన సంపద భారీగా తరిగిపోవడంతో పాటు టెస్లా కార్ల కంపెనీ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకోవడంతో పెద్దన్నపై మస్క్ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రతీకార సుంకాలకు తాను వ్యతిరేకమని మస్క్ చెప్పకనే చెప్పారు. గత వారంలో ట్రంప్ సుంకాలు ప్రకటించిన కొద్ది సేపటికే ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత మిల్టన్ ఫ్రైడ్మాన్ స్వేచ్ఛా వాణిజ్యంపై మాట్లాడుతున్న వీడియోను మస్క్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. అంతేకాదు, యూరప్‌తో సుంకాలు లేని వాణిజ్యం నెరపాలని కోరారు. అయితే, సుంకాలపై మస్క్ వైఖరిని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం మస్క్, నవారో మధ్య మాటల యుద్ధమే కొనసాగుతోంది. మస్క్, వైట్‌హౌస్‌కు మధ్య అగాధం పెరిగిందన్న వార్తలను ఇది మరింత బలపరుస్తోంది.

మస్క్ సంపదలో రూ.11.61 లక్షల కోట్లు ట్రంపార్పణం: ట్రంప్ సుంకాల దెబ్బకు మస్క్ సంపద ఈ ఏడాదిలో 13,500 కోట్ల డాలర్ల (రూ.11.61 లక్షల కోట్లు) మేర తరిగిపోయి ప్రస్తుతం 30,000 కోట్ల డాలర్ల దిగువకు (రూ.25.80 లక్షల కోట్లు) పడిపోయింది. గత గురు, శుక్రవారాల్లోనే మస్క్ నెట్‌వర్త్ 3,100 కోట్ల డాలర్ల మేర క్షీణించింది. సోమవారం నాడు మరో 440 కోట్ల డాలర్ల ఆస్తిని కోల్పోయారు.



బిజినెస్

ఒక రాష్ట్రం-ఒక ఆర్ఆర్‌బీ
మే 1 నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ: మరోసారి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ) పునర్ వ్యవస్థీకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. మే 1 నుంచి 'ఒక రాష్ట్రం-ఒక ఆర్ఆర్‌బీ' విధానం అమల్లోకి రానుంది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న 43 ఆర్ఆర్‌బీలను 28కి కుదిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్,ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, బిహార్, కర్ణాటక, జమ్మూకాశ్మీర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా, రాజస్థాన్‌లోని పలు ఆర్ఆర్‌బీలను ఒకే ఆర్ఆర్‌బీగా విలీనం చేస్తున్నట్టు తెలిపింది. ఆర్ఆర్‌బీలు ఖర్చులు తగ్గించుకుని నిర్వహణ సామర్థ్యం పెంచుకునేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఆర్ఆర్‌బీలను పునర్ వ్యవస్థీకరించడం ఇది నాలుగోసారి.

నేడే ఆర్‌బీఐ పాలసీ

ముంబై: భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా 2025-26 ఆర్థిక సంవత్సరానికి తొలి ద్రవ్య పరపతి విధానం బుధవారం ప్రకటించనున్నారు. ఈసారి కూడా ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించవచ్చన్న ఊహాగానాల నడుమ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం కోసం పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మల్హోత్రా సారథ్యంలోని ఎంపీసీ మూడు రోజుల సమావేశం సోమవారం ప్రారంభమైంది. కాగా బుధవారం ఉదయం 10 గంటలకు గవర్నర్ ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారని ఆర్‌బీఐ తెలిపింది.

సెమీకండక్టర్స్ వ్యాపారంలోకి సైయెంట్

- సైయెంట్ సెమీకండక్టర్స్ పేరుతో సంస్థ ఏర్పాటు
- రూ.862 కోట్లు కేటాయింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఐటీ కంపెనీ సైయెంట్ తన సెమీకండక్టర్ వ్యాపారాన్ని పెద్దఎత్తున విస్తరిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే 400 మంది ఉద్యోగులతో సైయెంట్ సెమీకండక్టర్స్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసి 10 కోట్ల డాలర్లు (సుమారు రూ.862 కోట్లు) కేటాయించింది. సెప్టెంబరు నాటికి ఈ అనుబంధ కంపెనీ కోసం విదేశాల నుంచి మరిన్ని నిధులు సమీకరిస్తామని సైయెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఎండీ బోదనపు కృష్ణ తెలిపారు. ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లను నియమించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. అయితే విదేశాల నుంచి ఎంత మొత్తం నిధులు సమీకరించేది ఆయన వెల్లడించలేదు. భవిష్యత్‌లో ఈ అనుబంధ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే యోచన కూడా ఉందన్నారు.


నైపుణ్యాలపైనే దృష్టి: సెమీకండక్టర్ల వ్యాపారంలో కొత్త చిప్స్ పరిశోధన, అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా మేధో సంపత్తి హక్కులు పొందాలని సైయెంట్ భావిస్తోంది. ఇందులో భాగంగా దేశ విదేశాల్లోని విద్యుత్ వాహనాలు, విద్యుత్ పంపిణీ సంస్థల వంటి రంగాలకు అవసరమైన కస్టమైజ్డ్ సిలికాన్ చిప్స్ అభివృద్ధి చేస్తామని కృష్ణ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కూడా ఈ విషయంలో తమకు కలిసి వస్తాయని కంపెనీ భావిస్తోంది.

తుది తీర్పుకు లోబడే 'రిస్డిప్లామ్' ఔషధం

మా ధర రూ.15,900 మాత్రమే: నాట్కో

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిస్డిప్లామ్ జెనరిక్ ఔషధం మార్కెట్లోకి విడుదల చేయడం ఢిల్లీ హైకోర్టు తుది తీర్పుకు లోబడి ఉంటుందని నాట్కో ఫార్మా వెల్లడించింది. తమ రిస్డిప్లామ్ జెనరిక్ ఔషధం ధర కూడా డోసు రూ.15,900 మాత్రమేనని పేర్కొంది. ప్రస్తుతం ఇదే పేటెంట్ ఔషధాన్ని స్విస్ ఫార్మా కంపెనీ రోచే రెండేళ్లకు రూ.72 లక్షల చొప్పున, ఆ తర్వాత ఏడాదికి రూ.56 లక్షల చొప్పున విక్రయిస్తోంది. అరుదైన వెన్నుపూస కండరాల క్షీణత (ఎస్ఎంఏ) వ్యాధి చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారు. ప్రస్తుతం రోచె ఫార్మా ఒక్కటే ఈ పేటెంటెడ్ ఔషధాన్ని 'ఎవరిస్డీ' పేరుతో మన దేశంలో మార్కెట్ చేస్తోంది. ఈ ఔషధం తయారీ, మార్కెటింగ్‌పై రోచెకు 2035 వరకు పేటెంట్ హక్కులు ఉన్నాయి.

ఉఫ్.. రిలీఫ్!



భారీ నష్టాల నుంచి మార్కెట్లకు కాస్త ఉపశమనం
- సెన్సెక్స్ 1,089 పాయింట్లు అప్
- 22,500 ఎగువ స్థాయికి నిఫ్టీ
- రూ.7 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: ట్రంప్ సుంకాల షాక్‌తో సొమ్మసిల్లిన స్టాక్ మార్కెట్లు కాస్త తేరుకున్నాయి. కనిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు వాల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో ఆసియా, ఐరోపా మార్కెట్లతో పాటు దలాల్ స్ట్రీట్‌లోనూ మంగళవారం ఊరట ర్యాలీ కొనసాగింది. సెన్సెక్స్ ఒక దశలో 1,721.49 పాయింట్లు (2.35 శాతం) ఎగబాకి 74,859.39 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 1,089.18 పాయింట్ల (1.49 శాతం) లాభంతో 74,227.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 535 పాయింట్ల (2.41 శాతం) వరకు పెరిగినప్పటికీ, చివర్లో 374.25 పాయింట్ల (1.69 శాతం) వృద్ధితో 22,535.85 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.32 లక్షల కోట్లు పెరిగి రూ.396.57 లక్షల కోట్లకు (4.62 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో పవర్‌గ్రిడ్ మినహా అన్నీ రాణించాయి. టైటాన్ షేరు 3.29 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, ఎల్ అండ్ టీ, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్, బ్యాంక్, జొమాటో, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా స్టాక్స్ 2 శాతానికి పైగా పెరిగాయి.
- బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 2.18 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.87 శాతం వృద్ధిని నమోదు చేశాయి. రంగాలవారీ సూచీలన్నీ రాణించాయి. ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ అత్యధికంగా 2.58 శాతం ఎగబాకింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, టెలికాం, ఇండస్ట్రియల్స్, ఎనర్జీ సూచీలూ రెండు శాతానికి పైగా పెరిగాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 50 పైసలు క్షీణించి రూ.86.26 వద్ద ముగిసింది. దాదాపు మూడు నెలల్లో రూపాయికిదే అతిపెద్ద ఒక్కరోజు నష్టం. అంతేకాదు, రూపాయి విలువ తగ్గడం వరుసగా ఇది మూడో రోజు కూడా.

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే, జపాన్ నికాయ్ 6.03 శాతం, చైనాకు చెందిన షాంఘై ఇండెక్స్ 1.58 శాతం, హాంకాంగ్‌కు చెందిన హాంగ్‌సెంగ్ 1.51 శాతం వృద్ధి చెందాయి. మరోవైపు బ్రిటన్‌కు చెందిన ఎఫ్‌టీఎస్ఈ 2.71 శాతం, ఫ్రాన్స్‌కు చెందిన సీఏసీ 2.50 శాతం, జర్మనీకి చెందిన డాక్స్ సూచీలు 2.48 శాతం లాభంతో క్లోజయ్యాయి. కాగా అమెరికా సూచీలు డోజోన్స్ 2.07 శాతం, ఎస్ అండ్ పీ 2.05 శాతం, నాస్‌డాక్ 2.37 శాతం మేర లాభాలతో ప్రారంభమయ్యాయి.

ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర మరో రూ.200 తగ్గి రూ.91,250కి జారుకుంది. వరుసగా ఐదు రోజులు తగ్గుతూ వచ్చిన వెండి రేటు మాత్రం కిలోకు రూ.200 పెరుగుదలతో రూ.92,700 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో మాత్రం ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ అర శాతానికి పైగా పెరిగి 3,007 డాలర్లకు చేరగా.. సిల్వర్ 30 డాలర్ల ఎగువన ట్రేడైంది.

దేశంలోని సీనియర్ సిటిజన్స్ కోసం జెన్ఎస్ లైఫ్ ప్రత్యేకమైన బీమా సేవలను అందుబాటులోకి తెచ్చింది. సీనియర్ సిటిజన్స్‌కు ఆర్థిక పరమైన భద్రత కల్పించే విధంగా ఈ పథకాలను రూపొందించింది, ఇందులో భాగంగా రూ.990 సిల్వర్ ప్లాన్‌తో రూ.2.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమాతో పాటు ఏదైనా ప్రమాదం కారణంగా హాస్పిటల్‌లో చేరితే రూ.50,000 వరకు నగదు చెల్లించనుంది. అలాగే రూ.4,900 వార్షిక ప్రీమియంతో రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా సహా ప్రమాదం కారణంగా హాస్పిటల్‌లో చేరితే రూ. లక్ష వరకు నగదు చెల్లించనుంది. రూ.5 లక్షల వరకు సైబర్ బీమాను అందించనుంది.

మారుతి సుజుకీ మార్కెట్లోకి 6 ఎయిర్‌బ్యాగ్స్, కొత్త ప్రీమియం ఫీచర్లతో అప్‌డేటెడ్ గ్రాండ్ విటారాను తీసుకువచ్చింది. న్యూ జెటా (ఒ), ఆల్ఫా (ఒ), ఆల్ఫా ప్లస్ (ఒ) వేరియంట్స్‌లో పనోరమిక్ సన్‌రూఫ్‌ను పొందుపరిచింది. 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో కూడా అందుబాటులో ఉండనుంది. మొత్తం 18 వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న గ్రాండ్ విటారా ప్రారంభ ధర రూ.11.42 లక్షలు.

డెయిరీ బ్రాండ్ మిల్కీ మిస్ట్.డెయిరీ, పశుదాణా వ్యాపారంలోని మిల్క్‌లేన్‌తో జట్టు కట్టింది. ఇందులో భాగంగా ప్రతి రోజు మిల్కీ మిస్ట్‌కు 100 కిలో లీటర్ల నాణ్యమైన పాలు, ఇతర వాల్యూ యాడెడ్ ఉత్పత్తులను మిల్క్‌లేన్ సరఫరా చేయనుంది. ఈ కాంట్రాక్టు కాలపరిమితి మూడేళ్లు. ఈ ఒప్పందంతో దాదాపు 10 వేల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




9వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	440
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	480	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	117
కరీంనగర్	100	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	89
కర్నూలు	100	నెల్లూరు	94
విశాఖపట్నం	109	అనంతపురం	94
గోదావరి	115		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,730 ▼	82,250 ▼	1,03,000 ▼
విజయవాడ	91,000 ▼	85,000 ▼	92,000 ▲
విశాఖపట్నం	88,220 ▼	80,870 ▼	90,040 ▲
రాజమండ్రి	89,730 ▼	82,750 ▼	92,200 ▼
ప్రొద్దుటూరు	88,850 ▼	81,600 ▼	92,300 ▲
ముంబై	88,550 ▼	81,112 ▼	90,363 ▼

రేవంత్.. కేటీఆర్ జాన్ జబ్బలు

» కేసీఆర్ కుటుంబాన్ని కేసుల నుంచి కాపాడుతున్నదే రేవంత్

» హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా?: సంజయ్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ జాన్ జబ్బలు (ప్రాణమిత్రులు) అయ్యారని మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. చెన్నైలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నిర్వహించిన డీలిమిటేషన్ సమావేశానికి ఇద్దరూ కలిసి వెళ్లడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి, కేటీఆర్ రహస్య మైత్రి బట్టబయలైందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కోసం కేంద్రానికి లేఖ రాయాలని సవాల్ చేశారు. ఈ విషయమై సీబీఐ విచారణకు డిమాండ్ చేసే దమ్ము బీఆర్ఎస్‌కు ఉందా? అనే సంగతి కేటీఆర్ తేల్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమ కేసుల్లో కేసీఆర్ కుటుంబం అరెస్ట్ కాకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే ఆ కేసులను నీరు గారుస్తోందన్నారు. దానికి ప్రతిఫలంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో కలిసి భూముల దోపిడీకి కేటీఆర్ సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

రేవంత్ డమ్మీ.. మీనాక్షి అసలైన సీఎం: ఏలేటి

నిర్మల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ డీఫ్యాక్టో(అసలైన) సీఎంలా వ్యవహరిస్తున్నారని, సచివాలయంలో మంత్రులతో ఆమె సమీక్షతో రేవంత్ ఇక డమ్మీ సీఎం అన్న సంగతి స్పష్టమైపోయిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై మీనాక్షి ఏకంగా సచివాలయానికి వెళ్లి మంత్రులతో సమీక్ష నిర్వహించడం సరికాదని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జులుగా పనిచేసినవారు ఏనాడూ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదన్నారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల కేసులో దోషులకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్ఐఏ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు సమర్థించడం పట్ల బీజేపీ పక్షాన తాను హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మారణహోమాన్ని సృష్టించిన ఉగ్రవాదులకు ఉరే సరైన శిక్ష అని హైకోర్టు పేర్కొనడంతో ప్రజాస్వామ్యంలో హింస, ఉగ్రవాదానికి చోటు లేదని మరోసారి స్పష్టమైందని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేలుళ్ల బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.

పసికందు తల, మొండెం వేరు చేసి ప్రసవం

» తల్లి ప్రాణం కాపాడేందుకు.. ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల చర్య!

అమరచింత, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఆత్మకూరులో దారుణం జరిగింది. గర్భంలోనే మరణించిన ఓ శిశువు తల, మొండెంను వేరు చేసిన ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు.. రెండు భాగాలుగా ఆ పసికందును బయటికి తీశారు. ఈ ఘటన తీవ్ర సంచలనంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం పాతపల్లి గ్రామానికి చెందిన అనిత.. తన అన్నయ్య పెళ్లి కోసం వనపర్తి జిల్లా అమరచింత మండలం చంద్రఘడ్ గ్రామానికి సోమవారం వచ్చింది. గర్భిణి అయిన అనితకు అదేరోజు రాత్రి 10:30 గంటలకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబసభ్యులు అనితను అంబులెన్స్‌లో డీఎంఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది అనితకు సాధారణ ప్రసవం చేసేందుకు యత్నించగా.. శిశువు నడుము భాగం మాత్రమే బయటకు వచ్చింది. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడం, ప్రసవం కష్టంగా మారడంతో వారు అనితను ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న అనితను పరీక్షించిన అక్కడి వైద్యులు, కేసు తీవ్రత దృష్ట్యా రాత్రి 11:30 గంటలప్పుడు ఆమెను జిల్లా ఆస్పత్రికి సిఫారసు చేశారు. అయితే, పసికందు మొండెం వరకు బయటకు రావడం, అనిత పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో.. ఆమె భర్త, ఇతర కుటుంబసభ్యులు.. అనితను వనపర్తికి తీసుకెళ్లకుండా ఆత్మకూరులోని శ్రీసాయి నర్సింగ్ హోమ్ అనే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనితను పరీక్షించిన ఆ నర్సింగ్ హోమ్ వైద్య సిబ్బంది.. శిశువు అప్పటికే ప్రాణం కోల్పోయినట్టు గుర్తించారు. తల్లి ప్రాణాన్ని కాపాడేందుకు శిశువు తల, మొండెంను వేరు చేసి ముక్కలుగా బయటికి తీశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

టెండర్ ద్వారానే కందిపప్పు కొనుగోలు

» నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు

» మహిళా శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు కంది పప్పు కొనుగోళ్లలో టెండర్ విధానాన్ని అనుసరించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా తప్పనిసరిగా టెండర్లు నిర్వహించి కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. తమ సూచనలు పాటించని జిల్లా అధికారులపై విచారణ జరుపుతామని తెలిపింది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కంది పప్పు కొనుగోళ్లకు కాంట్రాక్టర్ల ఎంపికలో అక్రమాలు జరిగాయి. టెండర్లు నిర్వహించకుండా రాష్ట్రంలో దాదాపు 15 జిల్లాల్లో నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టులు కట్టబెట్టారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'టెండర్ పెడితే రూ.118.. లేకుంటే రూ.164' శీర్షికన ప్రచురితమైన కథనానికి మహిళా శిశు సంక్షేమశాఖ రాష్ట్ర అధికారులు స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా టెండర్ లేకుండా అధిక ధరకు కట్టబెట్టిన కాంట్రాక్టులు రద్దు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి కట్టడికి చర్యలు: డీజీపీ

మాదకద్రవ్యాలు, గంజాయి కట్టడికి రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల సహకారం తీసుకోవాలని డీజీపీ జితేందర్ పోలీసులకు సూచించారు. అన్ని జిల్లాలు, కమిషనరేట్లలోని ఎస్‌హెచ్‌వో స్థాయి అధికారులు స్థానిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి మత్తు పదార్థాల అమ్మకాన్ని అరికట్టాలని ఆదేశించారు. డీజీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికుల నుంచి సరైన సమాచారం సేకరించగలిగితే గంజాయిని గ్రామాలకు రాకుండా అడ్డుకోవచ్చన్నారు. విద్యాసంస్థల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సీఐడీ డీజీ షికాగోయల్ మాట్లాడుతూ నేరగాళ్లకు శిక్షలు పడేలా చూడాల్సిన ప్రధాన బాధ్యతను దర్యాప్తు అధికారులు విస్మరించకూడదన్నారు. నకిలీ విత్తనాల సమస్యను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ మహేష్ భగవత్ తెలిపారు.

దేశీ విత్తనాలు, వంగడాలను రక్షించుకోవాలి

» కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్

పంజాగుట్ట, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): దేశీ విత్తనాలు, వంగడాలను రక్షించుకోవాలని, దేశీ విత్తనాలను ప్రోత్సహించేలా నూతన చట్టాలు, కమ్యూనిటీ విత్తన బ్యాంకులను తీసుకురావాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచన చేశారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో లీలా లక్ష్మారెడ్డి మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలో ఇటీవల మూడు రోజుల పాటు తాము నిర్వహించిన తొలి తెలంగాణ విత్తన పండగకు మంచి స్పందన వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశీయ విత్తనాల పరిరక్షణకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలపై రూపొందించిన నివేదికను త్వరలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ముందుపెడుతున్న అంశాలకు సంబంధించిన నివేదికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి, ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు డా.దొంతి నరసింహారెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపకులు కె. లక్ష్మారెడ్డి, జాకబ్ నెల్లితానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వచ్చే ఏడాది నుంచి ప్రతీ జిల్లాలో విత్తన పండుగలు నిర్వహిస్తామని చెప్పారు. రసాయనాలు లేకుండా విత్తనాల రక్షణ, వైవిధ్య భరితమైన ఆహారం తదితర అంశాలపై తాము చేసిన తీర్మానాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతామన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ జంటపేలుళ్లు..

దోషులకు ఉరే సరి

(మొదటి పేజీ తరువాయి)

గాయాలయ్యాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రియాజ్ భత్కల్ ఇప్పటికీ పరారీలో ఉండగా.. ఏ-2 నుంచి ఏ-6 వరకు ఉన్న ఐదుగురికి ఎన్ఐఏ కోర్టులో మరణశిక్ష ఖరారైంది. 157 మంది సాక్షులను విచారించాక.. ఎన్ఐఏ కోర్టు ఈ తీర్పునిచ్చింది. దాంతో దోషులు ఆ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తూ.. పిటిషన్ దాఖలు చేశారు. అదే సమయంలో ట్రయల్ కోర్టు కూడా తన తీర్పును హైకోర్టుకు రిఫర్ చేసింది. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధ ధర్మాసనం 45 రోజులపాటు సుదీర్ఘ విచారణ చేపట్టింది. "ఈ కేసులో నిందితులకు మరణ శిక్ష విధించడానికి ట్రయల్ కోర్టు అన్ని వాస్తవాలను, పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాకే.. ముగింపునకు వచ్చింది. ఈ కోర్టు సైతం స్వతంత్రంగా నిందితుల తరపు వాదనలను, ఆయా సాక్షుల వాంగ్మూలాలను కూలంకషంగా పరిశీలించింది. ప్రతి సాక్షి వాంగ్మూలాన్ని సరైన పద్ధతిలో రికార్డు చేశారు. దోషులకు మరణశిక్షను విధించడానికి సరైన కారణాలను ట్రయల్ కోర్టు ఎలాంటి లోపాలు లేకుండా, కచ్చితంగా రికార్డు చేసింది. ట్రయల్ కోర్టు ఉరిశిక్ష విధించడంలో చూపిన విచక్షణను, నిర్దేశించుకున్న కారణాలను, చేసిన కసరత్తును పరిశీలించిన తర్వాత.. ఆ తీర్పు ఏకపక్షం, అసమంజసం అని చెప్పడానికి వీలులేదన్నది మా అభిప్రాయం. పరిస్థితులను సరైనరీతిలో ఆవిష్కరించడానికి సమగ్రమైన, ఉదారవాద కోణంలో ప్రయత్నం చేశాం. దోషుల్లో పరివర్తనకు సంబంధించి ప్రభుత్వ ఏజెన్సీలతోపాటు మానసిక నిపుణులు ఇచ్చిన నివేదికలను సైతం క్షుణ్ణంగా పరిశీలించాం. ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేకుండా మరణ శిక్షను ధ్రువీకరించడానికి ఇది సరైన కేసు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సీఆర్‌పీసీ సెక్షన్ 366 ప్రకారం ట్రయల్ కోర్టు గరిష్ఠ శిక్ష అయిన మరణ శిక్షను విధిస్తే.. దాన్ని హైకోర్టు ధ్రువీకరించాల్సి ఉంటుంది. అందులో భాగంగానే 2016లో ట్రయల్ కోర్టు తన లేఖ ద్వారా 'మరణ శిక్షను ధ్రువీకరించాలని కోరినట్లు ధర్మాసనం వివరించింది. "సమగ్ర చర్చ తర్వాత నిందితుల్లో సంస్కరణ తేవడానికి లేదా పునరావాసం కల్పించడానికి ఎక్కడా చిన్న అవకాశం కూడా కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉరిశిక్షను జీవితఖైదుగా మారిస్తే ఆ ప్రయాస నిష్ఫలంగా మారితుంది. ట్రయల్ కోర్టు తీర్పులో మేం జోక్యం చేసుకునే విధంగా అప్పీలుదారులు ఒక్క కారణాన్ని కూడా చూపలేకపోయారు. ఇక మరణ శిక్షను ఖరారు చేయడం తప్ప మరో అవకాశం లేకుండాపోయింది. అందుకే.. ఐదుగురికి మరణ శిక్షను ఖరారు చేస్తున్నాం" అని వ్యాఖ్యానించింది. దోషులకు ఎలాంటి ఖర్చు లేకుండా ధ్రువీకరించిన తీర్పు కాపీలను అందజేయాలని ఆదేశించింది. 30 రోజుల్లో సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేలా దోషులకు వెసులుబాటు కల్పించింది.



పేలుడు జరిగింది ఇక్కడే

ఏ1 మిర్చీ సెంటర్ వద్ద సంబురాలు

హైకోర్టు తీర్పు నేపథ్యంలో మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు ఘటనా స్థలిలో హడావుడి నెలకొంది. దోషులకు ఏ శిక్ష పడుతుందా? అని అప్పటి వరకు నిరీక్షించిన బాధితులు, నాటి ప్రత్యక్ష సాక్షులు ఉత్కంఠతో ఎదురు చూశారు. మరణ శిక్ష ఖరారవ్వగానే సంబురాలు జరుపుకొన్నారు. మృతుల ఆత్మశాంతికి నివాళులర్పించారు. ఆ తర్వాత.. దోషులకు మరణ శిక్ష సరైందేనంటూ ఏ1 మిర్చీ సెంటర్ వద్ద మిఠాయిలు పంచుకున్నారు. యువజన కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, కార్యకర్తలు కూడా ఏ1 మిర్చీ పాయింట్ వద్దకు చేరుకుని, మిఠాయిలు పంచిపెడుతూ.. తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు, రాష్ట్రపతి క్షమాభిక్ష అంటూ జాప్యం జరుగకుండా తక్షణమే దోషులను ఉరితీయాలని ప్రవీణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాగా.. ఈ ఘటన జరిగి పన్నెండేళ్లయినా.. ఇంకా ఆ బీభత్సం కళ్ల ముందే కదలాడుతోందని బాధితులు మీడియాకు చెప్పారు. మృతుల కుటుంబ సభ్యులైతే.. ఆ చేదు జ్ఞాపకాల నుంచి ఇంకా బయటకు రాలేకపోతున్నామన్నారు. కొందరు క్షతగాత్రులకు ఒంటిపై అయిన గాయాలు తగ్గినా.. మానసిక గాయాల నుంచి కోలుకోలేకపోతున్నారు. ఇప్పటికీ అదో పీడకలగా వెంటాడుతోందని చెబుతున్నారు.

ఇప్పటికీ ప్రభుత్వ సాయం అందలేదు



బాంబు పేలుడు జరిగిన రోజు ఛాయ్ వడబోసే బట్టను కొనేందుకు దిల్‌సుఖ్‌నగర్ వెళ్లాను. అప్పుడే బాంబు పేలి.. నా మోకాళ్ల కింది భాగంలో ఏడు గాయాలయ్యాయి. కుక్కర్ ముక్కలు లోనికి చొచ్చుకుపోయాయి. అప్పట్లో ప్రభుత్వం రూ.50 వేలు ఇచ్చింది. కానీ, వైద్యానికి రెండింతలు ఖర్చయింది. ఆ తర్వాత బాధితులకు సాయం ప్రకటించినా.. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా అందలేదు. అసలు మా పరిస్థితి ఎలా ఉందని పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పటికీ కాళ్ల నొప్పులతో హోటల్ నడుపుకొంటున్నా.

- బాధితుడు అజ్మతుల్లా, మలక్‌పేట్

దర్యాప్తులో ఆధారాల సేకరణ.. ఫలితం



పేలుడు జరిగిన నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకున్నా. రక్తపుమడుగులో కొందరు విగతజీవులుగా పడి ఉంటే.. మరికొందరు హాహాకారాలు చేయడం కలచివేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వెంటనే దర్యాప్తు ప్రారంభించాం. సాంకేతిక ఆధారాలను సేకరించాం. అయితే.. ఇది ఉగ్రచర్య కావడంతో.. కేసును ఎన్ఐఏకి బదిలీ చేశాం. ప్రాథమిక దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు దోషులకు శిక్ష పడడానికి దోహదపడింది.

- అర్కపల్లి ఆంజనేయులు, కేసు మొదటి విచారణ అధికారి(ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్)

ఇప్పటికీ చెవులు వినబడడం లేదు



దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు సమయంలో అక్కడే ఉన్నాను. పేలుడు శబ్దానికి వినికిడి శక్తిని కోల్పోయాను. వారం రోజులు ఆస్పత్రిలో చికిత్స చేశారు. ఆ తర్వాత పరిస్థితి కొంత మెరుగైనా.. ఇప్పటికీ చెవులు సరిగా వినబడడం లేదు. ఆ రోజు జరిగిన పేలుడును తలచుకుంటే.. ఇప్పటికీ భయం వేస్తుంది. ఆ దారుణం వల్ల ఆరోగ్యం దెబ్బతిని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా.

- బక్కారెడ్డి, క్షతగాత్రుడు

వెంటనే ఉరితీయాలి



2007లో జరిగిన గోకుల్ చాట్ బాంబు పేలుడులో గాయపడ్డాను. అప్పట్లో ఎందరో నేతలు హామీలిచ్చారు. ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేశారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో సహాయం అందలేదు. దిల్‌సుఖ్‌నగర్ కేసులో దోషులు సుప్రీంకోర్టుకు వెళ్లక ముందే.. వారిని ఉరితీయాలి.

- రహీం, గోకుల్ చాట్ పేలుడు బాధితుడు

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



18 మంది మరణానికి కారణమైన వారికి ఉరిశిక్షే సరైంది. 2016లోనే ఎన్ఐఏ కోర్టు మరణ శిక్ష విధించింది. హైకోర్టు ఇప్పుడు తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు.. రాష్ట్రపతి క్షమాభిక్ష పిటిషన్‌తో ఇంకా ఆలస్యమవుతుంది. దోషులు చట్టంలోని వెసులుబాట్లను వాడుకుంటున్నారు. బాధితుల గోడును మాత్రం ఇప్పటి వరకూ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పట్లో గాయపడ్డ నన్ను ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స చేయించి.. ఇంటికి పంపారు. మళ్లీ మావైపు కన్నెత్తి చూడలేదు.

- బాధితుడు యాదయ్యగౌడ్, బడంగ్‌పేట్

అదో పీడ కల



దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటనను నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేను. అదో పీడ కలగా నన్ను వెంటాడుతోంది. పేలుడు ధాటికి తీవ్రంగా గాయపడ్డా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాకు ఎలాంటి సహాయం చేయలేదు. ఇప్పటికీ సర్కారు సాయం కోసం ఎదురుచూస్తున్నా.

- దుర్గాప్రసాద్, చింతూరు, అల్లూరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

సానుభూతి చూపగలం.. న్యాయపరంగా అంగీకరించలేం

మాకున్న విశేషాధికారాలతో అక్రమాన్ని సక్రమమనలేం

» రెండ్రోజుల పసిగుడ్డును కొన్నారు.. ఇదెక్కడి మానవత్వం

» దత్తత పేరుతో చట్టవిరుద్ధంగా పిల్లల కొనుగోలు వ్యవహారంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

» తదుపరి విచారణ మే 7కు వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దత్తత పేరుతో చట్టవిరుద్ధంగా పిల్లలను కొనుగోలు చేసిన వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రెండ్రోజుల పసిగుడ్డును కొనుగోలు చేసి ఎలా దత్తత తీసుకుంటారని, ఇదెక్కడి మానవత్వమని ప్రశ్నించింది. నిజానికి ఆ పిల్లలను దత్తత తీసుకున్నవారిగా భావించలేమని, కొనుక్కున్నారని స్పష్టం చేసింది. ఆ పిల్లలు, పెంపుడు తల్లిదండ్రుల పట్ల సానుభూతి చూపగలమని, అంతేతప్ప న్యాయపరంగా అంగీకరించలేమని పేర్కొంది.

క్లినిక్ ముసుగులో పిల్లల విక్రయాలతో..

రాచకొండ మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీర్జాదిగూడలో శోభారాణి అనే మహిళ ఓ క్లినిక్ ముసుగులో చిన్న పిల్లలను సంతానం లేని దంపతులకు విక్రయించేది. ఈ విషయం తెలిసిన కొందరు విలేకరులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆ క్లినిక్‌కు వెళ్లి ఓ ఆడ శిశువును తీసుకుంటామని చెప్పి రూ.4.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. కొందరు పిల్లల ఫొటోలను తీసుకున్నారు. ఈ వివరాలతో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు అప్పటికే విక్రయించిన 15 మంది చిన్నారులను గుర్తించి శిశుసంరక్షణ కమిటీకి అప్పగించారు. దీనిపై పిల్లల పెంపుడు తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ బెంచ్ వారికి అనుకూలంగా ఆదేశాలు ఇవ్వగా, డివిజనల్ బెంచ్‌లో వ్యతిరేక తీర్పు వచ్చింది. దీంతో పెంపుడు తల్లిదండ్రులు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. తొలుత పిటిషనర్ల తరపు న్యాయవాది శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు పిల్లలు లేకపోవడంతో ఆ శిశువులను దత్తత తీసుకున్నారని, రెండేళ్లలో వారి మధ్య మానసిక అనుబంధం పెరిగిందని వివరించారు. సుప్రీంకోర్టుకు ఉన్న విశేషాధికారాలతో పిల్లలను పెంపుడు తల్లిదండ్రులకు ఇప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం తమ విశేషాధికారాలతో అక్రమాన్ని సక్రమమని చెప్పలేమని పేర్కొంది. కేసు విచారణను వచ్చే నెల 7కు వాయిదా వేసింది.

గ్యాస్ ధరల పెంపుపై నేడు వామపక్షాల నిరసన

హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్ల మీద 50 రూపాయలు పెంచడం దారుణమని వామపక్ష నేతలు అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధర తగ్గించి ఇవ్వాల్సింది పోయి బీజేపీ ప్రభుత్వం ధరలు ఇంకా పెంచడం దారుణమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు.

సమ్మెపై సంఘాల తలోదారి!

ఆర్టీసీలో ఏకతాటిపైకి రాని ప్రధాన సంఘాలు.. మే 6 అర్ధరాత్రి నుంచి సమ్మెకు జేఏసీ పిలుపు

» ఏకపక్షంగా పిలుపునిచ్చారంటున్న మరో జేఏసీ

» వారికి ఉద్యోగుల మద్దతు లేదన్న అశ్వత్థామరెడ్డి

» ప్రధాన సంఘాల మద్దతు కోరలేదని వెల్లడి

» సమ్మెపై నోరు మెదపని ప్రభుత్వం, యాజమాన్యం

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ)లో సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన సమ్మె విషయంలో కార్మిక సంఘాలు తలోదారిలో పయనిస్తున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు 21 ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి జేఏసీ మే 6 అర్ధరాత్రి నుంచి సమ్మెకు పిలుపునివ్వడం తెలిసిందే. అయితే దీనిని ఇతర సంఘాలు, మరో జేఏసీ తప్పుబడుతున్నాయి. సమ్మెకు పిలుపునిచ్చిన వారు ఆర్టీసీలోని అన్ని సంఘాల మద్దతును కూడగట్టలేదని, ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని అంటున్నాయి. ఆర్టీసీలో సుమారు 43 వేల మంది కార్మికులు, 11 సంఘాలు ఉండగా.. ప్రస్తుతం సమ్మెకు పిలుపునిచ్చిన జేఏసీకి 7 సంఘాల మద్దతు ఉంది. అయితే సంఖ్యాపరంగా ఎక్కువ సంఘాలు కనిపిస్తున్నప్పటికీ.. ఉద్యోగుల మద్దతు వారికి లేదని మరో జేఏసీ చైర్మన్ అశ్వత్థామ రెడ్డి అన్నారు. పేరుకు ఏడు సంఘాలు ఉన్నట్లు చెబుతున్నా.. అందులో రెండు సంఘాల్లో కేవలం నాయకులిద్దరు తప్ప.. ఎవరూ లేరన్నారు. మరో సంఘంగా చెప్పుకొంటున్న వారి వెంట వంద మంది కార్మికులు కూడా లేరని తెలిపారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలు సమ్మెకు మద్దతివ్వడం వెనక మతలబేంటో అర్థం చేసుకోవాలన్నారు. ఒకటి, రెండు సంఘాలు కేవలం ఉనికి కోసమే ఆరాట పడుతున్నాయని విమర్శించారు. ఆర్టీసీలో 25 వేల మంది ఉద్యోగుల మద్దతు తమకే ఉందన్నారు. సమ్మెకు సంబంధించి జేఏసీ నుంచి ఇప్పటివరకు తమకు ఎలాంటి సమాచారం లేదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి ఉంటే అన్ని సంఘాలతో కలిసి పనిచేయాలని సూచించారు. ఏకపక్ష నిర్ణయాలతో కార్మికులకు మేలు జరగదన్నారు. 2019లో ఇదే జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చిందని, ఇప్పుడు మరోసారి కార్మికులను మభ్యపెడుతోందని ఆరోపించారు.

మహిళా, ప్రజా సంఘాల మద్దతు కూడగడతాం..

సమ్మె తేదీ ప్రకటించాక కూడా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని, ఈ నేపథ్యంలో.. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మె అనివార్యమయిందని జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మెను విజయవంతం చేసేందుకు మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు కూడగడతామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో పెద్ద ఉద్యమాన్ని చూడబోతుందని ప్రకటించారు. సమ్మె నోటీస్ ఇచ్చిన తర్వాత కూడా చర్చలకు ఆహ్వానించకుండా తమను తక్కువగా అంచనా వేశారన్నారు. ఉద్యమాలు, నిరసనలు వద్దని, నేరుగా వచ్చి కలవాలని, సమస్యల్ని పరిష్కరించుకుందామని పదే పదే చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికుల విషయంలో ఎందుకు చర్చలకు పిలవడం లేదని ప్రశ్నించారు. అయితే ఎప్పుడూ అప్పులు, అవస్థల్లో ఉండే ఆర్టీసీ.. ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని ఆర్టీసీ అధికారులు అన్నారు. ఇలాంటి సమయంలో సమ్మెకు పిలుపునివ్వడం సరైంది కాదన్నారు. సమ్మె విషయంలో ఆర్టీసీ యాజమాన్యం తరఫున ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

ఇందిరా పార్కు వద్ద దీక్షలో ఎమ్మెల్సీ కవిత

కవాడిగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఈ నెల 11న ఆయన జయంతి సందర్భంగా ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా పార్కు వద్ద దీక్ష చేపట్టారు. దీక్షలో న్యాయవాదులు, డాక్టర్లు, మేధావులు, కార్మికులు పాల్గొన్నారు. కవిత మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చాలా ప్రమాదమని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, ఏఐ అంటే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాదని, ఎనుముల ఇంటెలిజెన్స్ అని ఆమె పేర్కొన్నారు. ఎనుముల ఇంటెలిజెన్స్‌తోనే రాష్ట్రానికి ప్రమాదం ఉందని ఆమె ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను పెంచుతూ బిల్లు ఆమోదించి నాలుగు వారాలైందని, అది గవర్నర్ వద్దే పెండింగ్‌లో ఉందా, లేక రాష్ట్రపతికి పంపించారా అనే విషయం ప్రజలకు తెలియజేయాలని ఆమె డిమాండ్ చేశారు. బిల్లులు ఆమోదం పొందిన తర్వాత అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళతామని సీఎం చెప్పారని, కానీ బీజేపీని కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదన్నారు. దానికి బదులుగా ఢిల్లీలో తుఫేల్ ధర్నా చేశారని, దానికి రాహుల్ గాంధీ వస్తారని చెప్పినా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బీజేపీ డీఎన్ఏలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలపై వ్యతిరేకత ఉందన్నారు.

పూలే విగ్రహం పేరిట కవితది డ్రామా: మల్లు రవి

» లిక్కర్ స్కాం మరకలు తుడిచేసుకునేందుకే..: ఆది శ్రీనివాస్

» కవిత దీక్ష చేయడం సిగ్గుచేటు: జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్/కవాడిగూడ/బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు, పూలే విగ్రహం పేరిట డ్రామా చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు.. అసలు పూలే పేరు ఎత్తే అర్హత ఉందా అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో సామాజిక న్యాయం 200% అమలవుతోందన్నారు. నియంత పాలనను తుడిచేసి.. ప్రగతి భవన్‌కు జ్యోతిబా పూలే ప్రజాభవన్‌గా నామకరణం చేసిన ఘనతా రేవంత్‌దేనని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జైలుకు వెళ్లి వచ్చాక బీఆర్ఎస్‌లో తన స్థానం కోసం ఎమ్మెల్సీ కవిత అనేక విన్యాసాలు చేస్తున్నారని, లిక్కర్ స్కామ్ మరకలు తుడిచేసుకోవడానికి నానా పాట్లు పడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. అసలు పూలే పేరును ఎత్తే అర్హత కవితకు ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. తీహార్ జైలు నుంచి వచ్చిన తర్వాత బయట కనిపించేందుకు ఏదో ఒకటి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పూలే గురించి ఆమె ఇప్పుడు మాట్లాడుతున్నారని, కేసీఆర్ కట్టిన రాజభవనం కంచెను కూల్చి దానికి జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా పేరు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నది తెలుసుకోవాలన్నారు. అంబేడ్కర్, పూలే లాంటి మహనీయుల గురించి మాట్లాడే నైతిక హక్కు కవితకు లేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత పిడమర్తి రవి విమర్శించారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో కవిత దీక్ష చేసిన స్థలాన్ని పిడమర్తి ఆధ్వర్యంలో ఫినాయిల్‌తో శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని కవిత దీక్ష చేయడం సిగ్గుచేటు అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పూలే ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు. పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా బీసీ కుల సంఘాలకో చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్‌ను నియమిస్తూ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయం సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో పూలే స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆహార భద్రతా అధికారులకు టార్గెట్లు

- ఇక ప్రతి నెలా 25 శాంపిళ్లు తీయాల్సిందే
- నమూనాల పరీక్షల సంఖ్య భారీగా పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలో ఆహారభద్రతా ప్రమాణాల విషయాన్ని ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించింది. ఆహార ఉత్పత్తులు, హోటళ్లలో తీసే నమూనాల సంఖ్యను మరింత పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆహార భద్రతా అధికారుల (ఎఫ్ఎ్ఎస్ఓ)కు టార్గెట్లను విధించింది. ఇక ప్రతి ఆహార భద్రతా అధికారి తన పరిధిలో విధిగా ప్రతి నెలా 25 శాంపిళ్లను తీయాలని తేల్చి చెప్పింది. మంగళవారం ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ గ్రేటర్ హైదరాబాద్ జోనల్ కమిషనర్లతో ఆహారభద్రతా ప్రమాణాలపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లో ఆహార భద్రతా అధికారులు నెలకు అరకొరగా ఐదారు శాంపిళ్లనే తీస్తున్నట్లుగా గుర్తించి వారికి ప్రతినెలా 25 నమూనాలు తీసి, పరీక్షలకు పంపాలని టార్గెట్‌ను పెట్టారు. 2023-24లో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 6,156 నమూనాలను సేకరించగా, అందులో 16 శాతం శాంపిళ్లను కల్తీగా గుర్తించారు. ఆ సంఖ్యను మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, ఆహార భద్రతా విభాగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు కమిషనర్ కర్ణన్ వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరుజోన్లలో ఆరు మినిల్యాబులను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ప్రదేశాలను వెంటనే గుర్తించాలని కమిషనర్ ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో పెరుగుతోన్న ఆహార వ్యాపార వ్యవహారాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ విభాగాలను నేరుగా పర్యవేక్షించే అధికారాన్ని కూడా జోనల్ కమిషనర్లకే అప్పగిస్తున్నట్లు ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలియజేశారు.

ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరగాలి

- వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరగాలని, రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గుచూపేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అధికారులకు సూచించారు. ఉద్యాన పంటల సాగుకు అవసరమయ్యే యంత్ర పరికరాలను సబ్సిడీపై ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని గడ్డమల్లయ్యగూడెం, చౌదరి గూడ, మొండి గౌరెల్లి గ్రామాలను ఎంపిక చేసినట్లు అధికారులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించేందుకు రైతులకు ఏంకావాలో గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో వర్షపాతం, నీటి వనరులు తక్కువగా ఉన్న నేపథ్యంలో తక్కువ నీటితో సాగుచేసే పంటల సాగుపై దృష్టిసారించాలన్నారు.

ఫార్మాసిటీ భూముల చుట్టూ ఇనుప కంచె

యాచారం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు హద్దులను గుర్తించి ఇనుపకంచెను నాటే పనుల్లో టీజీఐఐసీ అధికారులు నిమగ్నమయ్యారు. మంగళవారం నానక్‌నగర్, తాటిపర్తి గ్రామాల మధ్య జరుగుతున్న పనులను రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు పర్యవేక్షించారు. కోర్టు స్టే ఉన్న భూముల జోలికి వెళ్లరాదని సిబ్బందికి సూచించారు. సర్వేలో భారీ బండరాళ్లు అడ్డు వస్తే వాటికి డ్రిల్లింగ్ చేసి ఇనుపరాడ్లు వేసి తక్షణమే కాంక్రీట్ వేసి బిగించాలన్నారు. యాచారం కందుకూరు మండలాల మధ్య 120 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయని వారు చెప్పారు. సేకరించిన భూముల్లో పంటలుంటే పంట కోసే వరకు రైతులకు ఇబ్బంది కలిగించబోమన్నారు. ఈ పనులకు సుమారు రూ.16 కోట్ల మేర వ్యయం కావచ్చని జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో చెప్పారు.

రూ.2000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2000 కోట్ల అప్పు తీసుకుంది. 6.87 శాతం వార్షిక వడ్డీ, 22 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 6.87 శాతం వార్షిక వడ్డీ, 30 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్ల చొప్పున ఈ రుణాన్ని తీసుకుంది. రాష్ట్రంతో కలిపి దేశంలోని మూడు రాష్ట్రాలు రూ.3,500 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి.

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

విద్యుత్ సంస్థల్లో కీలకమైన డైరెక్టర్ల నియామక ప్రక్రియ ఊపందుకుంది. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా నేతృత్వంలోని ఎంపిక కమిటీ బుధవారం ఉదయం దక్షిణ డిస్కమ్(టీజీఎస్పీడీసీఎల్)కు, మధ్యాహ్నం ఉత్తర డిస్కమ్(టీజీఎన్పీడీసీఎల్) డైరెక్టర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. గురువారం జెన్‌కో, ట్రాన్స్‌కో డైరెక్టర్ల కోసం ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ముగ్గురి పేర్లతో షార్ట్ లిస్ట్‌ను తయారు చేసి ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది.

కేంద్ర సర్వీసులకు ఇద్దరు మహిళా ఐఏఎస్‌లు!

రాష్ట్రంలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఐఏఎస్ అధికారులు త్వరలో కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నారు. ఐఏఎస్‌లు దాసరి హరిచందన, అలుగు వర్షిణి కేంద్రానికి వెళ్లేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం రావడంతో పాటు కేంద్రప్రభుత్వం ఈ ఇద్దరు అధికారులను ఏ శాఖలోకి తీసుకోవాలనే అంశంపై స్పష్టత రాగానే ఇరువురు కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నారు. హరిచందన.. ప్రస్తుతం రోడ్లు, భవనాలశాఖకు ప్రత్యేక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవలే ఆమె నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ)కి డైరెక్టర్ జనరల్ (డీజీ)గా, రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇక అలుగు వర్షిణి, ప్రస్తుతం ఎస్సీ గురుకులం కార్యదర్శిగా ఉన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లకూ రెండేళ్లకోసారి టెండర్లు పిలవాలి

- తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్

పంజాగుట్ట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బార్ అండ్ రెస్టారెంట్లకూ లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా ప్రతీ రెండేళ్లకు ఒకసారి టెండర్లు పిలిచి ఎక్కువ పాడిన వారికి కేటాయించాలని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మద్యం దుకాణాలకు ప్రతీ రెండేళ్లసారి టెండర్లు పిలిచి అనుమతి ఇస్తున్నారని చెప్పారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మద్యం దుకాణాల వలన తాము నష్టపోతున్నామని బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లలో మద్యం సీసా నుంచే మద్యం విక్రయాలు జరగాల్సి ఉండగా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంలో నిప్, క్వార్టర్, హాఫ్ బాటిళ్లలో విక్రయాలు చేస్తుండడంతో మద్యం దుకాణాలలో సేల్స్ 20శాతం పడిపోయాయని పేర్కొన్నారు.

విద్యారంగంపై సీఎం రేవంత్‌కు ప్రత్యేక శ్రద్ధ

- వర్సిటీల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీకి మార్గదర్శకాల విడుదల శుభపరిణామం: కేకే

బంజారాహిల్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులలో 50 శాతం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడం.. విద్యారంగంపై ఆయనకున్న శ్రద్ధను సూచిస్తున్నదని ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు(కేకే) అన్నారు. రాష్ట్రంలో ఏ రంగంలో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవడం ముఖ్యమంత్రి ప్రత్యేకత అని కొనియాడారు. వర్సిటీల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలూ విడుదల కావడం శుభపరిణామమని పేర్కొన్నారు.

22 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం 22 మంది మావోయిస్టులు జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ ముందు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోవాలన్నారు. మంగళవారం 22 మంది లొంగిపోయారని, జిల్లాలో జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో వీరు నిందితులన్నారు. వీరిలో పీఎల్‌జీఏ, తెలంగాణ రాష్ట్ర కమిటీ, ఏరియా కమిటీల సభ్యులు ఉన్నారని, ఈ అందరిపై రూ.26 లక్షల రివార్డు ఉందన్నారు.

సబర్మతిలో నూలు వడికిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఏఐసీసీ విస్తృత సమావేశాల్లో పాల్గొనేందుకు మంగళవారం అక్కడికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. మహాత్మాగాంధీ సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడ చరఖాపైన కొద్ది సేపు నూలు వడికారు. ఈ విస్తృత సమావేశాల్లో సీఎంతో పాటుగా డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహా.. తెలంగాణకు చెందిన ఏఐసీసీ కార్యదర్శులు, సభ్యులు తదితరులు 41 మంది వరకూ పాల్గొన్నారు. భట్టివిక్రమార్కతో కలిసి సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్.. అగ్రనేతలతో కలిసి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ మెమోరియల్ సెంటర్ వద్ద జరిగిన ఫొటో సేషన్‌లోనూ పాల్గొన్నారు.

పేద బిడ్డల విద్యపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. క్షమించరాని నేరం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్
- 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ట్యాగ్ చేసిన సీఎం

హైదరాబాద్, ఏప్రిల్, 8 (ఆంధ్రజ్యోతి): పేద బిడ్డల విద్యపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం క్షమించరాని నేరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని.. గడిచిన 15 ఏళ్లుగా ఈ ప్రక్రియ జరగకపోవడం ఒకింత ఆశ్చర్యాన్ని, విస్మయాన్ని కలిగించిందంటూ ఎక్స్ వేదికగా సీఎం మంగళవారం ట్వీట్ చేశారు. 'వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనాన్ని ట్వీట్‌కు జత చేశారు. ప్రతి వ్యవస్థలో జరిగిన ఇలాంటి తప్పిదాలను గుర్తిస్తూ, సరిచేస్తూ.. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర పునర్ నిర్మాణం దిశగా అడుగులు వేస్తోందని ట్వీట్‌లో స్పష్టం చేశారు.



వాణిజ్య పన్నుల రాబడి ₹75,149 కోట్లు

గతేడాది కంటే ఈసారి 7.2శాతం వృద్ధి

- 2025-26 లక్ష్యం రూ.89,368 కోట్లు.. వాణిజ్య పన్నుల శాఖ వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల వసూళ్లలో ఈసారి 7.2 శాతం వృద్ధి నమోదైంది. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య పన్నుల కింద మొత్తం రూ.75,149 కోట్లు వసూలయ్యాయి. వాణిజ్య పన్నుల శాఖ మంగళవారం ఓ ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించింది. 2022-23లో రూ.70,636 కోట్లు, 2023-24లో రూ.70,721 కోట్ల వాణిజ్య పన్నుల రాబడి వచ్చిందని తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తమ శాఖ ఆదాయ వృద్ధి దిశగా స్పష్టమైన మలుపు తీసుకుందని పేర్కొంది. గత కొన్నేళ్ల జడత్వాన్ని అధిగమించి, ఈసారి పురోగతి సాధించామని తెలిపింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదాయ పతనాన్ని సమర్థంగా అడ్డుకుని, పునరుద్ధరణకు బలమైన పునాది వేసిందని పేర్కొంది. ఆ దిశగా పలు పురోగమన, సంస్కరణాత్మక చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఫలితంగానే 2024-25లో వసూళ్లు రూ.75,149 కోట్లకు చేరాయని, 7.2 శాతం వృద్ధి నమోదైందని వివరించింది. జీఎస్టీ డిమాండ్లు, రికవరీ విధానాన్ని బలోపేతం చేయడం, పన్ను వసూళ్లలో మెరుగైన పద్ధతులను అవలంబించడం, నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టడానికి నిరంతరం తనిఖీలు చేపట్టడం వంటి చర్యల వల్ల ఈ వృద్ధి సాధ్యమైందని తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.89,368 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపింది.

జీఎస్టీ వసూళ్లు యథాతథం

వాణిజ్య పన్నుల్లో భాగమైన జీఎస్టీ కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.58,594.91 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసుకోగా రూ.53,338.90 కోట్ల ఆదాయం సమకూరింది. 2024 మార్చితో పోలిస్తే ఈసారి జీఎస్టీ వృద్ధిరేటు యథాతథంగా ఉంది. గత ఏడాది మార్చిలో రూ.5,399 కోట్లు జీఎస్టీ వసూలుకాగా.. ఈసారి రూ.5,401 కోట్లు వసూలైంది. ఎలాంటి పెరుగుదల నమోదు కాలేదు.

రాష్ట్రంలో జీఎస్టీ వృద్ధి జీరో: హరీశ్

రాష్ట్రంలో మార్చి నెలలో జీఎస్టీ వృద్ధి సున్నాకు పడిపోవడం కాంగ్రెస్ సర్కార్ వైఫల్యానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దేశవ్యాప్తంగా సగటు జీఎస్టీ వృద్ధిరేటు 10శాతం ఉండగా.. తెలంగాణ బాగా వెనుకబడిపోయిందని మంగళవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం కేవలం 5.1 శాతం వృద్ధి మాత్రమే సాధించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జీఎస్టీ వృద్ధి 12.3 శాతంగా ఉందని శాసనసభలో ప్రకటించడం శోచనీయమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర జీఎస్టీ వృద్ధి రేటు 5.5 శాతానికి పరిమితమవుతుందని తాము హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇలా వృద్ధి రేటు క్రమంగా తగ్గడానికి గత 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణమని ఆరోపించారు.

రాష్ట్రంలో నెలవారీగా జీఎస్టీ వసూళ్లు (రూ.కోట్లలో)

నెల	2023-24	2024-25	వృద్ధిరేటు (శాతం)
ఏప్రిల్	5622	6236	11.00
మే	4507	4986	11.00
జూన్	కేంద్రం విడుదల చేయలేదు		
జూలై	4849	4940	2.00
ఆగస్టు	4393	4569	4.00
సెప్టెంబరు	5226	5267	1.00
అక్టోబరు	4868	5211	7.00
నవంబరు	4986	5141	3.00
డిసెంబరు	4753	5224	10.00
జనవరి	5,448 (2024లో)	6,017 (2025లో)	10.00
ఫిబ్రవరి	5,211 (2024లో)	5,280 (2025లో)	1.00
మార్చి	5,399 (2024లో)	5,401 (2025లో)	0.00

సిట్ చేతికి శ్రవణ్‌రావు ఫోన్లు

మూడోసారి విచారణకు హాజరైన శ్రవణ్ రావు

- 2 ఫోన్లు దర్యాప్తు అధికారులకు అందజేత
- పది గంటలకు పైగా సాగిన విచారణ
- చాలా ప్రశ్నలకు మౌనమే సమాధానం

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ రావు.. ఫోన్‌ట్యాపింగ్ జరిగిందన్న సమయంలో తాను వినియోగించిన రెండు సెల్‌ఫోన్లను దర్యాప్తు అధికారులకు సమర్పించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్‌రావు మంగళవారం సిట్ విచారణకు హాజరయ్యారు. సిట్ అధికారులు ఆయన్ను ప్రశ్నించడం ఇది మూడోసారి. అయితే, ఈ కేసులో కీలకంగా భావిస్తున్న తన రెండు సెల్‌ఫోన్లను శ్రవణ్‌రావు.. దర్యాప్తు అధికారి, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి సమర్పించారు. మంగళవారం ఉదయం 11 గంటలప్పుడు విచారణకు హాజరైన శ్రవణ్‌రావును దర్యాప్తు అధికారులు పది గంటలకు పైగా వివిధ అంశాలపై ప్రశ్నించారు. చాలా ప్రశ్నలకు శ్రవణ్‌రావు సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉన్నట్టు తెలిసింది. కాగా, నాటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఆయన సన్నిహితులు, వారితో తరచూ మాట్లాడేవారి ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ నిమిత్తం ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు అందజేసిన విషయంపై దర్యాప్తు అధికారులు శ్రవణ్‌రావును ప్రశ్నించినట్టు తెలిసింది. వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ చేసి వారిని బెదిరించి శ్రవణ్‌రావు, ప్రణీత్‌రావు పెద్దమొత్తంలో డబ్బు సంపాదించారనే ఆరోపణలపైనా ప్రశ్నించారని సమాచారం. అలాగే, హవాలా వ్యాపారులు, బంగారు ఆభరణాల వ్యాపారులకు సంబంధించిన ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయించారు? ఆయా నెంబర్లను ప్రణీత్‌రావుకు మీరే ఇచ్చారా? ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అని కూడా ప్రశ్నించారు. ఆయా ప్రశ్నలకు శ్రవణ్‌రావు మౌనం వహించారని సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కోసం మీ కార్యాలయం, ఇల్లు ఎందుకు ఇచ్చారు? పరికరాల కొనుగోలుకు సంబంధించి ఖర్చుపెట్టిన డబ్బు మీ సొంతమా? మరెవరైనా ఇచ్చారా? అనే ప్రశ్నలు వేస్తూ కొన్ని బ్యాంకు లావాదేవీలకు సంబంధించి దర్యాప్తు అధికారులు ఆయనను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు మంత్రులకు, మీకూ ఏ విధమైన సంబంధాలు ఉన్నాయి? ఆ పెద్దల ఆదేశాల మేరకే మీరు ట్యాపింగ్‌కు పాల్పడ్డారా? అనే ప్రశ్నలకూ శ్రవణ్ సరైన సమాధానాలివ్వలేదని తెలుస్తోంది. శ్రవణ్‌విచారణకు సహకరించని క్రమంలో.. విచారణ వివరాలను సుప్రీంకోర్టుకు తెలియజేసి ఆయనపై చట్టపరమైన చర్యలకు వెళ్లాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. అయితే, విచారణకు సహకరించని పక్షంలో తామే చర్యలు తీసుకుంటామనే విషయాన్ని ఓ దర్యాప్తు అధికారి శ్రవణ్‌రావుకు వివరించారని, ఆ తర్వాతే ఆయన కొద్దిగా సమాధానాలు చెబుతున్నారని అంటున్నారు. అయితే, పెద్దల పాత్ర విషయంలో మాత్రం శ్రవణ్‌రావు సహకరించడం లేదని సమాచారం.

రిజిస్ట్రేషన్లకు.. రేపటి నుంచే స్లాట్ బుకింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వల్ల జరిగే జాప్యాన్ని నివారించడానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని రోజువారీ పనివేళలను 48 స్లాట్‌లుగా విభజించారు. ప్రజలు నేరుగా ట్యుఋట్టట్బుజ్బ్బుజ్బుబ్బు.జౌ౭.జీ వెబ్ సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయాన్ని ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేసుకునే వెసులబాటు కల్పించారు. తమకు కేటాయించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెళ్లిపోవచ్చు. స్లాట్ బుక్ చేసుకోలేని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాల్లో రోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు 5 వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో ఈ రిజిస్ట్రేషన్ చేస్తారు. ప్రజలకు సులువుగా, వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా సమర్థవంతమైన సేవలందించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దుతున్నామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తొలుత ఈ కేంద్రాల్లోనే..

స్లాట్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న 22 కేంద్రాలు హైదరాబాద్‌లో ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట, మేడ్చల్ జిల్లాలో కుత్బుల్లాపూర్ వల్లభ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో శంషాబాద్, సరూర్‌నగర్, చంపాపేట ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో రామగుండం, ఖమ్మం జిల్లాలో కూసుమంచి, ఖమ్మం ఆర్వో, మహబూబ్‌నగర్ ఆర్వో ఉన్నాయి. అలాగే జగిత్యాల, నిర్మల్, వరంగల్ పోర్ట్, వరంగల్ గ్రామీణ, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్, నాగర్ కర్నూల్ కేంద్రాల్లో ఈ విధానం అందుబాటులోకి రానుంది. ఈ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ లేకుండా రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారిని అనుమతించరు. రోజుకు 40కిపైగా రిజిస్ట్రేషన్లు జరిగే కేంద్రాలనే స్లాట్ బుకింగ్ ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఎంపిక చేశారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు అయ్యే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి 48 స్లాట్ల కన్నా ఎక్కువ అవసరం ఉంటే.. అలాంటి చోట్ల అదనపు సిబ్బందిని నియమిస్తారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అదనంగా మరో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను నియమించారు. తద్వారా ఈ కార్యాలయంలో 144 స్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇక రిజిస్ట్రేషన్‌కు ముందు ఈసీ పరిశీలన తప్పనిసరి చేయడానికి.. రిజిస్ట్రేషన్ చట్టంలో సెక్షన్ 22కు సవరణ చేసి 22(బి) తీసుకురావాలని ప్రతిపాదించారు. ఈ అంశం ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉంది. క్యాబినెట్ అనుమతి తరువాత దీనిని అసెంబ్లీ సమావేశాల్లో పెట్టి.. గవర్నర్ ఆమోదం అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు.



చౌమహల్లా ప్యాలెస్ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన పర్యాటక శాఖ కార్యదర్శి స్మిత సబర్వాల్

అదిరేలా అందాల పోటీలు

- హైదరాబాద్‌కు తరలిరానున్న 120 దేశాల మోడల్స్
- చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌమహల్లా ప్యాలెస్ లో వెల్కమ్ డిన్నర్
- ఏర్పాట్లపై స్మిత సబర్వాల్ సమీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ టూరిజం బ్రాండ్ పెరిగేలా, తెలంగాణ ఆతిథ్యానికి వన్నె తెచ్చే విధంగా మిస్ వరల్డ్ పోటీలు ఉండాలని తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మిత సబర్వాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 7 నుంచి 31 వరకు తెలంగాణ పర్యాటక శాఖ నేతృత్వంలో జరగబోయే మిస్ వరల్డ్ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పోటీల్లో పాల్గొనే 120 దేశాలకు చెందిన మోడల్స్ వచ్చే నెల ఆరు, ఏడో తేదీల్లో హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌమహల్లా ప్యాలెస్‌లో వెల్కమ్ డిన్నర్ ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లపై టూరిజం, జీహెచ్ఎంసీ, హెరిటేజ్, పోలీస్ అధికారులతో కూడిన బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ మోడల్స్ తో పాటు పలు దేశాలకు చెందిన సుమారు 400 మంది ఫొటోగ్రాఫర్లు, మీడియా ప్రతినిధులు కూడా రానుండడంతో ఆరంభం నుంచి చివరి వరకు పర్యాటక ప్రత్యేకతలు చాటేలా కార్యక్రమాలు రూపొందించాలని అధికారులను స్మిత సబర్వాల్ ఆదేశించారు. లైవ్, సూఫీ మ్యూజిక్, ఖవ్వాలీ సంగీత ప్రదర్శనతోపాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 20 నిమిషాల పాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల్ని రూపొందించాలని చెప్పారు. అనంతరం జరిగే వెల్‌కం డిన్నర్‌లో నిజాం వంటకాలు, తెలంగాణ రుచులు మెనూలో ఉండాలని తెలిపారు.

పోలవరం ముంపుపై తృతీయ పక్ష సర్వే

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. ముఖ్య కార్యనిర్వహణ అధికారి అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి పోలవరం చీఫ్ ఇంజనీర్(సీఈ) కంచర్ల నర్సింహమూర్తి, అంతరాష్ట్ర చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్, తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం ప్రసాద్, భద్రాచలం ఎస్ఈ రవికుమార్‌లు హాజరయ్యారు. 1986లో గోదావరికి వచ్చిన వరద కన్నా 2022లో వచ్చిన వరద తక్కువని, అయినప్పటికీ భద్రాచలం పట్టణంలో వారం రోజుల పాటు వరద నిల్వ ఉందని తెలంగాణ ప్రస్తావించింది. భద్రాచలం పట్టణంలో వర్షం ద్వారా వచ్చే వరద ఎనిమిది తూముల ద్వారా గోదావరి నదిలోకి వెళతుందని, పోలవరం నిర్మాణంతో గోదావరి నీటి మట్టం ఎక్కువగా ఉండటంతో తూముల ద్వారా నీరు సజావుగా నదిలోకి వెళ్లడం లేదని, వెనక్కి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కిన్నెరసాని, ముర్రేడువాగుల ప్రవాహంపై 2021లో ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు, పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై 2022లో సుప్రీంకోర్టు ఇచ్చినా ముంపు ముప్పుపై సర్వే చేసి, ముంపు ప్రాంతాలను గుర్తించి, రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలంగాణ మంగళవారం సమావేశంలో ప్రస్తావించింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా తెలుగు రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించిన సీడబ్ల్యూసీ ముంపు ముగిసిన అధ్యాయం అంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిందని గుర్తు చేసింది. ముంపుపై సర్వే చేయకుండా ముగిసిన అధ్యాయం అని ఎలా అంటారని నిలదీసింది.

తొలిదశతో ముంపు సమస్య లేదు: ఏపీ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం రెండు దశల్లో చేపడుతున్నామని, తొలిదశలో 135 అడుగుల ఎత్తునే నిర్మాణం చేపట్టనున్నామని, ఇది పూర్తవడానికి రెండేళ్లు పడుతుందని, తొలిదశతో ఎలాంటి ముంపు సమస్య తలెత్తందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. రెండో దశను 150 అడుగుల ఎత్తుతో చేపడతామని, అప్పుడే ముంపు సమస్య ఉండవచ్చని చెప్పింది. సంయుక్త సర్వే అవసరం లేదని తెలిపింది. ప్రాజెక్టును 150 అడుగుల ఎత్తుతో కట్టడానికి అనుమతులు ఇచ్చినపుడు 150 అడుగుల ఎత్తుతో నీటిని నిల్వ చేయడం వల్ల కలిగే ముంపుపై కచ్చితంగా సర్వే చేయాల్సిందేనని తెలంగాణ పట్టుబట్టింది. ఎన్జీటీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సర్వే చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ముంపు నుంచి రక్షణ కోసం కరకట్టలు నిర్మిస్తే చాలా? లేక పునరావాసం, పునర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలా? చెప్పాలని పోలవరం అథారిటీ తెలంగాణను కోరింది. తొలుత సర్వే చేసి, ముంపు తీవ్రత ఏ విధంగా ఉంటుందో తేల్చాలని, ఏం చేయాలనేది తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ బదులిచ్చింది. దాంతో బ్యాక్ వాటర్ ముప్పుపై తృతీయ పక్షం సర్వే నిర్వహించడానికి పోలవరం అథారిటీ అంగీకరించింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణలో భాగంగా గోదావరి-బనకచర్ల అనుసంధానం చేపట్టారని, ఇక పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి కూడా 18 టీఎంసీలు తరలించాలని ఏపీ ప్రయత్నిస్తోందని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టుకు 449 టీఎంసీలకే అనుమతి ఉందని, దాన్ని మించి ఒక్క చుక్క తరలించడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

సిద్దిపేటలో బర్డ్‌ఫ్లూ కలకలం

- తొగుట మండలం కాన్గల్ లేయర్ ఫామ్‌లో కోళ్లకు వ్యాధి నిర్ధారణ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా తొగుట మండలం కాన్గల్‌లోని పౌల్ట్రీ లేయర్ ఫామ్‌లో బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. కొన్నాళ్లుగా కోళ్ల మృత్యువాత పడుతుండటంపై ఫామ్‌హౌస్ నిర్వాహకులు ఈనెల 3న హైదరబాద్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆ శాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా అధికారులు ఈనెల 4న శాంపిల్స్ సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న ల్యాబ్‌కు పంపారు. మంగళవారం వచ్చిన రిపోర్టులో బర్డ్ ఫ్లూ పాజిటివ్ అని తేలడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాదాపు 20 బృందాలను ఏర్పాటు చేసిన అధికారులు, బుధవారం నుంచి లేయర్ ఫామ్‌లోని షెడ్లలో ఉన్న 1.45 లక్షల కోళ్లను చంపి పూడ్చిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ వారం పాటు జరగనున్నట్లు తెలిసింది. పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకులకు భువనగిరిలోనూ పౌల్ట్రీ ఫామ్ ఉండటం.. అక్కడ మూడు కోళ్లు చనిపోవడంతో అక్కడి కోళ్లకూ బర్డ్‌ఫ్లూ సోకి ఉంటుందా? అని అధికారులు ఆరా తీస్తున్నారు.

గురుకులాల్లో కోడింగ్ కోర్సులు

- ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు అమలు

హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కోడింగ్ కోర్సులను విద్యార్థులకు అందించబోతున్నట్లు టీజీ ఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమలు చేయబోతున్నట్లు ఆమె వివరించారు. ఇందుకు సంబంధించి ఆర్పీఎఫ్, యూకే ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకున్నట్లు తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరం నుంచి 238 గురుకులాల్లో ఈ శిక్షణ ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు. క్రితం ఏడాది కేవలం మొయినాబాద్ పాఠశాలలో మాత్రమే కోడింగ్ శిక్షణ ఉండేదని, ప్రస్తుతం దీనిని రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో విస్తరింపజేయబోతున్నామని వివరించారు.

నేరమేమిటో చెప్పకుండానే నిర్బంధం

- అమెరికాలో భారత మహిళ ఆవేదన
- లగేజీలో పవర్ బ్యాంకు ఉండడంతో అనుమానించిన అధికారులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: చేసిన నేరమేమిటో చెప్పకుండానే అమెరికాలోని అలస్కా విమానాశ్రయంలో 8 గంటల పాటు నిర్బంధించారని భారత మహిళ ఒకరు వాపోయారు. ఇన్‌ఫ్లుయెన్సర్, చాయ్‌పానీ వ్యవస్థాపకురాలు శ్రుతి చతుర్వేది ఈ ఆరోపణ చేశారు. ఆదివారం ఆమె తన స్నేహితురాలు శిల్పతో కలిసి విమానాశ్రయానికి వెళ్లారు. ఇద్దరు వేరువేరు విమానాల్లో బయలుదేరాల్సి ఉంది. తొలుత శిల్ప లగేజీని అక్కడి అధికారులు తనిఖీ చేశారు. ఆమె బ్యాగులో పవర్ బ్యాంకు ఉండడంతో దాన్ని అనుమానించారు. ఆమెను ఒక గదిలో నిర్బంధించారు. దీంతో ఆమె శ్రుతికి మెసేజ్ పెట్టింది. అనంతరం శిల్ప ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఆందోళన చెందిన శ్రుతి అక్కడి పోలీసులను కలిసి సంప్రదించింది. శిల్ప స్నేహితురాలినని చెప్పడంతో ఆమెను కూడా వేరే గదిలో నిర్బంధించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. పురుష అధికారులే ఆమెను తనిఖీ చేశారు. ఈ కారణంగా వెళ్లవలసిన విమానాలు తప్పిపోయాయి. అనంతరం భారత్ చేరుకున్న ఆమె దీనిపై ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

చైనాపై ట్రంప్ బాదుడు 104 శాతానికి!

వాషింగ్టన్, ఏప్రిల్ 8: చైనాపై ట్రంప్ సుంకాల బాదుడు 104 శాతానికి చేరుకుంది! డ్రాగన్ దేశంపై తొలుత 20 శాతం.. ఆ తర్వాత మరో 34 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఆ దేశం తమపై 34% మేర ప్రతీకార సుంకం విధించడాన్ని తట్టుకోలేకపోయారు. ఒక్కరోజులోగా ఆ ప్రతీకార సుంకాన్ని ఉపసంహరించుకోవాలని.. లేకుంటే తాను చైనాపై అదనంగా 50% సుంకాన్ని విధిస్తానని సోమవారం హెచ్చరించారు. అయితే, ట్రంప్ బెదిరింపులకు చైనా తలొగ్గలేదు. పైగా.. ఇలాంటి బెదిరింపులకు తాము లొంగబోమని, అమెరికాతో తుదికంటా పోరాడుతామని, తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రతీకారచర్యలు తీసుకుంటామని తెగేసి చెప్పింది. దీంతో చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారని శ్వేతసౌధం వర్గాలు వెల్లడించాయి.

మహిళలకు కర్ణాటక హోంమంత్రి క్షమాపణ

బెంగళూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బెంగళూరు వంటి మహానగరాలలో లైంగిక దౌర్జన్యాలు సాధారణమని వ్యాఖ్యానించిన కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్, మరుసటి రోజునే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, వక్రీకరించారని అన్నారు. తాము మహిళల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తన వ్యాఖ్యలు మహిళలకు బాధ కలిగించి ఉంటే క్షమించాలని కోరారు. సుద్దగుంటపాళ్యలో ఈనెల 3న నడిచి వెళుతున్న ఇద్దరు యువతులలో ఒకరిని ఆగంతకుడు వెంబడించి కౌగిలించుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై సోమవారం మీడియా ప్రశ్నించగా.. బెంగళూరు లాంటి మహానగరాల్లో ఇలాంటి ఘటనలు సాధారణమన్నారు.

తాగి వాహనం నడిపిన రాజస్థాన్ కాంగ్రెస్ నేత

- పాదచారులపైకి దూసుకెళ్లిన కారు.. ముగ్గురి మృతి

జైపూర్, ఏప్రిల్ 8: తప్ప తాగి వాహనం నడిపిన ఓ రాజస్థాన్ నేత కారణంగా ముగ్గురు అమాయకులు మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం జైపూర్‌లోని నహర్‌గఢ్ ప్రాంతంలో జరిగింది. వ్యాపారవేత్త, జైపూర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడైన ఉస్మాన్ ఖాన్ (62) పూటుగా మందుతాగి కారు నడిపారు. నహర్‌గఢ్ ప్రాంతంలో ఇరుకైన రోడ్డులో వెళ్తుండగా వాహనంపై నియంత్రణ కోల్పోయిన ఆయన ముందు వెళ్తున్న ఓ ద్విచక్రవాహనంతో పాటు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న పలువురు పాదచారులను ఢీకొట్టి ఆగకుండా కారును అలాగే ముందుకు పోనిచ్చారు. నహర్‌గఢ్ పోలీసు స్టేషన్ ముందు ఆగి ఉన్న బైకలను ఢీకొని కారు ఆగింది. ఉస్మాన్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బిల్లుల ఆమోదానికి గవర్నర్ కాలయాపన

చట్టవిరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సంచలన తీర్పు వెలువరించింది. ఇకపై ఆ బిల్లులకు సంబంధించి రాష్ట్రపతి ఏవైనా చర్యలు తీసుకున్నా, అవి చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. అలాగని, తాము గవర్నర్ల అధికారాలను తక్కువ చేయట్లేదని పేర్కొన్న కోర్టు.. గవర్నర్లు తీసుకునే చర్యలన్నీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ఉండాలని, ఆ సంప్రదాయాలకు గౌరవమివ్వాలని హితవు పలికింది. మాజీ ఐపీఎస్ అధికారి, కేంద్ర దర్యాప్తు సంస్థలో సైతం పనిచేసిన ఆర్ఎన్ రవి తమిళనాడు గవర్నర్‌గా 2021లో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచీ ఆయనకు స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు సర్కారుకు మధ్య బిల్లుల ఆమోదం విషయంలో ఘర్షణ కొనసాగుతూనే ఉంది. దీంతో.. తాము పంపిన పలు బిల్లుల్లో 10 బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకుండా అనవసర కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ తమిళనాడు సర్కారు 2023 నవంబరులో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు గడువును నిర్దేశించాలని కూడా ప్రభుత్వం తన పిటిషన్‌లో కోరింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుల విషయంలో గవర్నర్ ముందు మూడే మార్గాలు ఉంటాయని ధర్మాసనం పేర్కొంది. ఒకటి.. ఆయా బిల్లులను ఆమోదించడం, రెండు.. వాటిని పెండింగ్‌లో ఉంచి ప్రభుత్వం నుంచి వివరణ కోరడం, మూడు.. ఏదైనా బిల్లు రాజ్యాంగానికి, ఆదేశసూత్రాలకు లేదా ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ఉందని భావించినా, జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశంగా భావించినా దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపడం అని గుర్తుచేసింది. ఒకవేళ బిల్లుకు సమ్మతి తెలపకూడదని భావిస్తే గవర్నర్ దాన్ని తన వద్ద పెట్టుకోకూడదని.. పునఃపరిశీలించాలని కోరుతూ తప్పనిసరిగా అసెంబ్లీకి తిప్పి పంపాలని స్పష్టం చేసింది. శాసనసభ దాన్ని మరోసారి యథాతథంగా ఆమోదించి మళ్లీ గవర్నర్ వద్దకు పంపితే దానికి సమ్మతి తెలపడం మినహా గత్యంతరం లేదని, దాన్ని పెండింగ్‌లో పెట్టలేరని, రాష్ట్రపతి పరిశీలనకు పంపలేరని తేల్చిచెప్పింది. ఒకవేళ.. రెండోసారి పంపిన బిల్లు గనక మొదటిదానికన్నా భిన్నంగా ఉంటే మాత్రమే రాష్ట్రపతి పరిశీలనకు పంపగలరని వివరించింది. రాజ్యాంగంలో గవర్నర్‌కు వీటో అధికారం ఉన్నట్లు ఎక్కడా పేర్కొనలేదని గుర్తుచేసింది. బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి సంబంధించి ఆర్టికల్ 200లో నిర్దిష్ట కాలపరిమితి విధించకపోయినంతమాత్రాన.. గవర్నర్ వాటిపై ఏ నిర్ణయమూ తీసుకోకుండా కాలయాపన చేసి, పాలనా యంత్రాంగానికి అడ్డంకిగా నిలవరాదని స్పష్టం చేసింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఏ నిర్ణయమూ తీసుకోకపోతే అవి ఉత్తి కాగితాలుగా, మాంసం లేని అస్థిపంజరంగా మిగిలిపోతాయని ఆందోళన వెలిబుచ్చింది. రాజ్యాంగంలోని అధికరణ 200 ప్రకారం గవర్నర్ తీసుకునే ఏ నిర్ణయమైనా న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది.

గడువు పరిమితమే...

రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించడానికి నిర్ణీత గడువు గురించి ఎక్కడా ప్రస్తావించకపోయినా.. గవర్నర్ వాటిని నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడానికి వీలున్నట్లు భావించకూడదన్నారు. రాజ్యాంగంలో ఇలా నిర్ణీత గడువులు సూచించని విషయాలలో తగు నిర్ణయాన్ని అందరికీ ఆమోదయోగ్యమైన గడువులోగా తీసుకోవాలనే భావించాలన్నారు. ఈ నేపథ్యంలో.. గవర్నర్ ఏదైనా బిల్లును పెండింగ్‌లో ఉంచడానికి, ఆమోదించడానికి ఒకటి నుండి మూడు నెలలను గడువుగా నిర్ణయిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది. ఆర్టికల్ 200 కింద తన అధికారాలను వినియోగించే క్రమంలో గవర్నర్ మంత్రివర్గం సూచనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిందేనని కోర్టు ఈ సందర్భంగా తేల్చిచెప్పింది.

అంబేడ్కర్ వ్యాఖ్యను ఉటంకించిన సుప్రీం

గవర్నర్ రవికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై వెలువరించడానికి ముందు ధర్మాసనం.. 'రాజ్యాంగం ఎంత ప్రయోజనకరమైనదైనా, దానిని అమలు చేసేవారు మంచివారు కాకపోతే, అది చెడ్డదే అవుతుంది' అన్న డాక్టర్ అంబేడ్కర్ సూక్తిని ఉటంకించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 10 బిల్లులపై గవర్నర్ రవి తీసుకున్న చర్యలు నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాక, ఘోరతదప్పిదమని చెప్పడం తప్ప తమకు మరో మార్గం లేదని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. పాలనా వ్యవహారాల్లో గవర్నర్ అప్రమత్తంగా వ్యవహరించాలి తప్ప అడ్డంకి కాకూడదని తేల్చిచెప్పింది.



గవర్నర్ ఎలా ఉండాలంటే..

గవర్నర్ ప్రవర్తన ఎలా ఉండాలనే అంశంపై సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది.

- గవర్నర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి వ్యవహరించాలి.
- రాష్ట్ర ప్రభుత్వంతో రాజకీయంగా వ్యవహరించకుండా, ప్రభుత్వ సన్నిహితుడిగా వ్యవహరించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ.. ఎన్నికైన ప్రభుత్వానికి అడ్డుగోడలా వ్యవహరించకూడదు.
- ఎల్లప్పుడూ రాజ్యాంగ విధులను సక్రమంగా నిర్వర్తించాలి. తాను చేసిన ప్రమాణస్వీకారానికి కట్టుబడి పనిచేయాలి.
- తాను తీసుకునే చర్యలు జనామోదానికి దగ్గరగా ఉన్నాయా, రాజ్యాంగం ప్రకారం ఉన్నాయా అనే స్వీయపరిశీలన చేసుకోవాలి.

ఇకపై సీఎం స్టాలినే వర్సిటీలకు చాన్స్‌లర్

సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై డీఎంకే సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్ హర్షం వ్యక్తం చేశారు. "రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రే చాన్స్‌లర్‌గా వ్యవహరించేలా శాసనసభలో ఆమోదించిన బిల్లుకు కూడా ధర్మాసనం ఆమోదం తెలిపిన నేపథ్యంలో.. గవర్నర్ రవి చాన్స్‌లర్ పదవిని కోల్పోయారు. ఇకపై సీఎం స్టాలినే చాన్స్‌లర్‌గా వ్యవహరించి.. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల వీసీల నియామకాలు చేస్తారు" అని ఆయన వివరించారు.

తీర్పు చరిత్రాత్మకం: స్టాలిన్

రాష్ట్ర అసెంబ్లీ రూపొందించిన బిల్లుల్ని ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చరిత్రాత్మక తీర్పుగా తమిళనాడు సీఎం స్టాలిన్ అభివర్ణించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో ఉండగా సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. దీని గురించి ఆయన సంతోషంగా సభకు సమాచారం అందించారు. ఈ తీర్పు తమిళనాడుకు మాత్రమే కాక.. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకూ దక్కిన విజయమని వ్యాఖ్యానించారు. కాగా, సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా, సీనియర్ నేత ఆర్ఎస్ భారతి అందరికీ మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు.. తన వివాదాస్పద వ్యవహారశైలితో సుప్రీంకోర్టు చేత అక్షింతలు వేయించుకున్న గవర్నర్ రవి తక్షణమే ఆ పదవికి రాజీనామా చేసి, రాజ్‌భవన్‌ను వీడాలని డీఎంకేతో పాటు దాని మిత్ర పక్షాలు డిమాండ్ చేశాయి. రవికి ఏమాత్రం ఆత్మగౌరవం వున్నా, తక్షణమే రాష్ట్రాన్ని వీడివెళ్లాలని డీఎంకే, సీపీఎం డిమాండ్ చేశాయి. సుప్రీం తీర్పు బీజేపీ పాలకులకు చెంపపెట్టులాంటిదని కాంగ్రెస్ అభివర్ణించగా, అన్ని రాష్ట్రాలకూ అనుకూలమైన తీర్పు అని సీపీఐ పేర్కొంది. గవర్నర్ల ద్వారా రాజ్యాన్ని నడపాలనుకుంటున్న బీజేపీ పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని డీపీఐ కటువుగా వ్యాఖ్యానించింది.

అవాస్తవిక షరతులతో క్లెయింల నిరాకరణ వద్దు

- రూల్స్ ఉద్దేశం పరిహారం ఎగవేత కాదు
- బీమా కంపెనీలకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: బీమా క్లెయింల చెల్లింపు విషయమై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. పాలసీల్లో ఆచరణ సాధ్యం కాని నిబంధనలు, షరతులు పెట్టి, వాటిని పాటించలేదన్న కారణంతో పరిహారం చెల్లింపును తిరస్కరించడం తగదని స్పష్టం చేసింది. పాలసీదారుని చేతిలో లేని కారణాలను సాకుగా చూపించి క్లెయింలను నిరాకరించలేవని పేర్కొంది. వినియోగదారులతో బీమా కంపెనీలు 'నిజాయతీ, పారదర్శకత'తో వ్యవహరించాలని సూచించింది. 'పాలసీలో ఆచరణకు సాధ్యం కాని, వాస్తవ రూపంలో సాధించలేని షరతులు, నిబంధనలను విధించి ఉంటే వాటిని అమలు చేయాల్సిన పనిలేద'ని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రల ధర్మాసనం సోహం షిప్పింగ్ సంస్థకు సంబంధించిన కేసులో తీర్పునిచ్చింది.

పెట్రోల్ బంక్‌లో టాయిలెట్‌కు తాళం.. యజమానికి 1.65 లక్షల ఫైన్

కోజికోడ్, ఏప్రిల్ 8: పెట్రోల్ బంక్‌లో టాయిలెట్‌కు తాళం వేసినందుకు సదరు బంక్ యజమానికి రూ.1.65 లక్షల జరిమానా పడింది. ఈ ఘటన కేరళలో జరిగింది. 2024 మే 8న రాత్రి 11 గంటల సమయంలో పతనంతిట్ట జిల్లాకు చెందిన జయకుమారి అనే ఉపాధ్యాయురాలు కారులో వెళ్తూ కోజికోడ్ జిల్లా పయ్యోలిలోని పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకున్నారు. ఆతర్వాత ఆమె టాయిలెట్‌కోసం వెళ్లగా తాళంవేసి కనిపించింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మేనేజర్ టాయిలెట్ తాళం తీసుకుని ఇంటికి వెళ్లిపోయారని చెప్పారు. దాంతో ఆమె పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తాళం పగులగొట్టి టాయిలెట్‌ను తెరిపించారు. తర్వాత జయ వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేశారు. ఫోరం బంక్ యజమానికి రూ.1.65 లక్షల జరిమానా విధించింది.

అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: వక్ఫ్ సవరణ చట్టం అమల్లోకి వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వక్ఫ్ సవరణ చట్టం (యాక్ట్ 14 ఆఫ్ 2025)లోని నిబంధనలు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. మరోవైపు వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకూడదని కోరుతూ మంగళవారం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్‌వి ముస్లింలను ప్రసన్నం చేసుకునే రాజకీయాలని, 2013లో యూపీఏ తీసుకువచ్చిన వక్ఫ్ చట్టంతో పేద ముస్లింలు వివక్షకు గురయ్యారని ప్రధాని మోదీ అన్నారు. పాత వక్ఫ్ చట్టంతో పేద పస్మండ ముస్లింలకు ఒరిగిందేమీ లేదన్నారు. "యూపీఏ వక్ఫ్‌తో ల్యాండ్ మాఫియా, ఛాందసవాదులకు భూములను ఆక్రమించుకునే వెసులుబాటు కలిగింది" అని విమర్శించారు.

అమెరికా కలలు

కల్లలు!



(మొదటి పేజీ తరువాయి)

అత్యవసరంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. తాజా బిల్లు ఆమోదం పొందితే వర్క్ వీసాకు మారే అవకాశం లేకుండానే ఓపీటీ అర్ధంతరంగా ముగుస్తుందని, దీంతో విదేశీ విద్యార్థులు తక్షణం అమెరికాను వీడాల్సి రావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఓపీటీ హోదాలో ఉన్న విద్యార్థులు వెంటనే హెచ్-1బీకి మారాలని, లేదా ఇతర దేశాల్లో అవకాశాలను పరిశీలించాలని సూచిస్తున్నారు. ఓపీటీ రద్దయితే అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని భావించేవారు కూడా యూకేలో అమలు చేస్తున్న విధంగా వారి చదువులు ముగిసిన తర్వాత స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులపై ఆర్థికంగానూ పెనుభారం పడుతుంది. అమెరికా స్థాయి సంస్థల నుంచి ఏళ్ల తరబడి వచ్చే జీతాలు కోల్పోవడంతో పెద్దమొత్తంలో తీసుకున్న విద్యారుణాలను తిరిగి చెల్లించడంలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకసారి అమెరికా విడిచి వెళ్తే తిరిగి ప్రవేశించడానికి అనుమతి లభించడం కష్టమేనని, వేసవి సెలవుల్లో స్వదేశాలకు వెళ్లొద్దని కార్నెల్, కొలంబియా, యేల్ తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలు విదేశీ విద్యార్థులకు అనధికారికంగా సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలామంది భారత విద్యార్థులు ఇప్పటికే తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు.

ఓపీటీ అంటే ఏమిటి?

ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12 నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ అనుమతిస్తుంది. స్టెమ్(ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని అదనంగా మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ పని అనుభవం వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. నైపుణ్యం కలిగిన విదేశీయులు మరో ఆరేళ్ల పాటు అమెరికాలో పనిచేయడానికి ఈ వీసా అనుమతిస్తుంది.

విద్యార్థి వీసాలకూ ట్రంప్ ఎసరు

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థులు ప్రస్తుతం అక్కడ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గతంలో ఎప్పుడో కారును మితిమీరిన వేగంతో నడిపారనో, లైసెన్స్ లేదనో ఏదో ఒక సాకుతో ఇమిగ్రేషన్ అధికారులు వారి ఎఫ్-1 వీసాలు రద్దు చేసి, విమానం ఎక్కిస్తున్నారు. తాము ఎప్పుడో గతంలో చేసిన ఉల్లంఘనలను అప్పుడే చట్టపరంగా పరిష్కరించుకున్నామని, ఇప్పుడు వాటిని తిరగదోడి శిక్ష విధించడం అన్యాయమని వాపోతున్నారు. భారత్ సహా విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు చేస్తున్న ఘటనలు పెరుగుతుండటంపై ఆయా వర్సిటీల అధికారులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ డేటాబేస్ పరిశీలించే వరకూ తమతో పాటు బాధిత విద్యార్థులకు కూడా దీనిపై ఎలాంటి సమాచారం ఉండటం లేదని, వీసా రద్దుకు గల కారణాలను అందులో అధికారులు పేర్కొనడం లేదని పేర్కొంటున్నారు. కాగా, డ్రైవింగ్ ఉల్లంఘనలు వంటి చిన్నపాటి ఉల్లంఘనల కారణంగా తమ వీసాలను రద్దు చేశారని ఆరోపిస్తూ ఇద్దరు గుర్తుతెలియని విద్యార్థులు తాజాగా ఫెడరల్ కోర్టులో దావా వేశారు. ఈ అంశానికి సంబంధించి టెక్సాస్‌కు చెందిన ఒక న్యాయవాది దాదాపు 30 కేసులు వాదిస్తున్నారు. వీసా రద్దు అంశంలో న్యాయ సహాయం కోరుతూ భారతీయ విద్యార్థుల నుంచి పిటిషన్లు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మరోవైపు, విద్యార్థి వీసాల రద్దు కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) మార్చి చివరి నుంచి ప్రారంభించింది. ఇప్పటి వరకూ 150 మందికి పైగా విద్యార్థుల వీసాలు రద్దయ్యాయని తెలుస్తోంది.

రోజుకు రూ.86 వేలు జరిమానా!

బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత కూడా దేశం విడిచి వెళ్లని అక్రమ వలసదారులకు భారీ జరిమానాలు విధించాలని ట్రంప్ సర్కారు యోచిస్తోంది. రోజుకు దాదాపు రూ.86 వేలు చొప్పున జరిమానా కట్టాలని లేకుంటే వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతోంది. స్వీయ బహిష్కారణల కోసం ఉద్దేశించిన సీబీపీ హోం యాప్‌లో నమోదు చేసుకుని, తుది ఆదేశాలు వెలువడిన తర్వాత కూడా దేశాన్ని విడిచి పెట్టకపోతే రోజువారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని డీహెచ్ఎస్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ జరిమానాలకు సంబంధించిన 1996 నాటి చట్టాన్ని ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో తొలిసారిగా అమలు చేశారు.

9.85 లక్షల మంది వలసదారులకు ఝలక్

బైడెన్ హయాంలో సీబీపీ వన్ యాప్ ద్వారా అమెరికాలోకి ప్రవేశించిన లక్షలాది మందికి ట్రంప్ సర్కారు షాక్ ఇచ్చింది. అప్పట్లో తాత్కాలిక నివాస అనుమతులు పొందిన దాదాపు 9.85 లక్షల మందికి పెరోల్ రక్షణను రద్దు చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రకటించింది. వారంతా వెంటనే స్వచ్ఛందంగా దేశం విడిచి పోవాలని స్పష్టం చేసింది. ఈ నోటీసులు అందుకున్న వారంతా వెంటనే సీబీపీ హోం యాప్‌లో స్వీయ బహిష్కరణకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

అమెరికా టారిఫ్‌లపై చర్చలే మార్గం: జైశంకర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లపై ప్రతీకార సుంకాలు విధించాలని పలు దేశాలు భావిస్తుండగా, భారత్ మాత్రం చర్చల మార్గాన్ని ఎంచుకొంది. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. ఆయన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో ఫోనులో చర్చలు జరిపారు. ఇరు దేశాలు త్వరగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించారు. దీనిపై మరిన్ని సంప్రదింపులు జరపాలని ప్రతిపాదించారు. ప్రధాని మోదీ జరిపిన అమెరికా పర్యటనలో రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు.

కాంగ్రెస్ దిద్దుబాటు!



మంగళవారం సబర్మతీ ఆశ్రమంలో నిర్వహించిన ప్రార్థనలో కాంగ్రెస్ అగ్ర నేతలు ఖర్గే, సోనియా, రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

అంశాలు, తీసుకున్న నిర్ణయాలను కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. "పార్టీకి పునర్వైభవం తేవడంపై సీడబ్ల్యూసీ భేటీలో సుదీర్ఘంగా చర్చించాం. ఈ ఏడాది మొత్తం పార్టీ పునర్నిర్మాణానికి కేటాయించాలని నిర్ణయించాం. భారీ స్థాయిలో పార్టీ పునర్వ్యవస్థీకరణ చేపడతాం. దీనికి సంబంధించిన ప్రణాళిక, మార్గదర్శకాల రూపకల్పనలో పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు నిమగ్నమయ్యారు.." అని తెలిపారు.

జిల్లా అధ్యక్షులకు ప్రాధాన్యత..

పార్టీలో జిల్లా (డీసీసీ) అధ్యక్షులకు ప్రాధాన్యత కల్పించనున్నట్టు కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. జిల్లా అధ్యక్షులకు పార్టీలో మరిన్ని అధికారాలు, బాధ్యతలు అప్పగించే అంశంపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నామని, త్వరలోనే అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇక సర్దార్ పటేల్ చూపిన మార్గంలో కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని, ఈ మేరకు సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేశామని కేసీ వివరించారు. "పటేల్ బ్రిటిష్ వారికి ఎదురొడ్డి నిలిచారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాడారు. గాంధీ హత్య అనంతరం మతవాద శక్తులను వ్యతిరేకించారు. ఇప్పుడు ప్రజలకు న్యాయం చేయడం కోసం పటేల్ చూపిన మార్గాన్ని కాంగ్రెస్ అనుసరిస్తుంది." అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బలంగా తలపడేలా పార్టీని బలోపేతం చేస్తామని, ఆ దిశగా పార్టీ జిల్లా విభాగాలు, అధ్యక్షులకు అధికారాలు, బాధ్యతలు అప్పగిస్తామని పార్టీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ చెప్పారు. పోలింగ్ బూత్ స్థాయి వరకు చేరేలా విస్తృతంగా పాదయాత్రలు, ఇతర కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సీడబ్ల్యూసీ సమావేశాల చివరి రోజు బుధవారం 'న్యాయ్ పథ్' పేరుతో తీర్మానం చేయనున్నామని, ఇది చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందని పేర్కొన్నారు.

'విద్వేష అగాధంలోకి దేశం'

మతవాదం, హింసతో దేశం విద్వేష అగాధంలోకి కూరుకుపోతోందంటూ సీడబ్ల్యూసీ తీర్మానం చేసింది. "మతపరమైన ఉన్మాదంపై పోరాడేందుకు సర్దార్ పటేల్ మార్గాన్ని అనుసరిస్తాం. మన స్వాతంత్ర్య ఉద్యమం మీద, గాంధీ-నెహ్రూ-పటేల్‌ల నాయకత్వం మీద దాడి జరుగుతోంది. విద్వేష శక్తులను ఓడించేందుకు, వారి అబద్ధాలను బయటపెట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది" అని తీర్మానంలో పేర్కొంది. అహ్మదాబాద్‌లో 'న్యాయ్ పథ్: సంకల్ప్, సమర్పణ్, సంఘర్ష్' పేరిట నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ సమావేశాలు బుధవారం ముగియనున్నాయి. చివరి రోజు ప్రధాన సదస్సులో 1,700 మందికిపైగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఏఐసీసీ సభ్యులు పాల్గొననున్నారు.

పటేల్ అసలైన వారసత్వం కాంగ్రెస్‌దే: ఖర్గే

దేశం కోసం పోరాడిన జాతీయ నాయకులపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలకు పాల్పడుతున్నాయని.. వారి గురించి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏమాత్రం భాగస్వామ్యం లేని సంఘ్ పరివార్ నేతలు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడం కోసం మతపరమైన విభజనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మంగళవారం అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో ఖర్గే మాట్లాడారు. పటేల్, నెహ్రూ ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల్లాంటి వారని, వారి మధ్య ఎంతో అనుబంధం ఉన్నా, విభేదాలు ఉండేవంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పటేల్ భావజాలానికి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు పూర్తి విరుద్ధమని, ఆర్ఎస్ఎస్‌ను ఆయన నిషేధించారని ఖర్గే గుర్తుచేశారు. అలాంటి సంఘ్ పరివార్ నేతలు తాము పటేల్ వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 31న పటేల్ 150వ జయంతిని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

20 ఏళ్లుగా గుండె ఆపరేషన్ చేస్తున్న దొంగ డాక్టర్



(మొదటి పేజీ తరువాయి)

పిలుస్తున్నారు. జుట్టుకు బంగారు రంగు వేసుకుని శ్వేతజాతీయుడిలా కనిపించేందుకు జాగ్రత్తలు తీసుకొనే ఇతను 2006లో ఏకంగా ఛత్తీస్‌గఢ్ స్పీకర్‌కు బిలాస్‌పూర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి అతని చావుకు కారణమయ్యాడని ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తోంది. అంటే దాదాపు రెండు దశాబ్దాలుగా డెత్ డాక్టర్ ఆపరేషన్లు చేస్తున్నాడన్న మాట. ఇతని అసలు పేరు నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అని పోలీసులు చెబుతున్నారు. స్వస్థలం డెహ్రాడూన్. డజన్ల కొద్దీ ఫేక్ డిగ్రీలు సిద్ధం చేసి పెట్టుకున్నాడు. ఆసుపత్రి ప్రొఫైల్‌ను బట్టి సూట్ అయ్యే డిగ్రీలు బయటకు తీస్తాడు. అతని దగ్గర ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ కూడా ఉంది. కార్డియాలజీకి సంబంధించి అతని దగ్గర అనేక స్పెషల్ పట్టాలు ఉన్నాయి. దేశ, విదేశాల్లోని ప్రముఖ ఆసుపత్రుల్లో పని చేసినట్లు క్రెడెన్షియల్స్ ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని దమోహ్‌లో ఉన్న మిషనరీ ఆసుపత్రి కార్డియాక్ సర్జన్‌ను నియమించుకోవాలని అనుకుంది. ప్లేస్‌మెంట్ ఏజెన్సీని సంప్రదించింది. తాను బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత కార్డియాక్ సర్జన్‌ను అని, మానవ సేవలో భాగంగా భారతదేశంలో పని చేయడానికి ఆసక్తి చూపుతున్నానని చెప్పడంతో ఆసుపత్రి యాజమాన్యం బుట్టలో పడిపోయింది. అతని భాష, వంటి రంగు, బంగారు రంగు జుట్టు చూసి బ్రిటన్ జాతీయుడేనని అనుకున్నారు. నెలకు రూ.8 లక్షల జీతంతో అయన్ను నియమించుకున్నారు. ఎన్.జాన్ కామ్ అలియాస్ నరేంద్ర ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఆసుపత్రిలో పని చేశాడు. తన చేతుల మీదుగా 15 ఆపరేషన్లు చేస్తే అందులో ఏడుగురు మరణించారు. పేషంట్ల బంధువులు వచ్చి ఫిర్యాదు చేయడంతో జిల్లా వైద్యాధికారి దర్యాప్తు చేశారు. డాక్టర్ కామ్ సరైన డిగ్రీలు లేకుండా యాంజియోగ్రఫీ, యాంజియోప్లాస్టీ చేసినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే దొంగ డాక్టర్ రాజీనామా చేసి పరారయ్యాడు. చివరకు ప్రయాగరాజ్‌లో పట్టుకున్నారు. అతను జీవిత కాలంలో 15 వేల ఆపరేషన్లు చేసినట్లుగా ప్రొఫైల్‌లో చెప్పుకున్నాడు. 2006లో అప్పటి అసెంబ్లీ స్పీకర్ రాజేంద్ర ప్రసాద్ శుక్లాకు గుండె నొప్పి వచ్చినపుడు బిలాస్‌పూర్‌లోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. లండన్ నుంచి వచ్చిన ప్రముఖ వైద్యుడు ఆపరేషన్ చేస్తాడని అప్పట్లో ఆసుపత్రి యాజమాన్యం చెప్పింది. ఆపరేషన్ తర్వాత స్పీకర్ చనిపోయారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.